తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM తాడేపల్లిగూడెం : fb.com/vaartha Digital

Published from Tadepalligudem, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Srikakulam

5-4-2026 ఆదివారం సంపుటి: 32 సంచిక: 64 పేజీలు: 8+4 వెల: 8.00







ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు

సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు

ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

తాడేపల్లిగూడెం : fb.com/vaartha Digital

Published from Tadepalligudem, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Srikakulam

5-4-2026 ఆదివారం సంపుటి: 32 సంచిక: 64 పేజీలు: 8+4 వెల: 8.00



భగ్గుమన్న కంటైనర్ ఆహుతైన ఆటోలు రూ.32 లక్షల ఆస్తి నష్టం 2లో

వైభవంగా ఒంటిమిట్ట కోదండరాముడి చక్రస్నానం 5లో


# ఇక వడివడిగా అమరావతి



శనివారం అమరావతి నిర్మాణ పనులపై కాంట్రాక్టు సంస్థల ప్రతినిధులతో చర్చిస్తున్న సిఎం చంద్రబాబు. చిత్రంలో మంత్రి నారాయణ, అధికారులు

## అవి బిల్డింగ్‌లు కావు.. రాజధాని సౌధాలు

### గ్రీన్‌ఛానెల్ ద్వారా ఇసుక, గ్రావెల్

### ప్రభుత్వశాఖలు, అధికారులు సమన్వయంతో పని చేయాలి

### నిర్మాణ పనులపై సమీక్షలో సిఎం చంద్రబాబు

**విజయవాడ, ఏప్రిల్ 4,ప్రభాతవార్తప్రతినిధి:** అమరావతి రాజధాని నిర్మాణ పనులను సకాలంలో పూర్తిచేసి తీరాల్సిందేనని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. నిర్దేశించుకున్న సమయానికి పనులు పూర్తి చేసి ప్రధానితో ప్రారంభోత్సవం చేస్తామని, ఈ మేరకు పనులు వేగంగా చేపట్టి పూర్తి చేసేలా కాంట్రాక్టర్లు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ మేరకు అధికారులు కూడా పనుల్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. రాజధాని నిర్మాణ పనులను ఓ కాంట్రాక్ట్ వర్క్ అన్నట్టుగా భావించవద్దని చరిత్రలో భాగస్వాములు అవుతున్నట్టుగా భావించాలన్నారు. శనివారం క్యాంప్ కార్యాలయంలో రాజధానిలో నిర్మాణ పనులు చేపట్టిన వివిధ కాంట్రాక్టు సంస్థలతో ముఖ్యమంత్రి చంద్రబాబు సమావేశమయ్యారు. ప్రస్తుతం రాజధానిలో వివిధ దశల్లో రూ.57,821 కోట్ల విలువైన పనులు ఉండగా వాటిల్లో రూ. 50,943కోట్ల పనులు గ్రౌండ్ అయ్యాయని అధికారులు సీఎంకు వివరించారు. హౌసింగ్, రోడ్లు, ట్రంక్ ఇన్ఫ్రాస్ట్రక్చర్, ఎల్పీఎస్ మౌలిక సదుపాయలతో పాటు అసెంబ్లీ, హైకోర్టు, సచివాలయం వంటి ఐకానిక్ భవనాల నిర్మాణ పనుల పురోగతిని సీఎం సమీక్షించారు. ప్రస్తుతం రాజధాని నిర్మాణ పనుల్లో మొత్తంగా 20 వేల మంది కార్మికులు, నిపుణులు పని చేస్తున్నారని అధికారులు తెలిపారు. అలాగే ఏ నిర్మాణ సంస్థ ఎంత మేర పనులు చేసింది...లక్ష్యాన్ని ఎంత మేరకు చేరుకున్నారనే విషయంలో పనుల వారీగా సీఎం చర్చించారు. పనుల్లో జాప్యం చేస్తున్న కాంట్రాక్ట్ సంస్థల తీరు పట్ల సీఎం అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ క్రమంలో నిర్మాణ పనులకు అవసరమైన మ్యాన్‌పవర్ విషయంలో కొన్ని ఇబ్బందులు ఉన్నాయని కాంట్రాక్టర్లు సీఎం దృష్టికితెచ్చారు. వివిధ రాష్ట్రాల్లో ఎన్నికలు జరుగుతున్న దృష్ట్యా చాలా మంది కార్మికులు వెళ్లారని నిర్మాణ సంస్థ ప్రతినిధులు చెప్పారు. స్థానికంగా నైపుణ్యమున్న మ్యాన్ పవర్ ఎంత వరకు అందుబాటులో ఉంటుందో చూసి వినియోగించుకోవాలని సీఎం సూచించారు.రాజధాని పనుల్లో ఎంత మెషినరీని వినియోగిస్తున్నారనే అంశం పైనా సీఎం ఆరా తీశారు. రాజధాని పనుల్లో 5,580 మెషినరీ అవసరముండగా ప్రస్తుతం 3767 మెషనరీ ఉందని అధికారులు వివరించారు. ఇవి కాకుండా హాట్ మిక్స్ 16, వెట్ మిక్స్ మెషిన్లు 36, ఆర్ఎంసీ మిషన్లు 34 ఉన్నాయని తెలిపారు. వారం, నెల వారీగా టార్గెట్‌లు పెట్టుకుని రాజధాని పనులు చేపట్టాలని సీఎం ఆదేశించారు. ప్రస్తుతం జరు గుతున్న పనులను నిర్దేశించుకున్న టార్గెట్లను విశ్లేషిస్తే >>2



బుషెహర్ అణువిద్యుత్ కేంద్రంపై ఇజ్రాయెల్ దాడి దృశ్యం

# హోరా హోరీ

### అమెరికా ఎంక్యూడ్రోన్ కూల్చివేసిన ఇరాన్

### బుషెహర్ అణువిద్యుత్‌కేంద్రంపై ఇజ్రాయెల్ దాడి

### ఇరాన్ పెట్రో కెమికల్ కంపెనీలే అమెరికా, ఇజ్రాయెల్‌ల టార్గెట్

### 48 గంటల గడువు మాత్రమే మిగిలిందని హెచ్చరించిన ట్రంప్

**టెహ్రాన్,టెల్‌అవీవ్,వాషింగ్టన్, ఏప్రిల్ 4:** పశ్చిమాసియాలో నెలరోజులు దాటి ఇరాన్‌యుద్ధం మరింతగా ముదురుతోంది. ఇక 48 గంటలే మీకు గడువు ఉందని ఆపై హార్ముజ్ జలసంధిని ఎలా తెరిపించాలో మాకు తెలుసు అంటూ ట్రంప్ ఇచ్చిన వార్నింగ్‌లను ఇరాన్ బేఖాతరుచేస్తోంది. క్షేత్రస్థాయిలో భూతల దాడులకు దిగితే ఎ లా ఉంటుందో మేం కూడా >>2

## మాచర్ల ఘటన నిందితుడిని అరెస్టు చేయండి: సిఎం ఆదేశం

**విజయవాడ,ఏప్రిల్4,ప్రభాతవార్తప్రతినిధి:** మాచర్ల పట్టణంలో ఓ ప్రభుత్వ ఉద్యోగినిపై ఆగంతకుడు అత్యాచార ఘటనలో త్వరితగతిన నిందితుణ్ని అరెస్టు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు పోలీసు అధికారులను ఆదేశించారు. నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవడం ద్వారా మహిళలపై నేరాలకు పాల్పడే వారిని ఎట్టిపరిస్థితుల్లోనూ ఉపేక్షి ంచేది లేదని చెప్పాలని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. పంచాయి తీరాజ్ శాఖలో కార్యాలయ సబార్డినేట్‌గా పనిచేస్తున్న మహిళ ఇంట్లోకి ఒక అగం తకుడు చొరబడి అత్యాచారానికి పాల్పడి నట్లు సీఎంకు అధికారులు తెలిపారు. అయితే కేసుకు సంబంధించి >>2

### హైదరాబాద్-విజయవాడ

## ఒక్క గంటలోనే..

**విజయవాడ ఏప్రిల్ 4 ప్రభాతవార్త ప్రతినిధి:** హైదరాబాద్ నుంచి విజయవాడ, కృష్ణా, గుంటూరు జిల్లాలకు వెళ్లే ప్రయాణీకులకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది.ప్రయాణాన్ని త్వరగా పూర్తీ చేసేందుకు మరిన్ని విమాన సీర్వసులను అందుబాటులోకి వచ్చాయి. ఇప్పటికే ఈ దిశలో కేంద్రం నిర్ణయం తీసుకుంది. కొత్త విమానాలు ఏప్రిల్ 10 నుంచి ఏప్రిల్ 17 నుండి అందుబాటులోకి రానున్నాయి.విజయవాడ నుంచి హైదరాబాద్ మధ్య ప్రయాణికుల సంఖ్యలో గణనీయమైన వృద్ధిని దృష్టిలో ఉంచుకుని, విమా నయాన సంస్థలు కొత్త ఫ్లైట్ సర్వీసులను ప్రారంభించనున్నాయి. వేసవి సెలవులు, వ్యాపార అవసరాల కారణంగా ఈ మార్గంలో డిమాండ్ ఎక్కువగా ఉండటంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటి వరకు ఉన్న ఫ్లైట్లు సరిపోక పోవడంతో ఈ కొత్త సర్వీసులు ప్రయాణికులకు మరింత సౌకర్యాన్ని అం >>2

## సింగిల్ టైమ్ ఎమ్మెల్యేగా మిగిలిపోతారా?

### ఆలోచించుకోండని ఎమ్మెల్యేలకు సూచన

### ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు వ్యవహారంపై సిఎం చంద్రబాబు ఆగ్రహం

**విజయవాడ, ఏప్రిల్ 4,ప్రభాతవార్తప్రతినిధి:** ఒక్కసారే ఎమ్మెల్యేలుగా మిగిలిపోవాలనుకుంటున్నారా..మీరే తేల్చుకోవాలి అని సిఎం చంద్రబాబు గట్టి హెచ్చరికలిచ్చారు. పల్నాడు జిల్లా నరసరావుపేట ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు వ్యవహారంపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. పల్నాడు ఎస్పీ కార్యాలయంలో లీగల్ అడ్వైజర్ నియామక ఘటనపై టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్‌ను కలిసి అరవింద బాబు నిన్న వివరణ ఇచ్చారు. ఈ >>2

# ఓటమే సక్సెస్‌కు సోపానం

### ప్రపంచంలోని తెలుగువారంతా అండగా ఉన్నారు.. వారికి ధన్యవాదాలు

### కర్ణాటక సొంత తల్లిలాంటిది.. విశాఖ ఉక్కుపై కుమారస్వామి హామీ ఇచ్చారు

### సింధనూరులో ఎన్టీఆర్ విగ్రహం, సైనిక స్కూలు ఆవిష్కరించిన మంత్రి లోకేష్



శనివారం కర్ణాటక సింధనూరులో సైనిక్ స్కూల్ ప్రారంభ సభలో మాట్లాడుతున్న మంత్రి లోకేష్

**విజయవాడ,ఏప్రిల్4,ప్రభాతవార్తప్రతినిధి:** అపజయం సహజమే,అది కుంగిపోవాల్సిన స్థితి కాదు, ఆలోచించాల్సిన సమయం,విజయానికి మార్గదర్శనమని ఏపీ మంత్రి నారా లోకేశ్ వ్యాఖ్యానించారు. జీవితంలో ఓటమి సహజం ఆత్మహత్యలు పరిష్కారం ఎన్నికలకు ముందు ఏ తప్పూ చేయని మా పెద్దాయన (చంద్రబాబు)ను అక్రమంగా జైలులో పెట్టారు. ఏ తప్పూ చేయకుండా జైలులో పెట్టినందుకు నేను తీవ్రంగా బాధపడ్డాను. కానీ, ఆ క్లిష్ట సమయంలో ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు ప్రజలంతా మా కుటుంబానికి అండగా నిలబడ్డారు. నాడు అండగా నిలిచిన ప్రతి ఒక్కరికీ జీవితాంతం రుణపడి ఉంటాను" అని ఏపీ విద్యా, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ ఉద్వేగంగా అన్నారు. కర్ణాటక సొంత తల్లి లాంటిదన్నారు.ఆనాడు విశాఖ ఉక్కు, ఆంధ్రుల హక్కు అని పోరాడామన్నాను.ఒక పదిసార్లు కలిసిన తర్వాత ఆయనే నాకు ఫోన్ చేసి బ్రదర్ ఎందుకు కంగారు పడుతున్నావ్. విశాఖ ఉక్కును కాపాడే బాధ్యత నేను తీసుకుంటా అని చెప్పిన గొప్ప వ్యక్తి కుమారస్వామి. దానికి మేం రుణపడి ఉన్నాం కర్ణాటకలోని రాయచూర్ జిల్లా సింధనూరులో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా తన తండ్రి అరెస్టు నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. సమాజంలో నైతిక విలువల ఆవశ్యకత గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. మంత్రి నారా లోకేశ్ ఉదయం కర్ణాటకలోని సింధనూరుకు చేరుకున్నారు. స్థానిక తెలుగు యువత ఆయనకు ఘన స్వాగతం పలికింది. భారీ గజమాలతో లోకేశ్‌ను సత్కరించారు. యువగళం జెండాలు చేతబూని జై లోకేశ్ అంటూ నినాదాలు చేశారు. సింధనూరులోని ఎంజీ సర్కిల్ నుంచి గంగావతి రోడ్డు వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో కేంద్ర మంత్రులు హెచ్.డీ కుమారస్వామి, సంజయ్ సేథ్ పాల్గొన్నారు. ఉత్సాహంగా సాగిన ఈ ర్యాలీలో ప్రజలందరికీ అభివాదం చేస్తూ లోకేశ్, కేంద్ర మంత్రులు ముందుకు సాగారు. ర్యాలీ అనంతరం హోసల్లీ క్యాంప్ గంగావతి రోడ్డులోని కమ్మవారి కల్యాణ మండపం వద్దకు చేరుకున్నారు. అక్కడ స్వర్గీయ ఎన్టీఆర్ కాంస్య విగ్రహాన్ని కేంద్ర మంత్రులతో కలిసి లోకేశ్ ఆవిష్కరించారు. అనంతరం హోసల్లీ క్యాంప్‌లో నూతనంగా నిర్మించిన శ్రీకృష్ణదేవరాయ సైనిక్ స్కూల్‌ను ప్రారంభించారు. సైనిక్ స్కూల్ హాస్టల్ భవనాన్ని కూడా ప్రారంభించారు. స్థానిక తెలుగు వారి యాజమాన్యంలోని విద్యా సంస్థకు కేంద్ర ప్రభుత్వం ఈ సైనిక్ స్కూల్‌ను మంజూరు చేయడం విశేషం. సమాజంలో నైతిక విలువలు బాగా పడిపోతున్నాయని లోకేశ్ ఆవేదన వ్యక్తం చేశారు. నైతిక విలువల కోసమే ప్రముఖ ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావును ప్రభుత్వ సలహాదారునిగా నియమించుకున్నామని చెప్పారు. తెలుగు వాడుక భాషలో మహిళలను అవమానించేలా కొన్ని పదాలు వాడుతున్నామన్నారు. గాజులు తొడుక్కున్నావా?అమ్మాయిలా ఏడవొద్దు వంటి పదాలను ఇకపై ఎవరూ వాడొద్దన్నారు. ఇలాంటి కించపరిచే పదాలకు వెంటనే ఫుల్ స్టాప్ పెట్టాలని ఆయన పిలుపునిచ్చారు.చంద్రబాబు అరెస్టు నాటి కష్టకాలాన్ని లోకేశ్ గుర్తు చేసుకున్నారు. అక్రమ అరెస్టును నిరసిస్తూ కర్ణాటక తెలుగు ప్రజానీకం పెద్ద ఎత్తున ర్యాలీలు >>2

## సినీ పరిశ్రమకు మరింత ప్రోత్సాహం

### తిరుపతి, వైజాగ్, అమరావతిలో స్టూడియో నిర్మాణాలు: మంత్రి దుర్గేష్

**గుంటూరు,ఏప్రిల్ 4 ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో సినిమా పరిశ్రమ అభివృద్ధికి, మౌలిక సదుపాయాల కల్పనకు కూటమి ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందిస్తుందని రాష్ట్ర సినిమాటోగ్రఫీ, జిల్లా ఇంచార్జి మంత్రి



కందుల దుర్గేష్ వెల్లడించారు. శనివారం ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం సహజసిద్ధమైన లొకేషన్లకు నిలయమని పేర్కొన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలోషూటింగ్‌లు విజయవంతంగా >>2

## 28 జిల్లాలతో కొత్త మ్యాప్

### విపత్తు నిర్వహణ సంస్థ అధికారికంగా విడుదల

### అమరావతి రాజధానిగా గుర్తింపు



**విజయవాడ,ఏప్రిల్ 4,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జిల్లాల సంఖ్య 28 కి పెరిగింది. ఈ మేరకు 28 జిల్లాలతో కూడిన నూతన మ్యాప్‌ను ఎపి విపత్తు నిర్వహణ సంస్థ అధికారికంగా విడుదల చేసింది. ఈ మ్యాప్‌లో రాష్ట్ర రాజధానిగా అమరావతిని స్పష్టంగా పేర్కొంది. పరిపాలనా సౌలభ్యం కోసం జిల్లా సంఖ్యను 26 నుంచి 28కి ప్రభుత్వం పెంచింది. రాష్ట్ర పటంలో ఈ మార్పులను ప్రభుత్వం చేసింది. రెండు కొత్త జిల్లాలను ఏర్పాటు చేసింది. ప్రకాశం జిల్లా పశ్చిమ ప్రాంతాలను వేరు చేస్తూ మార్కాపురం కేంద్రంగా ఒక జిల్లాను, పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాల్లోని కొన్ని ప్రాంతాలతో పోలవరం కేంద్రంగా మరో జిల్లాను ఏర్పాటు చేశారు. వెనుకబడిన ప్రాంతాల అభివఅద్ధి, పోలవరం ప్రాజెక్టు ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ప్రజలకు పాలనను మరింత చేరువ చేసేందుకు, అభివృద్ధిని వికేంద్రీకరించే లక్ష్యంతోనే ఈ పునర్విభజన చేపట్టినట్లు ప్రభుత్వం చెబుతోంది. గతంలో 13 జిల్లాలుగా ఉన్న ఎపి, వైఎస్ జగన్ హయాంలో 26జిల్లాలుగా మారింది. >>2

# మహిళా సాధికారతకు 10 సూత్రాలు

**విజయవాడ,ఏప్రిల్4,ప్రభాతవార్తప్రతినిధి:** పలు సామాజిక, ఆర్థిక పరిమితులతో వివక్షకు గురవుతున్న మహిళలకు సాధికారిత(ఎంపవర్మెంట్) ద్వారా రాష్ట్ర ప్రగతిలో వారికి భాగస్వామ్యం కల్పించడానికి కార్యచరణ ప్రణాళికను రూపొందిస్తుందని వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. ఆ క్రమంలోనే రాష్ట్ర ప్రభుత్వం పది సూత్రాల ప్రణాళికను రూపొందించిందన్నారు.సుదీర్ఘ కాలంపాటు రాష్ట్ర సమగ్ర ప్రగతికి బాటలు వేసే దిశగా ప్రభుత్వం రూపొందించిన నూతనజనాభా స్థిరికరణ విధానంలో భాగంగా మహిళా సాధికారత కోసం ఈ 10 సూత్రాల ప్రణాళికను ప్రతిపాదించినట్లు శనివారం నాడొక



### జనాభా నిర్వహణలో మహిళలపాత్ర కీలకం

### మాతాశిశు ఆరోగ్యసంరక్షణకు చర్యలు: మంత్రి సత్యకుమార్

పత్రికా ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రగతికి కీలకమైన నూతన జనాభా నిర్వహణలో మహిళల కీలక పాత్రను గుర్తించిన కూటమి ప్రభుత్వం పక్కా విధానాన్ని రూపొందించినట్లు మంత్రి వివరించారు. గర్భధారణ మరియు శిశు సంరక్షలను మహిళా హక్కుగా గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం వారి జీవన అన్ని దశల్లోనూ అండగా ఉండి, అనుకూల వాతావారణాన్ని కల్పించి, లింగ వివక్షకు తెరదించివ సమాజా వికాసంలో మహిళా శక్తికి తమ పాత్రను పూర్తి స్థాయిలో నిర్వహించేలా చూసేందుకు కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందని మంత్రి తెలిపారు. మహిళల జీవనంలోని అన్ని దశల్లోనూ నాణ్యమైన సేవల్ని అందుబాటులో ఉంచి వారికి సమగ్ర ఆరోగ్య రక్షణ కల్పించడం, సంతాన ప్రాప్తి హక్కును సరైన విధానంలో సాకారం చేయడం, ఆర్థిక స్వావలంబనకు వారికి ఎదురవుతున్న ఆటంకాలను తొలగించడం, శిశు సంరక్షణలో పురుషుల్ని భాగస్వాములు చేయడం ఈ పది సూత్రాల ప్రణాళిక ముఖ్య ఉద్దేశమని మంత్రి సత్యకుమార్ యాదవ్ వివరించారు.

ప్రస్తుతం శిశు పాలనా కేంద్రాల బాధ్యత ప్రధానంగా మహిళలపైనే ఉంటోంది. ఈ పరిస్థితిని మార్చేందుకు ప్రస్తుత సామాజిక విలువల్లో తగు చైతన్య కార్యక్రమాల ద్వారా మార్పు తెచ్చి శిశు పాలనలో సమాజ బాధ్యతకి అన్న నినాదం ద్వారా పురుషుల భాగస్వామ్యాన్ని పెంపొందిస్తూ మార్పు తేవాల్సి ఉంటుందని మంత్రి అన్నారు. ఈ దిశగా ప్రస్తుతం అమలులో ఉన్న 180 రోజుల ప్రసూతి సెలవులను(మెటర్నటీ లీవ్) 12 నెలల పేరెంట్ హుడ్ లీవ్ గా తల్లిదండ్రులిద్దరూ సమానంగా వాడుకునే వీలు కల్పిస్తామని మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు.

**సంతాన ప్రాప్తి హక్కు గుర్తింపు:** సంతాన ప్రాప్తి హక్కు ప్రతి జంట >>2

# దర్శనమో తిరుమలేశా!



### క్యూలైన్లలో భక్తులకు తరగని కష్టాలు, అధికారుల పర్యవేక్షణ అంతంతమాత్రమే

### కమాండ్ కంట్రోల్ నుంచి అంతా మాటలగారడీయే, ఎఐతో నిర్వహణ ఆదేవునికే ఎరుక

**తిరుమల,ఏప్రిల్ 4ప్రభాతవార్తప్రతినిధి:** రోజుకు సరాసరి 70వేలమంది నుండి 80వేలమంది వరకు భక్తులకు మహాలఘు విధానంలో తిరుమల ఆలయంలో టిటిడి అధికారులు శ్రీవారి దర్శనం చేయి స్తున్నా, గంటలగంటలు క్యూలైన్లలో, వైకుంఠమ్ కంపార్టుమెంట్లలో నిరీక్షణ కష్టాలు తప్పడం లేదనేది అధికశాతం మంది భక్తుల ఆవేదన. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగించి ఎఐ అమలుచేస్తూ భక్తులకు త్వరగా దర్శనం చేయిస్తున్నామని టిటిడి అధికారులు మాయతో అబ్రకదబ్రగా చెప్పేస్తున్నారు. అయితే వాస్తవంగా దర్శనాలు అమలులో మాత్రం భక్తుల కష్టాలు విని పించుకునే, పట్టించుకునే అధికారి లేదంటే అతిశయోక్తిలేదు. సాధారణ రోజుల్లోనే 300రూపాయలు ఎస్ఇడి దర్శన టిక్కెట్ కలిగిన >>2

## హైస్పీడ్ బోట్లతో గస్తీ: ముఖ్యమంత్రి

**విజయవాడ ఏప్రిల్ 4 ప్రభాతవార్త ప్రతినిధి:** మత్స్యకారుల జీవనోపాధి దెబ్బతినకుండా ఉండేందుకు ఏపీ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. రాష్ట్రంలో మత్స్యకారుల సమస్య పరిష్కారానికి హైస్పీడ్ పెట్రోలింగ్ బోట్లతో చర్యలు చేపట్టాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. తమిళనాడు నుంచి బోట్ల అక్రమ చొరబాట్ల వల్ల నష్టం కలగొద్దని సీఎం పేర్కొ న్నారు. బాపట్ల నుంచి సుళ్లూరుపేట వరకూ ఏపీ సముద్రజలాల్లో గస్తీ పెంచాల న్నారు. 4 హైస్పీడ్ పెట్రోలింగ్ బోట్లు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు.

ఇరాన్-అమెరికా యుద్ధంతో గల్ఫ్ దేశాల్లో నెలకొన్న ఉద్రిక్తల కారణంగా ఎరువుల కొరత మరింత తీవ్రం కానుంది. ఈసారి ఖరీఫ్‌కు ఎరువుల కొరత తప్పేలా లేదని వ్యవసాయ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. హార్మూజ్ జలసంధి నుంచి గ్యాస్ రాకపోవడంతో ఎక్కడికక్కడ ఎరువుల ప్లాంట్లు మూతపడు తున్నాయి. తెలంగాణలోని రామగుండం ఎరువుల ఫ్యాక్టరీలో ఉత్పత్తి రెండు వారాలుగా నిలిచిపోయింది. ఎరువుల సరఫరా తగ్గడంతో రెండు వారాల్లోనే ధరలు 40 శాతం పైగా పెరిగాయి. అయితే యుద్ధంలో చమురు క్షేత్రాలు, రిఫైనరీలే ప్రధాన లక్ష్యం గా మారడంతో రానున్న ఖరీఫ్‌లో ఎరువుల కొరత కారణంగా తెలుగు రాష్ట్రాల్లో వరి, గోధుమ, మొక్క జొన్న వంటి ప్రధాన ఆహార ధాన్యాల దిగుబడి 30 శాతం వరకు తగ్గే ప్రమాదం పొంచి ఉందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా ఇరాన్ - అమెరికా యుద్ధం నెల రోజులుగా కొనసాగుతుండడంతో రిటైల్ మార్కెట్లో నూనెల ధరలు కూడా ఒక్కసారిగా పెరుగుతున్నాయి. అదే విధంగా పొద్దుతిరుగుడు, వేరుశనగ నూనెతో సహా చాలా వంట నూనెల ధరలు లీటరుకు రూ.10 నుండి రూ.20 వరకు పెరిగాయి. వంట నూనె ధరలు పెరగడం, ఎల్‌పీజీ ధరలు పెరగడం వల్ల హోటళ్లలో ఆహార ధరలపై ప్రభావం చూపడం ప్రారంభమైంది. కొన్ని హోటళ్లు తమ మెనూలో ధరలను మార్చాయి. గ్యాస్ కొరత కారణంగా టీ మొదలు అల్పాహారం, ఇతర ఆహారపదర్థాల ధరలను హోటళ్ల యాజమాన్యాలు పెంచుతున్నాయి. హైదరాబాద్ నగరంలో వ్యాపారులు ఛాయిని సాధారణ రోజుల్లో కంటే రూ. 5 నుండి రూ.10మేర ధర పెంచి అమ్ముతున్నారు. అదే సమయంలో పలు టిఫిన్ల ధరలు సైతం ప్లేట్‌కు రూ. 10దాకా పెరిగాయి.

# సామాన్యుడిని చుట్టుముట్టిన యుద్ధం

**బోయిని మల్లికార్జున్**

ఎక్కడో దూరంగా ఉన్న గల్ఫ్ దేశాల్లో జరుగుతున్న యుద్ధం నెలరోజులుగా సామాన్యుడి జీవితాన్ని తలకిందులు చేస్తోంది. అమెరికా-ఇరాన్ యుద్ధం ప్రభావం ముందుగా రోజు/నెలవారీగా అరకొర ఆదాయంతో కుటుంబాలను నెట్టుకొచ్చేవారి జేబుకే చిల్లుపెడుతోంది. వంటగ్యాస్ మొదలు, నిర్మాణ సామాగ్రి, ఎరువులు ధరలు పెరుగుతుండగా పెట్రో, డిజిల్ ఇంధనంతోపాటు ఆటో ఎన్‌పిజి, కమర్షియల్ ఎల్‌పిజి గ్యాస్ కొరత రోజురోజుకూ తీవ్రమవుతోంది. ఇరాన్, ఇతర గల్ఫ్ దేశాలు యుద్ధంలో చిక్కుకోవడంతో చమురు ధరలు పెరిగి సామాన్యుడి దైనందిన జీవితంపై తీవ్రప్రభావం చూపుతున్నాయి. భారతదేశం తన అవసరాలకు కావాల్సిన చమురులో దాదాపు 85శాతం విదేశాల నుంచే దిగుమతి చేసుకుంటోంది. దీనివల్ల అంతర్జాతీయంగా ముఖ్యమైన స్ట్రెయిట్ ఆఫ్ హార్ముజ్ ప్రాంతంలో స్వల్ప అలజడి రేగినా సామాన్యుడి జీవితంపై ప్రతికూల ప్రభావం చూపుతోంది. చమురు ధరలు పెరగడం అంటే కేవలం పెట్రోల్, డీజిల్ ధరలు పెరగడంమాత్రమే కాదు. రవాణా, విమానయానం, పెయింట్లు, టైర్లు కెమికల్స్ వంటి పెట్రోలియం ఆధారిత పరిశ్రమలన్నింటిలోనూ ఖర్చులు పెరుగుతున్నాయి. ఈ భారమంతా చివరికి సామాన్య వినియోగదారుడి పైనే పడుతోంది. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లో యుద్ధ ప్రభావం తీవ్రంగా కనిపిస్తోంది. యుద్ధ ప్రభావం కనిపిస్తోందా లేదా? తెలియాలంటే దగ్గర్లోని పెట్రోల్ బంక్‌కు వెళ్తే తెలుస్తుంది. బంక్‌కు అటు అర కిలోమీటర్, ఇటు అర కిలోమీటర్ ఫుల్ ట్రాఫిక్ జామ్. పైగా పెట్రోల్ పంపుల దగ్గర పోలీసుల పహారాలు. ట్రాఫిక్ క్లియరెన్సులు. గత కొద్ది రోజులుగా తెలంగాణతోపాటు ఎపిలోని పలు నగరాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. చాలా పెట్రోల్ బంకులు నోస్టాక్ బోర్డులు పెట్టెస్తున్నాయి. ఇక పశ్చిమాసియా యుద్ధం హైదరాబాద్ నగరంలోని ఎల్‌పిజితో నడిచే ఆటోవాలాల జీవితాన్ని రోడ్డున పడేసింది. ఆటో ఎల్‌పిజికి తీవ్ర కొరత నెలకొనడంతో గ్యాస్ కోసం ఆటో డ్రైవర్లు రాత్రిబంవళ్లు ఎల్‌పిజి గ్యాస్ బంకుల వద్దే పడిగాపులుగాయాల్సి వస్తోంది. రోజుల తరబడి పడిగాపులు గాస్తున్నా ఎల్‌పిజి దొరకుతుందన్న గ్యారంటి లేకుండా పోతోందని ఆటోవాలాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఏ రోజుకారోజు ఉదయం ఆటోలో గ్యాస్ నింపించుకునే వారమని, ప్రస్తుతం నాలుగైదు రోజులకు ఒకసారి కూడా ఆటో ఎల్‌పిజి అందుబాటులో ఉండడం లేదని వాపోతున్నారు. కొరతను ఆసరాగా చేసుకున్న కొన్ని ఆటో ఎల్‌పిజి బంకులు ధర పెంచి అమ్ముతున్నాయని, అధిక ధరనూ చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నా క్యూలో తమ వంతు వచ్చేసరికి గ్యాస్ అయిపోయిందన్న సమాధానం బంకు నిర్వహకుల నుంచి వినాల్సి వస్తోందని వాపోతున్నారు. దాదాపు నెల రోజులుగా ఎల్‌పిజి గ్యాస్ కొరతతో ఆటో బయటకు తీయని పరిస్థితి నెలకొందని, దాంతో కుటుంబాలు గడవడం కష్టంగా మారిందని, భార్యా పిల్లలకు రెండుపూటల భోజనం పెట్టడం కూడా కష్టంగా మారిందని ఎల్‌పిజి ఆటో డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే ఆటో ఎల్‌పిజి కొరతను నివారించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని మార్గాలను అన్వేషిస్తున్నా కొరత రోజు రోజుకూ తీవ్రమవుతూనే ఉండడం గమనార్హం. హైదరాబాద్‌లో నెలకొన్న ఆటోఎల్‌పిజి కొరత ఎపిలోనూ నెలకొంది. ఆటో ఎల్‌పిజి కొరతతో తలెత్తిన రవాణా సవాళ్లను ఎదుర్కోవడానికి హైదరాబాద్ మెట్రో రైలు, తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ బస్సులతో సహా ప్రజారవాణా సేవలను విస్తరించే మార్గాలను తెలంగాణ ప్రభుత్వం అన్వేషించాల్సిన పరిస్థితి నెలకొంది. హైదరాబాద్ నగరంలో ఎల్‌పీజీ ప్రస్తుత



పరిస్థితిని పరిశీలిస్తే ఆటోలకు రోజువారీగా 202 టన్నుల గ్యాస్ అవసరమైతే, ప్రస్తుతం రోజుకు 147 టన్నులే అందుబాటులో ఉంటోంది. అంటే ప్రతిరోజూ 27నుంచి 30 శాతం మేర లోటు కొనసాగుతోంది. ఆటో ఎల్పీజీ సరఫరాలో 75 శాతం వాటా ప్రైవేటు సంస్థలదే ఉంది. మధ్య ప్రాచ్యంలో నెలకొన్న యుద్ధ పరిస్థితులు ముందుగా సామాన్యుడి వంటగదిపైనేపడ్డాయి. ఇంటి వంటగదిలో వినియోగించే డొమాస్టిక్ గ్యాస్ సిలిండర్లతోపాటు చిరు వ్యాపారులు మొదలు ఫైవ్‌స్టార్ హోటళ్ల వరకు వినియోగించే కమర్షియల్ ఎల్‌పిజి గ్యాస్ సిలిండర్లకు తీవ్ర కొరత నెలకొంది. దాదాపు నెల రోజులుగా వంట గ్యాస్ కొరతతో అటు గృహ వినియోగదారులు ఇటు వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కమర్షిల్ ఎల్‌పిజి సిలిండర్లకు కొరత మరింత తీవ్రంగా ఉండడంతో చిరు వ్యాపారుల జీవనోపాధి దెబ్బతింటోంది. పెద్ద పెద్ద ఫైవ్‌స్టార్ హోటళ్లతోపాటు రెస్టారెంట్లు సైతం వంట గ్యాస్ లేక వ్యాపారాలను మూసివేసే పరిస్థితికి వచ్చేశాయి. పశ్చిమాసియాలో కొనసాగుతున్న యుద్ధం వల్ల దేశంలో గ్యాస్ సిలిండర్ల కొరత ఎక్కువైంది. దీంతో బ్లాక్ మార్కెటుగాళ్లు దోపిడీకి తెరలేపుతున్నారు. ముఖ్యంగా ఒకప్పుడు వెయ్యి రూపాయలకే దొరికే సిలిండర్ నేడుబ్లాక్‌లో రూ. 6,500 కు దొరుకుతోంది. అలాగే రీఫిల్‌కు 4000 వేల రూపాయల వరకు ఛార్జ్ చేస్తున్నారు. మరోవైపు చమురు నిల్వలు చాలానే ఉన్నాయని, ఎలాంటి సమస్య లేదని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలుచెబుతున్నా క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థి తులు భిన్నంగా కనిపిస్తున్నాయి. యుద్ధం కారణంగా కమర్షియల్ ఎల్‌పిజి సిలిండర్ల కొరత మరింత తీవ్రమైంది. ఈ కొరత హోటల్ పరిశ్రమను పెద్ద సంక్షోభంలోకి నెట్టివేసింది. ఒకప్పుడు సాధారణ మిస్డ్‌కాల్‌తో గ్యాస్ సిలిండర్లను పొందిన హోటల్ యజమానులు ఇప్పుడు సరఫరాలను పొందటానికి ఇబ్బంది పడుతున్నారు. దీనివలన రోజువారీ కార్యకలాపాలకు అంతరాయం ఏర్పడింది. ఇదే అదునుగా కొందరు దళారులు కమర్షియల్ గ్యాస్‌సిలిండర్‌ను రూ.7,000లకు బ్లాక్‌లోఅమ్ముతున్నారు. గ్యాస్ బ్లాక్‌దందాను అరికట్టేందుకు పోలీసులు, పౌరసరఫరాల శాఖ ముమ్మరంగా దాడులు నిర్వహిస్తున్నా అక్రమ దందాకు అడ్డుకట్ట పడడం లేదు. మరోవైపు ఎఫ్ఎం సిజి ఫ్యాక్టరీలలో కూడా ఉత్పత్తి నెమ్మదించింది. ఈగ్యాస్ కొరత పారిశ్రామిక రంగాన్ని తీవ్రంగా దెబ్బతీస్తోంది. ఫార్మా పరిశ్రమలకూ గ్యాస్ కొరత కారణంగా తీవ్ర ఆటంకాలు ఎదు రవుతున్నాయి. స్టీల్ పరిశ్రమలు గ్యాస్‌ఆధారిత ఇంధనంతో ఉత్పత్తి కొనసాగిస్తుండడంతో గ్యాస్‌కొరత కారణంగా వాటిఉత్పత్తి తగ్గిధరలు భారీగా పెరిగిపోతున్నాయి. ఇలా అమెరికా, ఇజ్రాయెల్ యుద్ధం కారణంగా ఇల్లు గడవడం కష్టంగా మారడంతో యుద్ధం ఎప్పుడు ముగుస్తుందా..? అని అన్ని వర్గాల ప్రజలు ముఖ్యంగా పేద, సామాన్యులు వేయికళ్లతో ఎదురు చూస్తున్నారు. ●

---

కేరళం

# సగం అటు.. సగం ఇటు!

**ఎ.వి.వి ప్రసాద్**

వరుసగా రెండోసారి సాధించిన విజయం సహజంగానే మూడోసారిపై ఆశలు పెంచుతుంది. కేరళం ముఖ్యమంత్రి పినరై విజయన్ ఇప్పుడు అలాగే కనిపిస్తున్నారు. ఎల్డీఎఫ్, యుడిఎఫ్‌లు సాధారణంగా చెరో టెర్మ్‌ను ఎగరేసుకుపోతూంటాయి. ఒక ఫ్రంట్ వరుసగా రెండోసారి అధికారంలోకి వచ్చేఆనవాయితీ 2021కిముందు రాష్ట్రంలో లేదు. ఆ సంవత్సరం విజయన్ రెండోసారి అధికారం స్వీకరించి కొత్త రికార్డు సృష్టించారు. గత పదేళ్లుగా కేరళంను అభివృద్ధి పథంలో తాము నడిపించిన తీరు మరే రాష్ట్రంలోను లేదనీ, అటువంటి ఆదర్శవంతమైన పాలన వామపక్ష కూటమికే సాధ్యమనీ ఆయన అంటున్నారు. కానీ దానిని అంగీకరించని వారు సంధిస్తున్న ప్రశ్నలకు విజయన్ సరైన సమాధానమివ్వలేకపోతున్నారు. ముఖ్యంగా ఎన్నో అవినీతి కేసులు గతఐదేళ్లలో వెలుగు చూశాయి. మొదటి టెర్మ్ కంటే రెండవ టెర్మ్‌లో విజయన్ అప్రూవల్ రేటింగ్ గణనీయంగా తగ్గిన మాట వాస్తవం. శబరిమల బంగారం దోపిడీ కేసు విజయన్ సర్కార్ ప్రతిష్టను చాలా వరకు దిగజార్చిందనే చెప్పాలి. ఆ సొమ్ము ఇప్పటికీ లభ్యం కాలేదు. సకాలంలో చార్జిషీట్లు దాఖలు చేయకపోవడంతో సిపిఎం నాయకుడు ఎ.పద్మకుమార్ సహా పలువురు నిందితులు బెయిలుపై బయటే ఉన్నారు. వారంతా బలమైన రాజకీయ సంబంధాలున్నవారు కావడంతో శబరిమల కేసు కూడా నీరు కారుతోంది. ఆలయంలోని ద్వారపాలక విగ్రహాలు, గర్భగుడి తలుపులపై ఉన్న బంగారు పూత ప్లేట్లు మరమ్మతుల పేరుతో తీసుకువెళ్లి మళ్లీ అమర్చిన తరువాత వాటితూకంలో చాలా తేడా వచ్చినట్లు 2025సెప్టెంబర్‌లో హైకోర్టుకు ఇచ్చిన నివేదిక ద్వారా స్పష్టమైంది. 2019 లో రిపేర్ తర్వాత తిరిగి తెచ్చినప్పుడు దాదాపు4.5 కిలోల బంగారం తగ్గిపోయినట్లుగా కోర్టు గుర్తించింది. ఈ కేసుకు సంబంధించి కొందరు 'పెద్ద మనుషుల'ను అరెస్టు చేసినా వారు తేలికగానే బెయిలు సాధించుకోగలిగారు. దాదాపు 100కోట్ల రూపాయల స్కాంలో పలువురు వామపక్ష నేతలకు కూడా సంబంధాలున్నట్లు ఆరోపణలున్నాయి. వాటిపై సిట్ దర్యాప్తు సాగుతున్నా, మనీ లాండరింగ్ కోణంలో ఇడి దర్యాప్తు జరుపుతున్నా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉంది. రాహుల్ గాంధీ ఎన్నికల ప్రచారంలో ఈ కేసునే ప్రధాన అస్త్రంగా చేసుకుని విజయన్ ప్రభుత్వాన్ని నిశితంగా విమర్శిస్తున్నారు. అలాగే ప్రధాని మోడీ, ఇతర బిజెపి నేత లు కూడా తరచుగా విజ యన్‌ను ఈ కేసుతోకలిపి విమర్శించడంతో ప్రజల్లో కూడా అనేక అపోహలు ఏర్పడుతున్నాయి. వాటి ప్రభావం ఎన్నికలపై పడు తుందనే పరిశీలకులుభావి స్తున్నారు. కొన్ని ప్రాజెక్టులకు సంబంధించి కూడా పలువురు సిపిఎం ముఖ్యులపై ఆరోపణలున్నాయి. ప్రభుత్వం చేపట్టిన లైఫ్ మిషన్ ప్రాజెక్టు, ఎఐ కెమెరా ప్రాజెక్టులో పెద్ద ఎత్తున అవినీతి జరిగినట్లు ఆరోపణలున్నాయి. ఆ ప్రాజెక్టుల టెండర్లలో అనేక అవకతవకలు జరిగినట్లు తెలుస్తోం ది. సంచలనం సృష్టించిన కేరళ గోల్డ్‌స్మగ్లింగ్ కేసులో ప్రభుత్వానికి దగ్గరగా ఉన్న కొందరు వ్యక్తుల పేర్లు బయటకు వచ్చాయి. ముఖ్యంగా స్వప్న సురేష్ అనే నాయకురాలి పాత్రపై పెద్ద రాజకీయ వివాదమే చెలరేగింది. యుడిఎఫ్, బిజెపి నేతలు ఈ వివాదాలపైనే తమ దృష్టిని సారించి విజయన్ ప్రభుత్వ పనితీరును ఎండ గడుతున్నారు. అలాగే శబరిమల ఆలయంలోకి మహిళల ప్రవేశం కూడా పెద్ద వివాదమైంది. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం అన్ని వయసుల మహిళలకు ప్రవేశం అనుమతించడంతో ప్రభుత్వం అమలు చేయడానికి ప్రయత్నించింది. దీనికి వ్యతిరేకంగా కొందరు భక్తులు, కొన్ని హిందూ సంఘాలు పెద్ద ఎత్తున ఆందోళనలు చేశాయి. అది కొనసాగుతూనే ఉంది. నిరసనల తర్వాత విజయన్ సర్కార్ తటస్థ వైఖరి అవలం భించినా భక్తులు మాత్రం ప్రభుత్వ ధోరణి పట్ల వ్యతిరేకత తోనే కనిపిస్తున్నారు. సిపిఎంలోను వర్గ విభేదాలు ఎక్కువే. ప్రధానంగా విజయన్, అచ్యుతానందన్ మధ్య పెల్లుబికిన విభేదాలు ఎన్నికలపై ప్రభావం చూపుతాయనుకొంటున్నారు. ఎల్డీఎఫ్‌కు నాయకత్వం వహిస్తున్న సిపిఎం లో ఇటీవల అంతర్గత విభేదాలు ఎక్కువ కావడం అనేక అనుమానాలకు తావిస్తోంది. పార్టీ నుంచి ఇటీవల బయటకు వెళ్లిన కొందరు నేతలు యుడిఎఫ్ మద్దతుతో ఇండిపెండెట్లుగా పోటీ చేయడం విజయన్‌ను నిరాశలోముంచెత్తుతోంది. మాజీమంత్రి, సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యుడైన జి.సుధాకరన్ యుడిఎఫ్ మద్దతుతో బరిలోకి దిగారు. ఎన్నికల షెడ్యూలు విడుదలైన తర్వాత నలుగురు సీనియర్ నేతలు పార్టీనుంచి వైదొలగడం అధిష్ఠాననేతలను ఎక్కువగా కలవరపరచింది. కున్హికృష్ణన్, పికె శశి, టికె గోవిందన్ వంటి నేతలు కాంగ్రెస్ మద్దతుతోబరిలోకి దిగడం ఆశ్చర్యం కలిగిస్తోంది. కొందరు నాయకులనుఆకర్షించే గాలం కాంగ్రెస్ విసురుతున్నట్లు దీనిని బట్టి స్పష్టమవుతోంది. పాలక్కాడ్, మలబార్ ప్రాంతాల్లో సిపిఎం కార్యకర్తలు పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ లో చేరినట్లు చెబుతున్నారు. సిపిఎంలో, ఎల్డీఎఫ్‌లో క్షీణత ఎంత ఉన్నా యుడిఎఫ్‌లో కూడా పరిస్థితి అంతంత మాత్రమే కావడంతో అధికార మార్పు పట్ల ప్రజలు అంతగా ఆసక్తి చూపకపోవచ్చనే అభిప్రాయం కూడా వినిపిస్తోంది. కాంగ్రెస్‌లో అంతర్గత విభేదాలు ఇటీవల మరింత అధికమయ్యాయి. రాహుల్ చేసే విమర్శలకు కూడా తగినంత స్పందన రావడం లేదని తెలుస్తోంది. మరో ప్రధాన పార్టీ అయిన బిజెపికి కేరళలో తగినంత బలం లేకపోవడంతో మళ్లీ ఎల్డీఎఫ్ వైపే ప్రజలు మొగ్గు చూపవచ్చనే అభిప్రాయం వినిపిస్తోంది. సిపిఎం అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాలపై విమర్శలు తక్కువ కావడంతో ఆ ప్రభావం ఎన్నికల వేళ కనిపిస్తుందనే చెప్పాలి. ఈ నేపథ్యంలో మరో నాలుగు రోజుల్లో జరిగే ఎన్నికలు విజయన్ కు హ్యాట్రిక్ విజయం అందిస్తాయో, లేదో చూడాలి. ●



పినరై విజయన్

---

మయన్మార్

# నియంతకే మళ్లీ పగ్గాలు!

**గన్ని మోహన్**

మిలిటరీ పాలనలో ఐదేళ్లుగా కొనసాగిన మైన్మార్ అంటే ఒకప్పటి బర్మా ఇప్పుడు మళ్లీ నియంత పాలనలోకే వెళ్లింది. మైన్మార్‌కు జరిగిన అధ్యక్ష ఎన్నికల్లో తిరుగుబాటునేత జుంటా అధిపతి మిన్ ఆంగ్ హ్లైయింగ్ తిరిగి ఎన్నికయ్యారు. ఐదేళ్ల పాలనలో అణచివేత, విపక్ష నేతలను జైలు పాలు చేయడం, లేదా కేసులు బనాయించి విచారణల పేరిట వేధింపులకు గురిచేసి తనకంటూ ఎదురులేకుండా చేసుకున్న మిలిటరీ చీఫ్ మిన్ ఆంగ్ హ్లైయింగ్ ఇక వచ్చే ఐదేళ్లలో మరింత నిరంకుశ పాలన అవలంభించవచ్చున్న సందేహాలు చుట్టుముడుతున్నాయి. ఈ ఎన్నికల్లో హ్లైయింగ్‌కు మొత్తం 584 ఓట్లకుగాను 429 ఓట్లు వచ్చాయి. యున్యోసాకు 126 ఓట్లు, నాన్ నిని ఆయేకు 29 ఓట్లు వచ్చాయి. సగానికిపైగా ఓట్లు సాధించడంతో బ్రిటన్ నుంచి 1948లో స్వాతంత్ర్యం సాధించినప్పటి నుంచి అత్యధిక కాలం మిలిటరీ తిరుగుబాట్లలోనే మగ్గిన ఈ దేశంలో హక్కుల నేతగా ఆంగ్‌సాంగ్ సూకీ అవలంభించిన నిరవధిక నిరాహారదీక్షతో ఆనాటి ప్రభుత్వం దిగివచ్చింది. ఆ తర్వాత నేషనల్ లీగ్ ఫర్ డెమొక్రసీ పార్టీ తరపున ప్రజాస్వామ్యప్రభుత్వం ఏర్పడినా కొద్దికాలం మాత్రమే మనగలిగింది. ఆనాడు చట్టసభకు ఎన్నికైన నేతలందరూ ఇప్పుడు జైళ్లలో మగ్గుతున్నారు. హక్కులనేత ఆంగ్ సాంగ్‌సూకీ సైతం జైలు జీవితానికే పరిమితం అయ్యారు. మిలిటరీ తిరుగుబాటుతో ఆనాటి సైనిక జనరల్ మ్యింట్ ష్వే తాత్కాలిక అధ్యక్షుడయ్యారు. రాజ్యాంగంలోని 417, 418 సెక్షన్లను అమలు చేసి అత్యవసర పరిస్థితిని ప్రకటించారు. మొత్తం కార్యనిర్వాహక, శాసన, న్యాయవ్యవస్థలన్నింటినీ తమ అధీనంలోకి తీసుకున్నారు. తదనంతరం సీనియర్‌జనరల్ కమాండర్ ఇన్‌ఛీఫ్‌గా ఉన్న మిన్ ఆంగ్ హ్లైయింగ్ తనదైన మిలిటరీ మార్కుపాలనలో దేశాన్ని నడిపించారు. తర్వాత 2023 వరకూ కూడా ఎమర్జెన్సీ కాలమే నడిచింది. పదవిని చేపట్టిన నాడే ఎన్నికలు నిర్వహిస్తామన్న హ్లైయింగ్‌కు ఐదేళ్లకాలం పట్టింది. ఈఎన్నికలను అంతర్జాతీయ వ్యవస్థలు ఏవీకూడా ధృవీకరించడంలేదు. కానీ అధ్యక్షుడుగా హ్లైయింగ్ ఎన్నిక అక్కడ రాజ్యాంగ బద్ధత ఏర్పడటంతో ఇక తనదైన పాలనకు శ్రీకారం చుడుతున్నారు. తనకు వీర విధేయుడుగా ఉన్న ఆర్మీ జనరల్‌యేవిన్ వూను మిలిటరీ ఛీఫ్‌గా నియమించుకున్నారు. తిరుగుబాటు కాలం నుంచే అణచివేతను ముమ్మరం చేసిన జుంటా సర్కార్ విప్లవాలు, ఆందోళనలకు నాయకత్వం వహించిన నేతలు, హక్కులనేతలు అందరినీ విడిచిపెట్టలేదు. వారిని వేధింపులు, చిత్రహింసలకు గురిచేసి జైళ్లపాలుచేస్తే మరి కొందరు దేశం దాటి థాయిలాండ్, లావోస్, బంగ్లాదేశ్ వంటి ప్రాంతాల కు పారిపోయి తలదాచుకున్నారు. ఎక్కువశాతం చైనాతోనే సరిహద్దుపంచుకుంటున్న ఈ దేశం చైనా తరహా పాలన ఎక్కువ సాగుతుంది. తిరుగుబాటుకు ముందు ప్రభుత్వం నడిపిన నేషనల్ యూనిటీ సర్కార్ ఆధ్వర్యంలోని ప్రతిఘటనగ్రూపులు ఇప్పటికీ థాయిలాండ్ సరిహద్దుప్రాంతాల నుంచి తమతమ ఆందోళనలు నిరసనలు కొనసాగిస్తూనే ఉన్నారు. ప్రతిఘటన పేరిట ఉద్యమాలునడుపుతున్న ఈ రెసిస్టెన్స్‌గ్రూపులపైనే ఇప్పుడు మిన్ ఆంగ్ తనఫోకస్ పెంచుతారని అంచనా. అందులో నూతనకు విధేయుడుగా ఉన్న యే విన్ వూనే కమాండర్‌ఇన్‌ఛీఫ్ కావడంతో ఇప్పుడు మైన్మార్‌లో మిలిటరీ నియంతకు ఆడింది ఆట పాడింది పాటగానే సాగుతుందని నిస్సందేహంగా చెప్పవచ్చు. రెసిస్టెన్స్‌గ్రూపుల నేతలు సైతం తాము ఆందోళనలు విరమించలేదమని, తమ భావితరానికి గడ్డురోజులుకల్పించలేమని పేర్కొంటు తమ హక్కుల కోసం తామునిరంతర పోరాటంచేస్తూనే ఉంటామని చెపుతున్నారు. అయితే పూర్తిగా నిర్వీర్యం అయిన మైన్మార్ ఆర్థిక వ్యవస్థను ఈ మిలిటరీ నేత అధ్యక్షుడు ఏరీతిన గాడిలో పెట్టగలరన్న సందేహాలు కూడా ఎక్కువగానే ఉన్నాయి. ఆ దేశ జిడిపి పడిపోయింది. ద్రవ్యోల్బణంఊహకందని స్థాయిలోపెరిగింది. దేశ ప్రజల తలసరి ఆదాయం కూడా పతనం అయింది. అందువల్లనే ఇప్పుడు దేశ ఆర్థిక వ్యవస్థను చక్కదిద్దడంలో ఆదేశ విదేశాంగ విధానం కూడా కీలకమే అవుతుంది. పశ్చిమాసియాయుద్ధం పరంగా ఆ దేశానికి చమురు కొరత పీడిస్తోంది. 90శాతం దిగుమతులపైనే ఆధారపడిన ఈ దేశం సరిహద్దుల్లో ఉన్నదేశాలపైనే ఆధారపడుతోంది. దేశ ద్రవ్యోల్బణం 28శాతానికి పెరిగింది. జనాభా 55.77 మిలియన్లవరకూ ఉన్నారు. వ్యవసాయం, సహజవాయువు, ఉత్పత్తిరంగాలపైనే ఆధారపడిన ఈదేశంలో జిడిపి వృద్ధికూడా అంతంతమాత్రంగానే ఉంది. మొత్తం జిడిపి 65.17 బిలియన్ డాలర్లుగా ఉంటే తలసరి ఆదాయం కూడా 1256 డాలర్లుగా ఉంటుందని అంచనాలు వేసారు. కానీ ఇప్పుడు ఆపరిస్థితి లేదు. చమురు, గ్యాస్ కొరత ఆ దేశాన్ని అల్లాడిస్తోంది. ఆసియా దేశాల్లోనే అత్యంత తక్కువ జిడిపి, తలసరి ఆదాయం ఉన్నదేశంగా కొనసాగుతుంది. దేశం రుణభారం కూడా 63శాతానికి పెరిగింది. ఐఎంఎఫ్ వంటి సంస్థలు 3శాతం వృద్ధిని సాధించవచ్చని చెపుతున్నా ఈ మిలిటరీ అధినేత పాలనలో దేశం ఏదిశగా వెళుతుందనేది అంతుబట్టకుండా ఉంది. ఆ దేశం ఆర్థికవృద్ధిలోకి రావాలంటే ముందు విదేశాంగ విధానం స్పష్టత రావాలి. ఇరుగు పొరుగు దేశాలతో సత్సంబంధాలు, ఎగుమతి, దిగుమతుల విధానాల్లో పారదర్శకత అనేది కనిపించాలి. పూర్తి అనిశ్చితితో ఉన్న తరుణంలో పాలన బాధ్యతలు చేపట్టిన కొత్త అధ్యక్షుడు అటు దేశ ఆర్థికవ్యవస్థను గాడిన పెట్టడంతోపాటు దేశంలో తనపై పెరుగుతున్న అసమ్మతిని అధిగమించాల్సిన సవాళ్లు కూడా ఉన్నాయి. అభివృద్ధి చెందుతున్న ఇతర ఆసియా మిత్రులను కలుపుకుంటూ ముందుకు సాగితేనే ఆర్థికవ్యవస్థ చక్కదిద్దుకోగలుగుతారు. ఐదేళ్లకాలంలో పాలనతీరును చవిచూసిన ప్రజలుమిన్‌ఆంగ్ హ్లైయిన్‌ను ఇకపై విశ్వసిస్తారా లేదా అన్నదిమిలిటరీచీఫ్ పాలన తీరుపైనే ఆధారపడి ఉంది. ●



మిన్ ఆంగ్ హ్లైయిన్

---

# బాబూజీ శక్తి... సమానత్వపు సూక్తి

**పట్ట.హరిప్రసాద్**

బాబూ జగ్జీవన్ రాం... ఇండియన్ దళిత ఐకాన్.. ఆయన ఇప్పటికే కాదు.. ఎప్పటికీ తెలియాల్సిన వసరం ఉంది. ముందుముందు తరాలకు కూడా జగ్జీవన్ రామ్ ఆశయాలను తీసుకెళ్లాల్సిందే. ఎందుకంటే ఆయన దళితుల శ్రేయస్సు కోసం జీవితాన్ని అంకితం చేశారు. దేశంలోని దళితులకు చిహ్నంగా(బాబూజీ)గా మారారు. బాబూజీ ఒక సామాన్య కుటుంబంలో 1908ఏప్రిల్ 5న జన్మించారు. ప్రతిఏడాది ఏప్రిల్ 5న ఆయన జయంతిని ఘనంగా దేశవ్యాప్తంగా జరుపుకుంటున్నాం. నాయకులకు, ప్రస్తుత తరానికి స్ఫూర్తినిచ్చే ఆదర్శ వ్యక్తిత్వం బాబూ జగ్జీవన్ రామ్ ది. జగ్జీవన్ రామ్ చదువుకుంటున్నరోజుల్లో దళితులు, కాలి చెప్పులు తయారు చేసేవాళ్లకు కొన్ని ఆంక్షలుండేవి. స్కూల్లో అగ్రకులాల పేరుతో హిందువులకు, ముస్లింలకు వేరువేరు మంచినీటి కుండలుండేవి. ఒకరోజు దాహంతో ఉన్న జగ్జీవన్ రామ్ తెలియనితనంతో ఓ అగ్రకుల (హిందూ) కుండలోని మంచినీళ్లు తీసుకుని తాగాడు. ఇదిచూసిన అగ్రకులాల విద్యార్థులు చర్మకారుడైన అయిన జగ్జీవన్ రాం ముట్టుకున్న కుండని మేముముట్టుకోంఅంటూ స్కూలు కుండలో మంచి నీటిని తాగడం మానేశారు. వీరి ప్రదర్శనకు ఇతరులు (అప్పటి ముస్లింలు)కూడా మద్దతుగా ఉండాల్సి వచ్చేది. దీనితో హెడ్మాస్టర్ అగ్రకుల విద్యార్థులకు, దళిత విద్యార్థులకు వేరు వేరు మంచినీటి కుండలు పెట్టించారు. ఇది చూసిన జగ్జీవన్ రామ్ హిందువులు, ముస్లింల కంటే తన దళితుల స్థాయి ఇంత హీనమైనదా అని తీవ్రంగా కలత చెంది ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో స్కూల్లో పెట్టిన రెండు కుండలను పెట్టినప్పుడల్లా జగ్జీవన్ రాం బద్దలు కొట్టేసేవాడు. హెడ్‌మాస్టర్ కు తెలిసినప్పటికీ ఏం చేయలేని పరిస్థితి. చివరికి అభిమతాన్ని గుర్తించి ఒక్కటే నీళ్లకుండ పెట్టించారు. అలాగే బనారస్‌లో క్షవరం కోసం మంగలి షాప్‌కి వెళ్ళేవాడు. జగ్జీవన్ రాం చెప్పులు కుట్టే కులస్థుడని మంగళి వారు క్షవరం చేయడంమానేస్తే.. ఇది మానవత్వానికే తీరని అవమానమని, ఇందుకు నిరసనగా ప్రజలు మంగళ షాపులను బహిష్కరించాలనిజగ్జీవన్ రామ్ బస్తీలన్నీ తిరిగి జనాన్ని ఐక్యం చేశారు. దీంతో ప్రజలు బహిష్కరించడం మొదలుపెట్టారు. తమ వైఖరిని మార్చుకొని చెప్పులుకుట్టేవాళ్లకూ క్షవరం చేసేందుకు ఒప్పుకోవాల్సి వచ్చింది. వృత్తులకు, పుట్టిన జాతులకు సంబంధం ఉండదని నిరూపించగలిగారు. అలా జగ్జీవన్ రామ్ భవిష్యత్ పోరాటాలకు స్కూల్లోనే బలమైన పునాదులు పడ్డాయి. జగ్జీవన్ రామ్ ఆర్య సమాజం వారి హాస్టల్‌లో ఉన్న రోజుల్లో ఆయన కులం తెలుసుకున్న హాస్టల్లోని వంటవారు అతని పాత్రలు కడగడం మానేసారు. ఇది చూసిన ఓ అధ్యాపకుడు తమ ఇంట్లోనే బాబూజీని పెట్టుకున్నారు. కొన్నాళ్లు అక్కడ ఉన్న బాబూజీ కులం తెలుసుకున్న పనివాళ్లు అధ్యాపకుడి ఇంట్లో పని చేయడం మానేశారు. తర్వాత ఓఇంట్లో అద్దెకు దిగిన బాబూజీ యజమానికి డబ్బులు చెల్లించినా కూడా ఆయన కులం తెలిశాక మళ్లీ తిరిగిచ్చే ప్రయత్నం చేశారు. బాబూజీ మాత్రం డబ్బులు తీసుకోకుండా అద్దెంట్లోనే మాకాం వేసి మొండిగా ఉన్నారు. ఇలా ఎన్నోఅవమానాలు ఎదురౌతున్నా సమానత్వంతోనే ముందుకెళ్లే ప్రయత్నం చేశారు జగ్జీవన్ రామ్. బాబూ జగ్జీవన్ రామ్ 1914లో ప్రాథమిక విద్య ప్రారంభించి, 1925లో అగర్వాల్ మిడిల్ స్కూల్ నుండి మెట్రిక్యులేషన్ పాసయ్యారు. కాలేజీ విద్య కోసం బెనారస్ విశ్వ విద్యాలయంలో చేరి, చదువు మధ్యలో వదిలివేయవలసి వచ్చింది. బాబూజీ ఉన్నత విద్య పట్ల శ్రద్ధతో కలకత్తాలోని విద్యాసాగర్ కాలేజీలో చేరాడు. 1927లో కలకత్తా విశ్వ విద్యాలయం నుంచి బి.ఎస్ డిగ్రీ పట్టా పుచ్చుకున్నారు. అప్పట్లో బాబూజీకి బాల్యవివాహమే జరిగింది. భార్య కొద్ది కాలానికే చనిపోవడంతో తిరిగి 1935లో డాక్టర్ బీర్బల్ కుమార్తె ఇంద్రాణి దేవితో పెళ్లి జరిగింది. వీరికి సురేష్ కుమార్, మీరా(లోక్ సభ స్పీకర్) అను ఇద్దరు సంతానం కలిగారు. 1935లో కాన్పూర్‌లో జరిగిన ఆల్ ఇండియా డిప్రెస్డ్ క్లాసెస్ లీగ్ (అఖిల భారత దళిత వర్గాల సంఘం) మహాసభలకు అధ్యక్షత వహించగా, ఈ మహాసభలను గాంధీప్రారంభించారు. డిప్రెస్డ్ క్లాసెస్ లీగ్‌కు 1936 నుండి 1942 వరకు బాబూజీఅధ్యక్ష వహించారు. అదే సమయంలో బీహార్‌శాసన మండలికినామినేట్‌అయ్యారు. 15ఎస్‌సి రిజర్వుడుఎమ్మెల్యే స్థానాలకు జగ్జీవన్ రామ్ అభ్యర్థులను పోటీకి దింపితే 15నియోజక వర్గాలకు 15 మంది అభ్యర్థులు గెలిచారు. వీరిలో 14 మంది ఏకగ్రీవంగా ఎన్నిక కావడం మరో ముఖ్యమైన విశేషం. 1942 ఆగస్టు 7న ప్రారంభమైన క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్నందుకు జగ్జీవన్ రామ్ జైలుకు వెళ్ల వలసి వచ్చింది. కాగా అప్పటి బ్రిటీష్ ప్రభుత్వం ఆల్ ఇండియా డిప్రెస్డ్ క్లాసెస్ లీగ్‌ను రద్దు చేసింది. 1943లో జగ్జీవన్ రామ్ జైలు నుండి విడుదలయ్యాడు. తర్వాత విస్తృత పర్యటనలు చేసి, సభలు, సమావేశాలు పెట్టి, దళిత వర్గాల్లో చైతన్యం తీసుకురావడానికి జగ్జీవన్ రామ్ ఎంతో కృషి చేశారు. 1946లో నెహ్రూ కేబినెట్‌లో మొదటి మంత్రి మండలిలో జగ్జీవన్‌రామ్ మొదటి కార్మికశాఖమంత్రిగా చేరారు. మంత్రులందరిలోకెల్లా చిన్న వయసు కాబట్టి బాబూజీని 'బేబీ మినిస్టర్' అని పిలిచేవారు. అప్పటి నుండి 29 సంవత్సరాలు కేంద్రమంత్రిగా, ఉప ప్రధానమంత్రిగా, సెంట్రల్ పార్లమెంట్ బోర్డు సభ్యునిగా, పిసిసి అధ్యక్షునిగా, ఇంకా అనేక కీలక పదవులను బాబూజీ చేపట్టడం విశేషం. 1947లో రాజ్యాంగ పరిషత్తుకు బాబూజీ ఎన్నికయ్యారు. ఇదేఏడాది ఐక్యరాజ్య సమితి అంతర్జాతీయ కార్మిక మహాసభ అధ్యక్షునిగా బాబూజీ ఎన్నికయ్యారు. కేంద్ర కార్మిక శాఖ, వ్యవసాయం, ఆహారం, ఉపాధి, పునరావాసం, రక్షణ, రైల్వే, సమాచార శాఖలను మూడు దశాబ్దాలు ఎంతో బాధ్యతతో చేపట్టారు. ప్రభుత్వ ఉద్యోగాల్లో, నాయకత్వాల్లో, అణగారిన వర్గాలకు ప్రాతినిధ్యం లభించడానికి బాపూజీ లైన్ ఎనలేనిది. ఇందిరా గాంధీ ధోరణితో విసిగిపోయిన జగ్జీవన్ రామ్ కాంగ్రెస్ పార్టీ నుండి విడిపోయి కాంగ్రెస్ ఫర్ డెమోక్రసీ అనే పార్టీని స్థాపించారు. కొన్ని కారణాలతో తర్వాత ఇది జనతా పార్టీలోవిలీనమైంది. 1977లోమురార్జీ దేశాయ్ ప్రధాన మంత్రిగా జనతా పార్టీ ఏర్పాటు చేసిన ప్రభుత్వంలో జగ్జీవన్ రామ్ కేంద్ర రక్షణ శాఖ మంత్రిగా ఉప ప్రధాన మంత్రిగా 1979 వరకు కొనసాగారు. తర్వాత జనతా పార్టీ ప్రభుత్వం పడిపోయింది. మళ్లీ 1980లో బాబూజీ కాంగ్రెస్(జె) పేరుతో పార్టీని స్థాపించారు. రెండు తెలుగురాష్ట్రాల్లో మహాసభల్లో భాగంగా నిజామాబాద్, ఏపీలోని కృష్ణా, తూర్పుగోదావరి, ప్రకాశంలో మాదిగల దహనం విషయంలో సందర్శించినట్లు సమాచారం. బాబు జగ్జీవన్ రామ్ 1986జూలై 6న ఆయన మరణించారు. 1985లో దేశ ప్రజలు బాబూజీ జన్మదినోత్సవాన్ని సమతా దివస్‌గా జరుపుకున్నారు. అప్పటి కేంద్ర ప్రభుత్వం దేశమంతటా 3రోజులు సంతాపదినాలుగా ప్రకటించింది. జూలై 7వ తేదీని రాష్ట్ర ప్రభుత్వాలు సంతాప సెలవుదినాన్ని ప్రకటించాయి. సాహసి, ఉద్యమకారుడు, పరిపాలనాదక్షుడు, విజేత అయిన బాబూజీ జీవితం ఒక గొప్ప విజయగాథ. ప్రజల్లో, కార్యకర్తల్లో, నేతల్లో స్ఫూర్తి రగిలిస్తూనే ఉంది. బాబూజీ జయంతి సందర్భంగా దేశంలో గౌరవంగా సెలవు దినంగా కొనసాగిస్తున్నాం. బాబూజీ కోసం తెలిసినవాళ్లు, తెలుసుకున్నవాళ్లు మాత్రమే ప్రాధాన్యత ఇస్తున్నారు. మిగతా తరమంతా ఏదోమొక్కుబడిగా స్మరించుకునే పరిస్థితి. దేశంలో ఎక్కువ కాలం పనిచేసిన కేబినెట్ మంత్రిగా బాబూజీ రికార్డు సృష్టించారు. ఆయన కుమార్తె మీరా కుమార్ 2009 -2014 వరకు లోక్‌సభ స్పీకర్‌గా పనిచేశారు. బాబూజీ విగ్రహాలకు నివాళులర్పించడం తప్పితే ఆశయాలను ఏ మాత్రం ముందుకెళ్లని దుస్థితి. ప్రతి ఉన్నత రాజకీయ నేతలు బాబూజీ పేరుతో సమానత్వమంటూనే అసాంఘికతత్వాన్ని పోషిస్తున్నారు. అప్పట్లో బాబూజీ బరితెగింపు, ఆయన సమానత్వపు అంశం ఇప్పటి తరానికి తెగువ సరిపోవడం లేదు. జగ్జీవన్ రామ్ పేరుతో దళితవర్గం నుంచి సానుభూతి కోసం కొందరు నాయకులు మచ్చుకు కార్యక్రమాలు చేస్తున్నారే తప్పితే నాణ్యమైన స్ఫూర్తిని కొనసాగించడంపై దృష్టి పెట్టడం లేదు. మారుతున్న కాలానికి, టెక్నాలజీకి అనుగుణంగా బాబూ జగ్జీవన్ రామ్ గురించి విద్యాసంస్థల్లో సిలబస్‌గా పెట్టాలి. ప్రస్తుత జనరేషన్‌లోనూ ఎంతో కొంత సమానత్వపు లోపం కనిపిస్తూనే ఉంది. దానిపై బాబూజీ మార్గంలో ఉద్యమించే ప్రదర్శనలు లేవు. బాబూజీ జగ్జీవన్ రామ్ పై ప్రతి ఏటా స్పెషల్ సినిమాతో పాటు భారత రత్న పురస్కారం అందించుకొని సంపూర్ణ గౌరవాన్ని నిలబెట్టుకోవాల్సినవసరం ఉంది. ●



బాబూ జగ్జీవన్ రాం

# సత్తెనపల్లిలో రోడ్డు ప్రమాదం

## వృద్ధ దంపతులు మృతి

**సత్తెనపల్లి, ఏప్రిల్ 4, ప్రభాతవార్త:** మనవడి పెళ్లి చూపులకు వెళుతున్న ఓ వృద్ధ దంపతులను శనివారం ఓ లారీ మృత్యు రూపంలో కభలించి పెండ్లి చూపులు కాస్తా విషాదంతో నింపిన ఘటన పట్టణంలోని ఏరియా ప్రభుత్వ వైద్యశాల వద్ద శనివారం చోటు చేసుకుంది. పట్టణ పోలీసుల కథనం ప్రకారం ఫిరంగిపురం మండలం వేమవరం గ్రామానికి చెందిన మృతులు ఆలకుంట అంజయ్య, ఆలకుంట కోటేశ్వరమ్మ తన మనవడు విష్ణువర్ధన్ పెండ్లి చూపుల నిమిత్తం వేమవరం గ్రామం నుండి కుమారుడు పాల్ రాజు, కోడలు వెంకటరమదేవి, మనవడు విష్ణు వర్ధన్‌లు కలిసి రెండు మోటర్ బైకులపై సత్తెనపల్లి మండలం బృగుబండ్ల గ్రామానికి బయలుదేరారు. మధ్యాహ్నం పట్టణానికి చేరుకున్నారు . అక్కడ కుమారుడు కోడలు, మనవడు ప్రయాణిస్తున్న మోటర్ బైక్ చైన్ లూజ్ కావటంతో వారు బస్టాండ్ వద్ద బైక్ ను రిపేరు చేసేందుకు అపారు. ఈ నేపథ్యంలో ఇది గమనించని వృద్ధదంపతులు ద్విచక్ర వాహనంపై పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాల వద్దకు వచ్చారు. ఇంతలో వారి వెనుకనే ఉన్న టిప్పర్ లారీ ఒక్కసారిగా వీరి వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో బైక్ పై ప్రయాణిస్తున్న అంజయ్య, కోటేశ్వరమ్మ కింద పడటంతో లారీ ఒక్కసారిగా వారిపై ఎక్కటంతో దంపతులు ఇద్దరూ అక్కడి కక్కడే మృతిచెందారు. కొద్ది క్షణాల్లో ఇద్దరి మృత దేహాలు రకపు ముద్దాలుగా మారాయి. సమాచారం అందుకున్న పట్టణ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం సత్తెనపల్లి ఏరియా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.



## మానవత్వం చాటుకున్న మంత్రి బిసి జనార్దన్ రెడ్డి..

### రోడ్డు ప్రమాద బాధితులకు తక్షణ సహాయక చర్యలు

**విజయవాడ,ఏప్రిల్ 4,ప్రభాతవార్తప్రతినిధి:** మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి మానవత్వం చాటుకున్నారు.. విజయవాడ సమీపంలోని పిన్నమనేని సిద్ధార్థ కాలేజ్ దగ్గర, ఫ్లై ఓవర్ వద్ద బైక్ పై వెళ్తున్న వృద్ధ దంపతులను లారీ ఢీకొంది. అదే సమయంలో ఆ దారిలో వెళ్తున్న క్రమంలో.. ఆ సంఘటన చూసి తక్షణమే మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి స్పందించారు. వెనువెంటనే తన కాన్వాయ్ ఆపి, ప్రమాద బాధితులను దగ్గరుండి అంబులెన్స్‌లో హాస్పిటల్‌కు మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి పంపించారు. అనంతరం విజయవాడ ప్రభుత్వాసుపత్రి సిబ్బందితో మాట్లాడి బాధితులకు మెరుగైన వైద్య సహాయం అందించాలని మంత్రి ఆదేశించారు.

## ఆహార విశ్లేషణ పాఠ్యగ్రంథం ఆవిష్కరణ



**తిరుపతి,ఏప్రిల్ 4ప్రభాతవార్తప్రతినిధి::** తిరుపతి పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ టెక్నాలజీలో ఫార్మాస్యూటికల్ కెమిస్ట్రీ విభాగంలో ఆచార్యులు ఆచార్య జి. రజిత రచించిన "ఆహార విశ్లేషణ పాఠ్యగ్రంథం శాస్త్రీయ గ్రంథం ఆవిష్కరణ జరిగింది. పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య వెన్నం ఉమ శనివారం ఆవిష్కరించారు. ఈ 250 పేజీల గ్రంథాన్ని ఫార్మామెడ్ ప్రెస్ హైదరాబాద్ ప్రచురించింది. 250 పేజీల ఈ గ్రంథం, ప్రధాన్ మంత్రి ఉన్నత విద్య అభియాన్ పథకం కింద, మల్టీడిసిప్లినరీ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ యూనివర్సిటీస్ కార్యక్రమంలో భాగంగా లభించిన పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఆర్థిక సహాయంతో రూపొందించబడింది. ఈ గ్రంథం ఆహార శాస్త్రం, విశ్లేషణ రంగాలలో అభ్యసిస్తున్న విద్యార్థులు, పరిశోధకులు,అధ్యాపకులకు సమగ్ర మార్గదర్శకంగా రూపొందించబడింది. ఇందులో ఆహారంలోని ప్రధాన ఘటకాలు అయిన కార్బోహైడ్రేట్లు, ప్రోటీన్లు, లిపిడ్లు ,విటమిన్ల వర్గీకరణ, భౌతికరసాయన లక్షణాలు, సాధారణ విశ్లేషణ పద్ధతులు, అలాగే వాటి జీర్ణక్రియ, శోషణ మరియు మెటాబాలిజం వంటి అంశాలు సవివరంగా వివరించబడ్డాయి. అనుమతించబడిన ,అనుమతించని రంగుల గుర్తింపు విధానాలు కూడా ఇందులో సమగ్రంగా చర్చించబడ్డాయి. పాలు మరియు పాల ఉత్పత్తులు (పాలు, వెన్న, మార్జరిన్, చీజ్, ఐస్ క్రీమ్) పై విశ్లేషణ పద్ధతులు, వాటిలో కల్తీ పదార్థాలు , కాలుష్యాల గుర్తింపు, అలాగే ఫర్మెంటేషన్ ఉత్పత్తులు అయిన వైన్, బీర్, స్పిరిట్స్ మరియు వెనిగర్‌ల విశ్లేషణ అంశాలు ఉన్నాయి.

# వైభవంగా ఒంటిమిట్ట కోదండరాముడి చక్రస్నానం

### ధ్వజావరోహణంతో ముగిసిన శ్రీరామ బ్రహ్మోత్సవాలు - నేడు పుష్పయాగం



కనుల పండువగా జరుగుతున్న చక్రస్నానం

**రాజంపేట, ఏప్రిల్4 ప్రభాతవార్త** దక్షిణ అయోధ్య కడప జిల్లా ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో చివరిరోజైన శనివారం ఆలయ సమీపంలోని పుష్కరిణిలో చక్రస్నానం నేత్రపర్వంగా జరిగింది. విశేష సంఖ్యలో భక్తులు పాల్గొని పుణ్యస్నానాలు ఆచరించారు.ఆలయంలో ఉదయం 4 గంటలకు సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపి ఆలయ శుద్ధి, ఆరాధన నిర్వహించారు. అనంతరం శ్రీ లక్ష్మణ సమేత సీతారాములవారు తిరుచ్చిలో, సుదర్శన చక్రత్తాళ్వార్ పల్లకిలో ఊరేగింపుగా పుష్కరిణి వద్దకు వేంచేశారు.స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులకు వేడుకగా స్నపనతిరు మంజనం నిర్వహించారు. ఇందులో సీతారామ లక్ష్మణ సరసన చక్రత్తాళ్వార్లు పాలు, పెరుగు, తేనె, పసుపు, చందనంతో అభిషేకాలు అందుకున్నారు. అనంతరం అర్చకులు వేదమంత్రోచ్చారణ నడుమ శాస్త్రోక్తంగా చక్రస్నానం నిర్వహించారు. రాత్రి ధ్వజావరోహణంతో శ్రీకోదండరామస్వామి వారి బ్రహ్మోత్సవాలు ముగిశాయి. ఈ కార్యక్రమంలో టిటిడి డెప్యూటీ ఈవో ప్రశాంతి, టెంపుల్ ఇన్స్పెక్టర్ నవీన్, ఆలయ అర్చకులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. శ్రీకోదండ రామస్వామివారి ఆలయంలో ఏప్రిల్ 5వ తేదీ ఆదివారం సాయంత్రం 6 నుండి రాత్రి 9 గంటల వరకు పుష్పయాగ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. ఈ మేరకు టిటిడి అన్ని ఏర్పాట్లు చేసింది.

# శ్రీకాకుళంలో కలకలం.. బాదం పాలు తాగి 80 మందికి అస్వస్థత



**శ్రీకాకుళం, ఏప్రిల్ 4 ప్రభాతవార్త:** శ్రీకాకుళం జిల్లాలో తీవ్ర కలకలం రేగింది. గ్రామీణ మండలం సింగుపురంలో బాదం పాలు వికటించి సుమారు 80 మంది అస్వస్థతకు గురయ్యారు. వాంతులు, విరేచనాలు, కడుపునొప్పి వంటి లక్షణాలతో బాధపడుతుండటంతో వారిని ఆసుపత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. వివరాల్లోకి వెళితే సింగుపురంలో ఈ నెల 1, 2 తేదీల్లో కొండమ్మ తల్లి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ జాతర సందర్భంగా ఓ వ్యక్తి వ్యాన్‌లో బాదం పాలు విక్రయించాడు. ఎండ తీవ్రంగా ఉండటంతో ఉత్సవాలకు వచ్చిన పలువురు ఈ పాలను కొనుగోలు చేసి తాగారు. అయితే, గురువారం అర్ధరాత్రి నుంచి పాలు తాగిన వారికి వాంతులు, విరేచనాలు, కడుపునొప్పి, జ్వరం వంటి లక్షణాలు మొదలయ్యాయి. దీంతో బాధితులను హుటాహుటిన సమీపంలోని ఆసుపత్రులకు తరలించారు. ఈ ఘటనపై జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ స్పందించారు. బాధితులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని తెలిపారు. ఘటనపై సమగ్ర విచారణ జరిపేందుకు ఒక ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ప్రస్తుతం బాధితులంతా వైద్యుల పర్యవేక్షణలో చికిత్స పొందుతున్నారు. జాతరలో నాణ్యత లేని పానీయం అమ్మడం వల్లే ఈ ఘటన జరిగిందని ప్రాథమికంగా భావిస్తున్నారు.

**సింగుపురం ఘటనపై స్పందించిన ఎమ్మెల్యే గొండు శంకర్ :** మండలం సింగపురం గ్రామంలో కొండమ్మ తల్లి జాతర మహోత్సవం సందర్భంగా బాదం మిల్క్ వంటి శీతల పానీయాలు సేవించిన కొందరు వ్యక్తులు అస్వస్థతకు గురైన ఘటన చోటు చేసుకుంది. ఈ విషయం తెలిసిన వెంటనే శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ సింగపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్సీ)ను సందర్శించారు. అస్వస్థతకు గురైన బాధితులను పరామర్శించిన ఎమ్మెల్యే గొండు శంకర్, వారి ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసు కున్నారు. బాధితులకు మెరుగైన వైద్య సేవలు అందించాలంటూ వైద్య సిబ్బందికి సూచనలు చేశారు. ప్రస్తుతం సింగుపురం పరిసర ప్రాంతాల నుంచి అస్వస్థతకు గురైన వారికి పీహెచ్సీలో చికిత్స అందిస్తున్నారు. వైద్యులు అప్రమత్తంగా ఉండి బాధితులకు అవసరమైన చికిత్స అందిస్తున్నారని ఎమ్మెల్యే తెలిపారు.

ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, పరిస్థితి నియంత్రణలో ఉందని భరోసా ఇచ్చారు. శీతల పానీయాలు సేవించిన వారిలో అస్వస్థతకు కారణాలపై కూడా వివరాలు సేకరిస్తున్నట్లు తెలిపారు.

ఈ సందర్భంగా కూటమి నాయకులు, గ్రామ పెద్దలు, వైద్యులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# తొమ్మిదో తరగతి విద్యార్థి కరెంట్ షాక్‌తో దుర్మరణం!

## పట్టించుకోని ప్రిన్సిపాల్, టీచర్లు



**సాలూరు, ఏప్రిల్ 4 ప్రభాతవార్త :** సాలూరు మండలం మామిడిపల్లి గ్రామంలో ఉన్న ప్రభుత్వ హైస్కూల్లో నైన్త్ క్లాస్ చదువుతున్న విద్యార్థి కరెంట్ షాక్‌తో మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే కోదుకరకవలసలో నివాసం ఉంటున్న కొర్ర ఆదినారాయణ, సన్యాసమ్మ దంపతుల కుమారుడు కొర్ర దిలీప్ మామిడిపల్లి హైస్కూల్లో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. శనివారం ఉదయం స్కూల్ కి వెళ్లిన దిలీప్ క్లాస్ బ్రేక్ సమయంలో స్నేహితులతో పక్కన ఉన్న అరటి తోటలోకి వెళ్లే ప్రయత్నం చేసాడు. అలాగే స్కూల్ ప్రహరీగోడ మీదకు ఎక్కి దాటే సమయంలో అక్కడ ఉన్న కరెంట్ పోల్ వైర్ పట్టుకోవడంతో వెంటనే కరెంట్ షాక్‌కు గురైయ్యాడు. తన స్నేహితులు స్కూల్ ప్రిన్సిపాల్, టీచర్స్ కి ఈ విషయం తెలియపరచగా మామిడిపల్లి సీహెచ్సి కి దిలీప్‌ను తరలించి చేతులు దులుపుకున్నట్టుగా సమాచారం. అక్కడ వైద్య సిబ్బంది దిలీప్ మృతి చెందినట్టుగా ధ్రువీకరించడంతో సాలూరు ఏరియా ఆసుపత్రికి కుటుంబ సభ్యులు మృతదేహాన్ని తరలించారు. అనంతరం రూరల్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడానికి వెళ్ళగా స్కూల్ ప్రిన్సిపల్ అప్పటికే ఫిర్యాదు చేసినట్టు దిలీప్ కుటుంబ సభ్యులు తెలిపారు. అలాగే శవపంచనామా కోసం ప్రభుత్వ ఆసుపత్రి వద్ద కుటుంబ సభ్యుల ఆవేదనతో ఎదురు చూస్తున్నారు. అంతేకాకుండా సాలూరు ఏరియా ఆసుపత్రికి మామిడిపల్లి స్కూల్ ప్రిన్సిపల్, టీచర్స్ గాని రాకుండా ఏమాత్రం రెస్పాన్స్ లేకండా వ్యవహరిస్తున్నారని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు.

# టిటిడి ఛైర్మన్‌ని తొలగించాలి - వైఎస్సార్సీ నిరసన



అప్పలాయగుంటలో వైసిపి నాయకులు నిరసన, ప్రదర్శన

**వడమాలపేట, ఏప్రిల్ 4 ప్రభాతవార్త:** కళాంకితుడైన టీటీడీ ఛైర్మన్ బి.ఆర్.నాయుడుని వెంటనే తొలగించాలని మాజీ మంత్రి, వైసీపీ నాయకులు రోజా, కరుణాకర్‌రెడ్డిలు డిమాండ్ చేశారు. శనివారం తిరుపతి జిల్లా వడమాలపేట మండలంలోని అప్పలాయగుంటలో వారు నిరసన, ప్రదర్శనలు చేశారు. ఈ సందర్భంగా రోజా మాట్లాడుతూ క్యారెక్టర్ లేని వ్యక్తిని టీటీడీ ఛైర్మన్‌గా నియమించడమే పెద్ద తప్పు అని అతని గురించి వీడియోలు బయటపడ్డ తరువాత కూడా ఇంకా కొనసాగించడం అనేది మహా పాపం, అపచారమని ఆరోపించారు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్ చేస్తున్న ఈ అపచారానికి ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకుని బి.ఆర్.నాయుడుని ఆ పదవి నుంచి తొలగించమని డిమాండ్ చేస్తున్నా ఈ రోజు ప్రపంచ వ్యాప్తంగా ఉన్న హిందూ ధర్మాన్ని నమ్ముకున్న వాళ్లు వెంకటేశ్వర స్వామిని పూజించేవాళ్లు అందరూకూడా బాధపడుతున్నారన్నారు. వీడియోలు పబ్లిక్ అయిన తరువాతకూడా దించకపోవడం చంద్రబాబునాయుడు, పవన్‌కల్యాణ్ చేస్తున్న తప్పు కాదా అని ప్రశ్నించారు. హిందువుల మనోభావాలు గౌరవిస్తామని ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి మౌనంగా ఉన్నారంటే వీళ్ళ జుట్టు బి.ఆర్.నాయుడు చేతిలో ఉందా అని ప్రశ్నించారు. ఒక అమ్మాయిని 30 సంవత్సరాలుగా ఏ విధంగా టార్చర్‌పెట్టాడు ఏ విధంగా తన అధికార బలంతో అహంకారంతో ఎంత పని చేశాడో అన్ని చూసిన తరువాతకూడా ఎందుకు అతని చేత రాజీనామాచేయించలేదని చంద్రబాబును అడుగుతున్నామన్నారు. ఇప్పటికైనా ఛైర్మన్ తొలగించి చంద్రబాబు కొండమీద నించోని వెంకటేశ్వర స్వామి భక్తులకు సాష్టాంగ నమస్కారం చేసిక్షమాపణలు కోరాలన్నారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నేటి నుంచి ఎస్పీడిసిఎల్ 'సూర్యఘర్ ఉత్సవ్'

### -14లోగా లక్ష్యాన్ని చేరుకోవాలి

### - సిఎండి శివశంకర్ లోతేటి

**తిరుపతి,ఏప్రిల్ 4ప్రభాతవార్తప్రతినిధి::** ఎస్పీడీసీఎల్ పరిధిలోని నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, కడప, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్య సాయి జిల్లాల్లో నేటి నుండి "సూర్యఘర్ ఉత్సవ్" కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆ సంస్థ సిఎండి శివశంకర్ లోతేటి తెలిపారు. ఎస్పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో శనివారం రూఫ్ టాప్ సోలార్ అంశంపై సంస్థ అధికారులు, సోలార్ ఏజెన్సీల ప్రతినిధులతో సిఎండి శివశంకర్ లోతేటి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు (బాబూ జగ్జీవన్ రామ్ జయంతి రోజు) నుండి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి ఏప్రిల్ 14వ తేదీ వరకు రూఫ్ టాప్ సోలార్ ను ప్రోత్సహించేందుకు వీలుగా సూర్యఘర్ ఉత్సవ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ నేపథ్యంలో ఈనెల 14వ తేదీలోగా సంస్థ పరిధిలోని 9 జిల్లాల్లో 25 వేల ఎస్సీ, ఎస్టీ వినియోగదారుల గృహాలపై రూఫ్ టాప్ సోలార్ సిస్టమ్స్ ను ఏర్పాటు చేయాలనే లక్ష్యానికి అనుగుణంగా సంస్థ అధికారులు, సిబ్బంది, ఏజెన్సీలు పనిచేయాలని ఆదేశించారు. ఈ పనుల నిర్వహణకు సంబంధించిన పరికరాలు ఇప్పటికే అందుబాటులో ఉన్నాయని, ఆయా ఏజెన్సీలు సరిపడా సిబ్బందిని నియమించుకుని, పనుల్ని యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేయాలని ఆదేశించారు. రూఫ్ టాప్ సోలార్ పనుల్లో సంస్థ అధికారులు, సిబ్బంది, ఏజెన్సీల నిర్లక్ష్యాన్ని సహించబోమని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ (ప్రాజెక్ట్స్ ఐటి) పి. అయుబ్ ఖాన్, డైరెక్టర్ (టెక్నికల్ హెచ్ఆర్ డి) కే. గురవయ్య, చీఫ్ జనరల్ మేనేజర్లు జె. రమణా దేవి, యం. ఉమాపతి, కె. ఆదిశేషయ్య, ఆర్. పద్మ, సిహెచ్ రామచంద్ర రావు, కె. సంపత్ కుమార్, ఎస్. రమణ, జనరల్ మేనేజర్లు జగదీష్, భాస్కర్ రెడ్డి, విజయన్, పిఆర్ఓ తోట మధుసూదన రూఫ్ టాప్ సోలార్ సిస్టమ్ ఇన్స్టాలేషన్ ఏజెన్సీల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# 'మా గ్యాస్, మా హక్కు' నినాదంతో ఉద్యమిస్తాం

## - సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

**విజయవాడ,ఏప్రిల్ 4,ప్రభాతవార్తప్రతినిధి:** మా గ్యాస్, మా హక్కు" నినాదంతో ఉద్యమిస్తాం సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు వెల్లడించారు. దేశవ్యాప్తంగా గ్యాస్, ఆయిల్ రంగాలలో ఏర్పడిన సంక్షోభం సాధారణ ప్రజలపై భారంగా మారిందని ఆయన పేర్కొన్నారు. గ్యాస్ ధరలు విపరీతంగా పెరిగి, రాష్ట్రంలో బ్లాక్ మార్కెటింగ్ విస్తరించిందని, చిన్న హోటళ్లు, టిఫిన్ సెంటర్లు, వీధి వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని విమర్శించారు. జీవనోపాధి కోల్పోయిన యువకులు, కార్మికులు రోడ్డున పడే పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. అధికారులు మార్కెట్లో గ్యాస్ అందుబాటులో ఉందని చెబుతున్నా, వాస్తవానికి అది సామాన్య ప్రజలకు అందడం లేదని విమర్శించారు. కృష్ణా- గోదావరి బేసిన్‌లో పుష్కలంగా గ్యాస్ వనరులు ఉన్నప్పటికీ, ప్రైవేట్ కంపెనీలు రోజుకు సుమారు 21 వేల టన్నుల గ్యాస్‌ను తవ్వి ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నాయని, రాష్ట్రానికి మాత్రం సరిపడా సరఫరా జరగడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర అవసరం రోజుకు కేవలం 4 వేల టన్నులే అయినప్పటికీ, ఆ అవసరాన్ని కూడా తీర్చకపోవడం అన్యాయమని అన్నారు. దీనివల్ల విదేశాల నుంచి అధిక ధరలకు గ్యాస్ దిగుమతి చేసుకోవాల్సి వస్తోందని, ఆ భారాన్ని వినియోగదారులపై మోపుతున్నారని పేర్కొన్నారు. కృష్ణాగోదావరి బేసిన్ గ్యాస్‌ను స్థానికంగా పైప్‌లైన్‌ల ద్వారా పీఎన్‌జీగా సరఫరా చేస్తే, గృహాలకు తక్కువ ధరకే గ్యాస్ అందుబాటులోకి వస్తుందని, ఇది సామాన్య ప్రజలకు, చిన్న వ్యాపారులకు పెద్ద ఊరట కలిగిస్తుందని వివరించారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని అసెంబ్లీలో తీర్మానం ఆమోదించి, రాష్ట్రానికి న్యాయమైన గ్యాస్ వాటాను సాధించేందుకు కేంద్రంపై ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు."మా గ్యాస్‌మా హక్కు" నినాదంతో వామపక్ష పార్టీలు, ప్రజాసంఘాలతో కలిసి రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని ప్రారంభించనున్నట్లు ప్రకటించారు. మొదటిగా రాజమండ్రిలో భారీ ప్రజాసభ నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం స్పందించకపోతే ప్రజా మద్దతుతో ఉద్యమాన్ని తీవ్రం చేస్తామన్నారు.

# తిరుమల సమాచారం

## ఎస్వీ అన్నప్రసాదం ట్రస్ట్‌కు రూ.10.10 లక్షలు విరాళం



**తిరుమల,ఏప్రిల్ 4ప్రభాతవార్తప్రతినిధి::** తిరుమలకు వస్తున్న భక్తులకు ఆకలి అనేది తెలియకుండా రుచిగా శుచిగా అన్నప్రసాదాలు అందిస్తున్న ట్రస్ట్‌కు దాతలు తమవంతుగా విరాళాలందిస్తున్నారు. శనివారం అనంతపురానికి చెందిన వి.ఎస్.రవి కుమార్ ఎస్వీ అన్న ప్రసాదం ట్రస్టుకు 10.10 లక్షలు రూపాయలు విరాళంగా అందించారు. టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరికి డిడిని అందజేశారు.

## నెదర్లాండ్‌లో వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి 33.5 ఎకరాలు కేటాయింపు



**తిరుమల,ఏప్రిల్ 4ప్రభాతవార్తప్రతినిధి:** హిందూ ధర్మ ప్రచారంలో భాగంగా ప్రపంచవ్యాప్తంగా శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయాలు నిర్మించాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలతో టిటిడి మరో కీలక నిర్ణయం తీసుకుంది. నెదర్లాండ్స్ లోనూ హిందూ భక్తులకు చేరువ చేయడానికి శ్రీవారి ఆలయ నిర్మాణానికి విశ్వ హిందూ పరిషత్ తో కలిసి పనిచేసేందుకు శ్రీకారం చుట్టింది. ఈ ఆలయ నిర్మాణం కోసం నెదర్లాండ్స్ ప్రభుత్వం 33.5 ఎకరాల భూమిని వీహెచ్‌పీకి కేటాయించింది. ఈ స్థలంలో సుమారు 250 కోట్ల రూపాయలు వ్యయంతో స్వామివారి ఆలయాన్ని నిర్మించాలని వీహెచ్‌పీ నిర్ణయించింది. ఈ బృహత్కార్యానికి టిటిడి సహకారం కోరుతూ అంతర్జాతీయ అధ్యక్షుడు అశోక్ కుమార్ టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడును కలిశారు. ఈ విషయంపై ఛైర్మన్ బీఆర్ నాయుడు తన సామాజిక మాధ్యమంలో స్పందిస్తూ, "గోపురాలు, ప్రాకారాలతోపాటు శిల్పకళా సౌందర్యం ఉట్టిపడేలా ఆలయాన్ని నిర్మించనున్న నేపథ్యంలో టిటిడి నుంచి స్థపతి సహకారం అందించాలని విశ్వహిందూ పరిషత్ అంతర్జాతీయ అధ్యక్షుడు అశోక్ కుమార్ కోరారని తెలిపారు. ఆయన విజ్ఞప్తితో సానుకూలంగా స్పందించి చర్యలు తీసుకుంటామని తెలియజేసినట్లు వివరించారు. ఈ నిర్ణయంతో విదేశాల్లో శ్రీవారి ఆలయాల నిర్మాణ ప్రక్రియ మరింత వేగవంతం కానుంది.

## స్మార్ట్‌స్టిక్స్ శబ్దాలతో చిరుతల పరార్!



**తిరుమల,ఏప్రిల్ 4ప్రభాతవార్తప్రతినిధి::** గోవిందనామస్మరణలతో నిత్యం భక్తులతో రద్దీగా ఉండే అలిపిరి కాలినడక మార్గంలో ఇటీవల చిరుతలు సంచారంతో భక్తులు భయపడు తున్నారు. భక్తుల రక్షణకు టిటిడి అధికారులు సాంకేతిక చర్యలు తీసుకుంటున్నారు. భక్తుల రక్షణకు స్మార్ట్‌స్టిక్స్ అందుబాటులోకి తీసుకువచ్చారు. ఇవి శబ్ధం చేయడం, కాంతులతో విరజిమ్మడం చేస్తుంది. ఈ కాంతి,శబ్ధానికి చిరుతలు,ఏనుగులు దూరంగా పరుగులుతీస్తాయి. అత్యవసరానికి విద్యుత్ షాక్ వ్యవస్థ ఏర్పాటుకు ఆలోచన చేస్తున్నారు. ప్రస్తుతం కాలినడక దారిలో 20 స్టిక్స్ ఉండగా మరో 30వరకు రానున్నాయి. కాలినడక మార్గంలో ఏడోమైలు వద్ద చిరుతల సంచారం. శ్రీవారిమెట్టుమార్గంలో చిరుత ఉండటంతో భక్తుల రక్షణ అత్యవసరంగా చర్యలు తీసుకుంటున్నారు. గాలిగోపురంనుండి లక్ష్మీనరసింహస్వామి ఆలయం పరిసరాల్లో మరింత భద్రత కల్పిస్తున్నారు.

## ప్రజలందరికీ శ్రీవారి ఆశీస్సులు కలగాలి : ప్రముఖులు



**తిరుమల,ఏప్రిల్ 4ప్రభాతవార్తప్రతినిధి::** కలియుగప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో ప్రజలందరికీ శుభాలు కలగాలని ప్రముఖులు ఆకాంక్షించారు.ప్రజలందరికీ మంచి జరగాలని, అందరూ సంతోషంగా ఉండాలని తెలిపారు. శనివారం ఉదయం విఐపి బ్రేక్‌లో ఆర్సీబి కెప్టెన్ రజీత్ పటిదర్.ప్లేయిర్ జితేష్ శర్మ వైకాపా ఎమ్మెల్సీ కళ్యాణి ,ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి ఎస్ఎస్ రావత్ కుటుంబంతో కలసి ఆలయంలోనికి చేరుకున్నారు. ఆలయ అధికారులు వీరికి దర్శనం చేయించి శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

# గోవిందునికి దేశవ్యాప్తంగా వేలకోట్ల విలువైన ఆస్తులు

**తిరుమల,ఏప్రిల్ 4ప్రభాతవార్తప్రతినిధి::** వడ్డీకాసుల వేంకటేశ్వరస్వామికి భక్తులు విరాళాల రూపంలో దానమిచ్చిన ఆస్తులతోబాటు టిటిడి పరిధిలో ఉన్న దేవుని ఆస్తుల రక్షణకు తిరుమల తిరుపతి దేవస్థానమ్ చర్యలు తీసుకునే దిశగా అడుగులేస్తోంది.ఇప్పటికే ఆ స్వామికి దేశవ్యాప్తంగా ఉన్న ఆస్తుల వివరాలను క్రోడీకరించి డిజిటలైజేషన్ చేసింది. ఈ పనులు వేగవంతంగా సాగుతున్నాయి. టిటిడి ఇఒ ముద్దాడ రవిచంద్ర, టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి టిటిడి ఆస్తులు ఎక్కడెక్కడ ఉన్నాయి ,ఎంత మేరకు విలువ చేస్తాయి అనే వివరాలు ఆరా తీస్తున్నారు.దేవుని ఆస్తులు అన్యాక్రాంతంగాకుండా చేపట్టాల్సిన చర్యలపై ముందుకెళ్ళే విధానం ఆలోచన చేస్తున్నారు. దేశంలోనేగాక తిరుమలకొండ క్రింద తిరుపతి నగరం పరిసరాల్లోనూ టిటిడి ఆస్తులు ఉన్నాయి. ఈ ఆస్తుల్లో కరకంబాడి మార్గంలోని ఉపాధ్యాయనగర్, గ్రాండ్‌వరల్డ్ పరిసరాల్లో, రేణిగుంట మార్గంలో కొరమేనుగుంట, ఆటోనగర్ పరిసరాల్లో 322 ఎకరాల వరకు స్థలాలు, టిటిడి పేరు చెబితేనే గుర్తుకు వచ్చే తిరుపతిలోని కేశవాయనగుంట, బైరాగిపట్టెడ,రైల్వేకాలనీ, అలిపిరి మార్గం , ఎంఆర్‌పల్లి, ఉల్లిపట్టెడ వంటి చోట్ల ఇలా ఉన్న స్థలాలు టిటిడివన్నట్లు సర్వే నంబర్లతో సహా టిటిడి ఎస్టేట్ విభాగం జిల్లాలోని సబ్ రిజిస్ట్రేషన్‌శాఖ కార్యాలయాల అధికారులకు గతంలోనే నివేదికలు ఇచ్చారు. ఈ స్థలాలు అధికశాతం టిటిడివి కావడంతో వాటిని నిషేధిత జాబితాలో పొందుపర్చాలని రిజిస్ట్రేషన్ శాఖకు జాబితా అందించారు. అప్పటికే ఆయా ప్రాంతాల్లో చాలావరకు పలువురు ఇళ్ళు, అపార్టుమెంట్లు నిర్మించుకుని కాపురాలు ఉంటున్నారు. ఈ స్థలాలపై గతంలోనే రిజిస్ట్రేషన్లు చేసే దిశగా పూర్వపాలకమండలి నిర్ణయం తీసుకుని ఆమోదించింది. దేశవ్యాప్తంగా 85వేలకోట్ల రూపాయలు విలువ చేసే 960 ఆస్తులు ఉన్నట్లు తిరుమల తిరుపతి దేవస్థానం గుర్తించి, ఈ ఆస్తులకు సంబంధించి పూర్తిగా పరిరక్షించే విషయంలో జియోఫెన్సింగ్ కూడా చేస్తున్నారు. 1974వ సంవత్సరం నుంచి 2014 సంవత్సరం మధ్య కాలంలో పలు రాష్ట్ర ప్రభుత్వాల హయాంలో టిటిడి దేశవ్యాప్తంగా 113 ఆస్తులను వదులుకున్నట్లు అప్పట్లోనే గుర్తించారు. పలురకాలుగా దాతలు, భక్తులు తమ మొక్కుల్లో భాగంగా కానుకలుగా ఇచ్చిన ఆస్తులు రోజురోజుకూ రెట్టింపవుతున్నాయి. వెంకన్న ఆస్తులకు సంబంధించి దేశవ్యాప్తంగా 7,123 ఎకరాల్లో ఆస్తులు విస్తరించివున్నాయి. కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు అనేక రాష్ట్రాల్లో భక్తులు తమ కానుకలుగా శ్రీవారికి ఆస్తులను రాసిచ్చారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణా, తమిళనాడు, కర్నాటక,కేరళ,మహారాష్ట్ర,ఒరిస్సా ప్రాంతాల్లో ఆస్తులు కలిగివున్నాడు.

# అమరావతిలో అన్ని సామాజిక వర్గాలకు న్యాయం జరుగుతుందా ?: వైసిపి నేత సజ్జల రామకృష్ణారెడ్డి



**విజయవాడ,ఏప్రిల్ 4,ప్రభాతవార్తప్రతినిధి:** అమరావతిలో అన్ని సామాజిక వర్గాలకు న్యాయం జరుగుతుందా ? అని అనుమానించే దిశలో టీడీపీ, ఆ పార్టీ అనుకూల శక్తుల మాటలు ఉంటున్నాయని వైకాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సమన్వయకర్త సజ్జల రామకృష్ణారెడ్డి వ్యాఖ్యానించారు.అమరావతి రాజధాని విషయంలో కూటమి ప్రభుత్వం, ముఖ్యమంత్రి చంద్రబాబుపై వైసీపీ నేత సజ్జల రామకృష్ణారెడ్డి తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. తాడేపల్లిలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఇన్నిరోజులు అమరావతికి చట్టబద్ధత లేదా అని ప్రశ్నించారు. వైసీపీ ప్రభుత్వం తీసుకున్న వికేంద్రీకరణ అంశాన్ని మూడు ముక్కలాట అంటూ వెటకారం చేశారని మండిపడ్డారు. గతంలోనే రాజధానికి చట్టబద్ధత ఉందని, ఇప్పుడు కొత్తగా చెబుతున్నవన్నీ అబద్ధాలని ఆయన మండిపడ్డారు. రాజధాని నిర్మాణం వల్ల రాష్ట్రంపై ఆర్థిక భారం పడకూడదన్నదే జగన్ ఆలోచన అని సజ్జల తెలిపారు. అందుకోసమే 30 వేల ఎకరాల ప్రభుత్వ భూమి ఉన్న చోట రాజధాని ఉండాలని జగన్ ప్రతిపాదించారని గుర్తుచేశారు. చంద్రబాబు రాజధానిని ఒక ఖిగ్రోత్ ఇంజిన్‌ఖిలా కాకుండా, ప్రజాధనాన్ని తోడేసే ఖిమోటారుఖిలా వాడు కుంటు న్నారని ఆరోపించారు. అనవసరమైన విధంగా రేట్లు పెంచి, కాంట్రాక్టుల పేరుతో దోపిడీ చేస్తున్నారని విమర్శించారు. పార్లమెంట్‌లో రేణుకా చౌదరి అమరావతిని కమ్మరావతి అని సంబోధించినప్పుడు టీడీపీ ఎంపీలు ఎందుకు ఖండించలేదని ప్రశ్నించారు. లోకేశ్ ఆ వ్యాఖ్యలకు చప్పట్లు కొట్టడ ఏమిటన్నారు.

# తిరుపతి నగరపాలికలో ఎన్నికల వార్డుల విభజన ప్రక్రియ

## - 10 నుండి 16 వరకు ప్రజల అభిప్రాయాలు



**తిరుపతి,ఏప్రిల్ 4ప్రభాతవార్తప్రతినిధి::** రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు తిరుపతి నగరంలో పెరగనున్న ఎన్నికల వార్డుల విభజన, పెంపు ప్రక్రియను అప్రమత్తంగా చేపట్టాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. నగరంలో జనాభా ప్రాతిపదికన ఎన్నికల వార్డుల విభజన, పెంపుపై నగరపాలక సంస్థ రెవిన్యూ, పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు, స్వర్ణ వార్డు కార్యదర్సులతో శనివారం కమిషనర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని మునిసిపల్ కార్పొరేషన్ లలో జనాభాకు అనుగుణంగా ఎన్నికల వార్డుల సంఖ్య పెంచేందుకు ఏప్రిల్ 1న జిఒ విడుదల చేసిందని తెలిపారు. ఆ మేరకు తిరుపతి నగరపాలక సంస్థలోని 50 వార్డులను 66 వార్డులకు పెంచేలా నిర్ణయించారని తెలిపారు. ఈ వార్డుల విభజన, పెంపు ప్రక్రియ లో అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని తెలిపారు. అధికారులు, సిబ్బంది క్షేత్ర స్థాయిలో సర్వే నెంబర్లు, జనాభా, తదితర వాటిని ప్రామానికంగా జాగ్రత్తగా పరిశీలించి విభజన చేయాలని తెలిపారు. ఈ నెల 9వ తేదీ లోపు వార్డుల విభజన ప్రక్రియ ముసాయిదా సిద్ధం చేయాలని తెలిపారు. వార్డులను విభజించే ప్రతిపాదనను ఫారం 1 ద్వారా 10 వ తేదీ నుండి 16 వ తేదీ వరకు నగరపాలక సంస్థ నోటీసు బోర్డు, ఇతర ప్రకటనల ద్వారా ప్రజల అభ్యంతరాల కొరకు ఉంచాలని తెలిపారు. 25 వ తేదీ లోపు మున్సిపల్ కార్పొరేషన్ ద్వారా ఎన్నికల వార్డుల విభజన ప్రతిపాదనలను ఖరారు చేసి, మున్సిపల్ పరిపాలన కమిషనర్ డైరెక్టర్‌కు సమర్పించడం జరుగుతుందని తెలిపారు. మే రెండవ తేదీ లోపు ప్రజల నుండి వచ్చిన వినతిపత్రాలను, మున్సిపల్ కార్పొరేషన్ యొక్క అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్న తరువాత, మున్సిపల్ పరిపాలన కమిషనర్ డైరెక్టర్ చేత మున్సిపల్ కార్పొరేషన్ యొక్క వార్డు విభజన ప్రతిపాదనలకు ఆమోదం తెలపడం జరుగుతుందని తెలిపారు. మే 5వ తేదీ లోపు కమిషనర్ ద్వారా ఆంధ్రప్రదేశ్ గెజిట్‌లో ఫారం 6 లో తుది నోటిఫికేషన్ ప్రచురణ చేయడం జరుగుతుందని తెలిపారు. అదనపు కమిషనర్ శారదా దేవి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, డిసిపీలు ఖాన్, దేవి కుమారి, రెవిన్యూ అధికారులు సేతు మాధవ్, రవి, ఏసీపీలు పార్వతి ప్రియ, మూర్తి, సర్వేయర్లు కోటేశ్వరరావు, గురువా రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# అమరావతి రాజధాని చట్టబద్ధతపై ఎపి జెఎసి హర్షం



అమరావతి చట్టబద్ధతపై కేకు కట్‌చేస్తున్న బొప్పరాజు తదితరులు

**విజయవాడ, ఏప్రిల్ 4, ప్రభాతవార్త :** రాష్ట్ర విభజన అనంతరం ఆంధ్రప్రదేశ్లో అమరావతి రాజధాని నిర్మించాలని ఎంతో పట్టుదలతో అమరావతిలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా శంకుస్థాపన చేసిన రాజధానిని, గత ప్రభుత్వం మూడు రాజధాను ల పేరుతో అమరావతి రాజధానిని మరుగును పెట్టాలని చూసినప్పటికీ పట్టు వదలని విక్రమార్కునిలా అమరావతిలోనే రాజధాని నిర్మిస్తామని ఎన్నికల ముందు కూటమి నాయకులు గా ఇచ్చిన హామీ మేరకు ఎన్నికల అనంతరం ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ఆ దిశగా ప్రయత్నాలు చేస్తూ నేడు పార్లమెంటులో ప్రధానమంత్రిని కూడా ఒప్పించి చట్టం అయ్యేలా చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర కమిటీ తరఫున కృతజ్ఞతలు తెలియజేస్తూ హర్షం వ్యక్తం చేస్తున్నామని చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, సెక్రెటరీ జనరల్ పలిశెట్టి దామోదరరావు, అసోసియేట్ చైర్మన్ టి. వి.ఫణి పేర్రాజు, కోశాధికారి తిమ్మనర్తి నాగేశ్వరరావు శనివారం విజయవాడ రెవెన్యూ భవన్లో జరిపిన ప్రెస్ మీట్ ద్వారా హర్షం ప్రకటించారు. ఈ సందర్భంగా చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అమరావతి విషయంలో ప్రజలకు ఉద్యోగులకు నమ్మకం కలిగించే లాగా పార్లమెంట్ ఉభయ సభల్లో ద్వారా చట్టం చేసి తన సత్తా నిరూపించుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి ధన్యవాదాలు తెలియజేస్తూ, ముందుగా కేక్ కట్ చేసి జయహో అమరావతి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు గుర్తు చేసుకుంటూ రాష్ట్రం విడిపోగానే దశాబ్దం క్రితం పేరులో, లోగోలో అమరావతి చిహ్నాంతో ఏర్పాటైన తొలి ఉద్యోగుల జేఏసీ – "ఏపీ జేఏసీ అమరావతి" అని చెప్పారు. అయితే అమరావతి రాజధానిని ఇంకా పటిష్ట పరిచేందుకు ఉమ్మడి రాజధాని హైద రాబా దులో ఉద్యో గులకు ఇల్లు స్థలాలు కేటా యించిన విధంగానే రాజధాని అమరావతిలో కూడా రాష్ట్ర సచివాలయం మరియు శాఖాపరమైన (హెచ్వోడి) కార్యాలయాల ఉద్యోగులకు వెంటనే స్థలాలు కేటాయించి ఉద్యోగుల్లో కూడా మనోధైర్యం నింపాలని బొప్పరాజు విజ్ఞప్తి చేశారు. పేరులో, లోగోలో అమరావతి చిహ్నాం తో దశాబ్ద కాలం క్రితం ఏర్పడి, నేటికి అనేక శాఖాపరమైన సంఘాలతో బలంగా ఉండి, లక్షలాది మంది ఉద్యోగులకు అండగా నిలుస్తున్న తొలి ఉద్యోగుల జేఏసీ – ఏపీ జేఏసీ అమరావతి అని, ఇప్పుడు దానికి చట్టబద్ధత రావడం చాలా గర్వంగా ఫీల్ అవుతున్నామని చెప్పారు. ఐ.ఆర్ మరియు 12 వ పిఆర్సి కమిషనర్ నియామకం అలాగే రాష్ట్రంలో పనిచేస్తున్న 16 లక్షల మంది ఉద్యోగులు నాలుగు లక్షల పైబడి ఉన్న పెన్షనర్లకు గతంలో 43 ఫిట్మెంట్ ఇచ్చిన చంద్రబాబునాయుడుపై ఎన్నో ఆశలతో ఎదురుచూస్తున్నారని ఉద్యోగులకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు వెంటనే ఉద్యోగుల ఆశలకు అనుకూలంగా ఐ.ఆర్ తక్షణమే ప్రకటించి, ఒక్క రూపాయి కూడా ఖర్చులేని పీఆర్సీ కమిషనర్ ను తక్షణమే నియమించి వీలైనంత త్వరగా 90 రోజుల్లో నివేదిక తెప్పించుకుని 12వ పిఆర్సి ప్రకటించాలని కోరారు.

గత ప్రభుత్వ హయాంలో ఉన్న బకాయిలతో పాటు ఈ ప్రభుత్వం వచ్చాక చెల్లించాల్సిన బకాయిలు కలిపి మొత్తం సుమారు 40 వేల కోట్ల పైబడి చేరిందని ఈ బకాయిల్లో మెజార్టీ బకాయిలు రిటైర్డ్

మరియు చనిపోయిన ఉద్యోగుల సెటిల్మెంట్లు డబ్బులే ఉన్నాయని ఇప్పటికే రిటైర్డ్ ఎంప్లాయిస్ కు చెల్లించాల్సిన బకాయిల డబ్బులు తీసుకోకుండానే చనిపోతుండడం చాలా బాధాకరమని అన్నారు. ఇప్పటికే అనేక సమావేశాల్లో మరియు లిఖిత పూర్వకంగా ఈ అంశాన్ని ప్రభుత్వానికి ఏపీ జేఏసీ అమరావతి పక్షాన తెలిపామన్నారు.



## 55 కిలోల గంజాయిని పట్టుకున్న ఎల్ కోట పోలీసులు

**విజయనగరం లక్కవరపుకోట, ఏప్రిల్ 4 ప్రభాతవార్త** మండలంలోని రంగరాయపురం గ్రామ సరిహద్దు వద్ద విశాఖపట్నం అరకు ప్రధాన రహదారిపై శనివారం ఎల్ కోట ఎస్ ఐ నవీన్ పడాల్ ఆధ్వర్యంలో నిర్వహించిన వాహనాల తనిఖీలలో ఒడిస్సా నుండి తమిళ నాడుకు గంజాయి తరలిస్తున్నట్టు ముందస్తు సమాచారంతో కారులో తరలిస్తున్న 55 కేజీలు గంజాయితో పాటు ముగ్గరిని అదుపులోకి తీసుకున్నారు. పట్టుకున్న గంజాయి విలువ రూ.10 లక్షలు ఉంటుందని ఎస్ఐ తెలిపారు. కారు, ఒక ద్విచక్ర వాహనాన్ని అదుపులోకి తీసుకున్నామని ముగ్గురు వ్యక్తులు ఒడిశాకు చెందిన సంజయ్, సంజీవ్ కుమార్, పింకూ గా గుర్తించామని వీరిపై పి.డి యాక్ట్ కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించిన్నట్లు ఎస్ఐ తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పి దామోదర్ మాట్లాడుతూ గంజాయి సరఫరా చేసినా, విక్రయించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్పి హెచ్చరిక జారీ చేశారు. గంజాయి నిర్వహణకు 5 చెక్ పోస్టులు పెట్టామని పట్టుకున్న గంజాయి భద్రత కోసం 1200 అడుగులతో ఒక రూమ్ నిర్మిస్తున్నా మన్నారు. పెద్ద మొత్తం అయిన తర్వాత ఆ గంజాయిని తగలబెడతామన్నారు. గంజాయిని పట్టుకున్న లక్కవరపుకోట పోలీసులను అభినందిస్తున్నామని ఎస్ పి తెలిపారు. గంజాయి అక్రమ రవాణాపై ఉక్కు పాదం మోపుతున్నట్టు ఎస్ పి విజయనగరంలోని ప్రెస్ మీట్‌లో తెలిపారు. పట్టుకున్న గంజాయిని ఎల్ కోట తహసీల్దార్ టీ.రమేష్ సమక్షంలో తూకం వేసి సీజ్ చేశారు.

# రాజధానిపై జగన్‌కు ఎందుకు కక్ష?

## - ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డి



సమావేశంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డి

**పెద్దపంజాణి(చిత్తూరు జిల్లా), ఏప్రిల్ 4 ప్రభాతవార్త:** అమరావతి రాజధాని నగరంపై వైకాపా అధినేత వైఎస్ జగన్‌కు ఎందుకంత కక్ష అని ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డి ప్రశ్నించారు. శనివారం పెద్దపంజాణిలో సర్పంచుల సన్మాన కార్యక్రమంతో పాటు ప్రభుత్వం రాయితీతో అందిస్తున్న ఈ ఆటోలపంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధికారంలో ఉన్న ఐదేళ్ళపాటు జగన్ మూడు రాజధానులని పేర్కొన్నారని నేడు మావిగన్ పాట అందుకున్నారని పేర్కొన్నారు. ఆంధ్రరాష్ట్రానికి అభినవ తుగ్లక్‌గా ఆయన మారారని పేర్కొన్నారు. పూటకోసాకు గంటకోమాటతో మాట్లాడే జగన్‌లాంటి నాయకులు అవసరమాఅని ప్రజలు ఆలోచించాలని కోరారు. రాజధాని అమరావతి నగరాన్ని మార్చడం ఇకఎవరితరమూ కాదని ఆయన పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రఅభివృద్ధి ప్రజలకు క్షేమం సాధ్యమౌతుందన్నారు. రాష్ట్రానికి రాజధానిగా 2014లోనే ప్రకటించి నిర్మాణపనులుసైతం మెదలుపెట్టారన్నారు. అప్పట్లో ప్రతిపక్షనేతగా ఉన్న జగన్‌కూడా రాజధానికి మద్దతు పలికారన్నారు. అయితే ఆయనఅధికారంలో వచ్చాక రాజధానినగరాన్ని పట్టించుకోక అటవీప్రాంతలా మార్చేశారని పేర్కొన్నారు. మరలా సిఎం చంద్రబాబు నాయుడు రాజధాని అమరావతి నగరం నిర్మాణంపై దృష్టిపెట్టి ఒకచరిత్రలో నిలిచిపోయే రీతిలో రాజధాని నిర్మాణానికి చర్యలు చేపట్టారన్నారు. వచ్చే ఐదేళ్ళలో పూర్తిస్థాయిలో రాజధానిగా అమరావతి ఉంటుందన్నారు. సిఎం చంద్రబాబు నాయుడు పోలవరంతోపాటు రాయలసీమలోని త్రాగునీటి ప్రాజెక్టులని సైతం త్వరగా పూర్తిచేసేలా చర్యలు చేపట్టారన్నారు. ప్రజలకు ప్రభుత్వ పథకాల్లో లబ్ది కలిగించేందుకు పార్టీలు చూడమని వారికిఉన్న పేదరికమే కొలబద్దఅని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రప్రజలు అన్నీగమనిస్తున్నారని వచ్చేఎన్నికల్లో వైకాపాకు గట్టిగా బుద్దిచెప్పడం ఖాయమన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ రామమూర్తి, ఎంపిడిఓ బాలాజీ, డిప్యూటి ఎంపిడీఓలు సుధాకర్ రావ్, శారదాదేవి, ఏపిఎం మురగేష్, ఏపిఓ నీరజ, ట్రాన్స్‌కో ఏఈ వెంకటరమణ, ఏఎంసి చైర్మన్ రాజనన్న, ఎంపిపి రెడెప్పప్ప, కూటమి నేతలు రెడ్డివారి విజయ్ భాస్కర్ రెడ్డి, మురహరిరెడ్డి, సుధాకర్ రెడ్డి, రోజారెడ్డి, శ్రీరాములు, రుద్రమూర్తి నాయుడు, నాగిరెడ్డి, జయరామి రెడ్డి, కృష్ణారెడ్డి, ముబారక్ తాజ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ శంకప్ప, జనసేన మండల అధ్యక్షులు రంపాల శివకుమార్, సోమశేఖర్, రాజేష్, సుబ్రమణ్యం, పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# 15పాల నమూనాల్లో కల్తీ నిర్ధారణ పాలపై కట్టుదిట్టమైన చర్యలు

**రాజమహేంద్రవరం,ఏప్రిల్4,ప్రభాతవార్త** ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి. తూర్పుగోదావరి జిల్లాలో కల్తీ పాల ఘటనల నేపథ్యంలో జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి ఆదేశాల మేరకు పశు సంవర్ధక శాఖ మరియు ఫుడ్ సేఫ్టీ విభాగాలు సంయుక్తంగా విస్తృత చర్యలు చేపడుతున్నట్లు జిల్లా పశు సంవర్ధక అధికారి టి. శ్రీనివాస రావు, జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి కె. సుప్రియ శనివారం ఒక సంయుక్తంగా తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు మొత్తం 705 పాల నమూనాలను పరీక్షి ంచగా, అందులో 15 నమూనాల్లో కల్తీ ఉన్నట్లు గుర్తించినట్లు వెల్లడించారు. వాటిలో 1 యూరియా, 8 డిటర్జెంట్, 2 మాల్టోడెక్స్ట్రిన్, 5 నాణ్యత ప్రమాణాలకు తగ్గని నమూనాలు ఉన్నట్లు తెలిపారు. సంబంధిత వ్యక్తులపై ఆహార భద్రతా చట్టం ను అనుసరించి చర్యలు తీసుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు. జిల్లా యంత్రాం గం ఆధ్వర్యంలో ఫిబ్రవరి 22 నుండి జిల్లాలో ర్యాండమ్‌గా రాపిడ్ టెస్టులు నిర్వహిస్తూ కల్తీ పాల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రతి వారం ఫుడ్ సేఫ్టీ అధికారులు, పశు సంవర్ధక శాఖ సిబ్బంది జిల్లా వ్యాప్తంగా ర్యాండమ్ గా రాపిడ్ టెస్టులు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. పాలు ఉత్పత్తి, సరఫరా, మార్కెటింగ్, ఇంటింటికి విక్రయాలు చేసే వారందరూ తప్పనిసరిగా లైసెన్స్ పొందాలని స్పష్టం చేశారు. ఇందుకోసం స్థానిక పశు సంవర్ధక శాఖ లేదా సచివాలయ సిబ్బందిని సంప్రదించి తమ వివరాలను వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. ముఖ్యంగా పాలు మరియు అనుబంధ రంగాల్లో పనిచేస్తున్న వారిని గుర్తించి, వారి పేర్లు నమోదు చేయించుకునేలా అవగాహన కల్పించడం జరుగుతోందని తెలిపారు. ఇంటి వద్దనే లేదా విడిగా పాలు కొనుగోలు చేస్తున్న ప్రజలను ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం చేస్తూ, గ్రామ స్థాయి నుంచి పట్టణ స్థాయి వరకు అందరూ కలిసి పనిచేయాలని పిలుపు నిచ్చారు. జిల్లాలో కల్తీ పాల వినియోగాన్ని పూర్తి గా నివారించేందుకు ప్రభుత్వం తీసు కుంటున్న చర్యలకు ప్రజలు సహకరించాలన్నారు.





## తిరుమల ఘాట్‌లో ప్రమాదం

**తిరుమల,ఏప్రిల్ 4ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల నుండి తిరుపతికి వెళ్ళే మొదటి ఘాట్ రోడ్ లో రెండు వాహనాలు శనివారం సాయంత్రం ప్రమాదానికి గురయ్యాయి. మొదటి ఘాట్ రోడ్డు చివరన వినాయక గుడి సమీపంలో తమిళనాడుకు చెందిన కారు టైరు పంచరై డివైడర్ ని ఢీ కొంది. అదే సమయంలో తిరుపతి లోకల్ టాక్సీ జీప్ వినాయక గుడి దాటిన మలుపు వద్ద వేగంగా వెళ్లి డివైడర్ పైకి ఎక్కింది.. రెండు వాహనాల్లో వెళ్తున్న భక్తులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు.. మొదటి ఘాట్ రోడ్లో రెండు వాహనాలు ప్రమాదానికి గురవడంతో ట్రాఫిక్ నిలిచిపోయింది. అలిపిరి ఏవిఎస్ఒ రమేశ్‌కృష్ణ సిబ్బందితో చేరుకుని వాహనాలను తప్పించి ట్రాఫిక్‌ను పునరుద్దరించారు.

## కోనలో వైభవంగా నృసింహుని స్వర్ణ గరుడోత్సవ సేవ

**రాపూరు (నెల్లూరు), ఏప్రిల్ 4, ప్రభాతవార్త :** ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలోని శ్రీ పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి వారికి శనివారం స్వర్ణ గరుడోత్సవ సేవ నిర్వహించారు. స్వామి వారి జన్మనక్షత్రమైన స్వాతి నక్షత్రం సందర్భంగా తెల్లవారుజామున స్వామి వారి మూలమూర్తికి అభిషేకం, చందనాలంకారం నిర్వహించారు. ఉదయం 9 గంటలకు స్వామి వారికి శాంతి హోమం నిర్వహించిన అనంతరం స్వామి వారి నిత్యకళ్యాణం వైభవంగా నిర్వహించారు. సాయంత్రం స్వామి వారికి అత్యంత ప్రీతిప్రాతమైన స్వర్ణ గరుడవాహనంపై శ్రీవారిని వుంచి స్వామివారికి క్షేత్రోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. మంగళవాయిద్యాలు, గిరిజన వాయిద్యాల మధ్య నిర్వహించిన స్వామివారి స్వర్ణ గరుడవాహన క్షేత్రోత్సవంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని స్వామి వారిని దర్శించుకోని పూజలు నిర్వహించారు. పెద్ద ఎత్తున వచ్చిన భక్తులకు కావల్సిన భోజన, వసతి ఏర్పాట్లును ఆలయ ఉప కమీషనర్ పోరెడ్డి శ్రీనివాసుల రెడ్డి పర్యవేక్షణలో ఆలయ సూపరిడెంట్ పాలవల్లి లక్ష్మీ నారాయణ, ఎఇ వినోద్, సిబ్బంది నరసింహా, వెంకటసుబ్బయ్య, పెంచలస్వామి, హరిష్ ఇతర సిబ్బంది పర్యవేక్షించారు. స్వామి వారి పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా ఆలయ ప్రధానార్చకులు గుండ్లూరు రామయ్య స్వామి, పెంచల పెంచలయ్య స్వామి, ముఖ్య అర్చక స్వామి గుండ్లూరు శశి స్వామి, అర్చక స్వాములు మధు స్వామి, వర్ధన్ స్వామి, వెంకట బాలజీ స్వామి, వినోద్ స్వామి, నాగరా స్వామి, సాయి స్వామి నిర్వహించారు.

### మాజీ సీఎం జగన్ మరో సారి ప్రజలను మోసగించాలని ప్రయత్నిస్తున్నారు : మంత్రి అచ్చెన్నాయుడు

**విజయవాడ,ఏప్రిల్ 4,ప్రభాతవార్త ప్రతినిధి:** మాజీ సీఎం జగన్ మరో సారి ఏపీ ప్రజలను మోసగించాలని ప్రయత్నిస్తున్నారని మంత్రి అచ్చెన్నాయుడు ఆరోపించారు. ఆయన ప్రతి మాట అసత్యమన్నారు. విశ్వసనీయత అనే పదం వాడే హక్కు జగన్‌కు లేదన్నారు.. రాజధానిపై తొమ్మిది సార్లు మాట మార్చిన జగన్‌కు విశ్వసనీయత ఉందా?

అని ప్రశ్నించారు. మూడు రాజధానులని ఏం ఉద్ధరిం చారో చెప్పాలని డిమాండ్ చేశారు. మంగళగి రిలో మంత్రి అచ్చెన్నాయుడు మీడియాతో మాట్లాడారు. '2019లో కూడా చంద్రబాబు ప్రభుత్వమే వచ్చి ఉంటే ఈ బాధలు ఉండేవి కావన్నారు.

# డా. గజల్ శ్రీనివాస్‌కు 'గజల్ కళాభారతి' పురస్కారం



**విశాఖపట్నం, ఏప్రిల్ 4 ప్రభాతవార్త:** కళాభారతిలో మొట్టమొదటిసారిగా ప్రముఖ ప్రపంచ విఖ్యాత గజల్ గాత్ర విద్వాంసులు డాక్టర్ గజల్ శ్రీనివాస్ ను గజల్ కళాభారతి" బిరుదుతో విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. విశాఖ మ్యూజిక్ అండ్ డాన్స్ అకాడమీ సంయుక్తంగా శనివారం కళాభారతిలో డాక్టర్ గజల్ శ్రీనివాస్ ను సత్కార కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా అతిథులు అధ్యక్షులు కార్యదర్శి కోశాధికారి తదితరులు జ్యోతి ప్రజ్వలన చేశారు. గజల్ చారిటబుల్ ట్రస్ట్ తోపాటు ముందుగా ఆయనను వేదికపైకి పిలిచి విశిష్ట అతిథి స్పిరిట్యుయల్ గురు మోలానా అమిర్ ఉద్దీన్ మలక్ సాహెబ్ , సభ అధ్యక్షులు ఎంఎస్ఎన్ రాజు, కార్యదర్శి శ్రీరా మదాస డాక్టర్ రాంబాబు, కోశాధికారి పైడా కృష్ణ ప్రసాద్, స్థానిక వస్త్ర వ్యాపార అధిపతి మల్లిక్, దుస్సాలువుతో పూలదండలతో, ఘనంగా సత్కరించి "గజల్ కళాభారతి" బిరుదు ప్రదానం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ కళాభారతిలో ముమ్మారు గిన్నెస్ బుక్ ఆఫ్ ప్రపంచ రికార్డు అందుకుని, 150 భాషల్లో గజల్స్ పాడు తూ, అనేక దేశాలలో గజల్ కార్యక్రమాలు ఇస్తూ, ఎక్కడ ఏ దేశానికి వెళితే ఆ దేశంలో ఆ భాషలోనే గజల్స్ పాడి అందరి మన్ననలు పొందిన తెలుగు తేజం డాక్టర్ గజల్ శ్రీనివాస్ అని కొనియాడారు. ముఖ్యముఖ్య అతిథి డైరెక్టర్ జనరల్ నేవల్ ప్రాజెక్ట్ వైస్ అడ్మిరల్ కె. శ్రీనివాస్ తో పాటు అధ్యక్ష కార్యదర్సులు రూ 20,000 / నగదు బహుమతి అందజేసేరు. ఈ సంద ర్భంగా ముఖ్యఅతిథి మాట్లాడుతూ ఇలాంటి ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన కళాకారుడికి జరిగిన సత్కార సభలో పాల్గొని వారిని సత్కరించడం ఆనందంగా ఉందని అన్నారు. అధ్యక్షులు మాట్లాడుతూ కళాభారతిలో సంగీ తం, సాహిత్యం, నృత్యం, నాటకం ఇలాంటి ప్రముఖ కలలే కాకుండా హరికథ, బుర్రకథ, తోలు బొమ్మలాట, తదితరు కళాకారులను కూ డా ఆహ్వానించి ఈ వేదిక మీద కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ప్రోత్సహిస్తున్నామని తెలియజేశారు. సన్మాన గ్రహీత డాక్టర్ గజల్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఇప్పటికీ కొన్ని వందల బిరుదు సత్కారాలు జరిగాయని కానీ ప్రథమంగా ఒక కలలకు నిలయమైన కళాభారతి పేరుతో గజల్ కళాభారతి అనే భృతి సత్కారం అందుకోవడం ప్రథమణి చాలా ఆనందంగా ఉందని అన్నారు. అనంతరం జరిగిన గజల్ గాత్ర కచేరీలో పలు గజల్స్ పాడి శ్రోతలను మరో ప్రపంచానికి తీసుకెళ్లారు.

# దుర్గమ్మవారి సేవలో కేరళ డిజిపి



కేరళ డిజిపి దంపతులకు దుర్గమ్మవారి చిత్రపటం అందజేస్తున్న దృశ్యం

**ఇంద్రకీలాద్రి, ఏప్రిల్ 4, ప్రభాతవార్త** బెజవాడ దుర్గమ్మవారిని కేరళ రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డిజిపి) రవాడ ఆజాద్ చంద్రశేఖర్ కుటుంబ సభ్యులతో కలిసి శనివారం దర్శించుకున్నారు. వేద పండితులు వారికి ఆశీర్వచనం అందజేయగా, ఆలయ అధికారులు అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదం మరియు చిత్రపటాన్ని బహుకరించారు. ఈ సందర్భంగా కేరళ డీజీపీ మాట్లాడుతూ ఇంద్రకీలాద్రిపై అమ్మవారిని దర్శించుకోవడం చాలా సంతోషంగా ఉందని, భక్తుల కోసం ఆలయ యంత్రాంగం చేసిన ఏర్పాట్లు బాగున్నాయని కొనియాడారు. లోకకళ్యాణం కోసం, అందరూ క్షేమంగా ఉండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు ఆయన పేర్కొన్నారు

**- నిత్యాన్నదాన పథకానికి విరాళం :** ఇంద్రకీలాద్రి శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానములో నిర్వహించే నిత్యాన్నదాన పథకమునకు మోతినగర్ హైదరాబాద్ వాస్తవ్యులు పి రజినికాంత్ శర్మ, వేలంమగ్రి సాంబశివశర్మ పద్మావతి దంపతులు పేరు మీద రూ.1,00,000లు విరాళమును మరియు రైలుపేట, రేపల్లెకు చెందిన ద్రోణ వజ్జల బ్రహ్మ అవధాని మరియు ధర్మపత్ని రూ.1,00,000లు విరాళమును మరియు విజయవాడకు చెందిన ఒకే కుటుంబము వారు బమిడిపాటి శ్రీమన్నారాయణ రూ.1,00,000లు విరాళమును మరియు బమిడిపాటి శారద రూ.1,00,000లు విరాళమును ఆలయ అధికారి కలిసి అన్నదానమునకు వినియోగించవలసిందిగా తెలిపి ఉన్నారు.

# జగ్గయ్యపేటలో తెలుగు రాష్ట్రాల స్థాయి ఈతల పోటీలు

## -19 జిల్లాల నుండి తరలి వస్తున్న స్విమ్మర్లు



తెలుగు రాష్ట్రాలస్థాయి ఈతల పోటీలకు సిద్ధమైన జగ్గయ్యపేట స్విమ్మింగ్ పూల్

**జగ్గయ్యపేట, ఏప్రిల్ 4, ప్రభాతవార్త :** ఎన్‌టిఆర్ జిల్లా జగ్గయ్యపేట పట్టణంలో ఈనెల 5వ తేదీన ఉభయ తెలుగు రాష్ట్రాలస్థాయి ఈతల పోటీలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తిచేసినట్లు శనివారం మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర తెలిపారు. ఆంధ్రప్రదేశ్-తెలంగాణా స్టేట్స్ డిఎస్ఏ మాష్టర్స్ స్విమ్మింగ్ ఛాంపియన్‌షిప్-2026 పోటీలను జగ్గయ్యపేట చరిత్రలో మొదటిసారిగా స్థానిక స్విమ్మింగ్‌పూల్‌లో ఈపోటీలను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈటోర్నమెంట్స్ కు ముఖ్య అతిధులుగా విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని), స్థానిక ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య), ప్రభుత్వవిప్-నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య, కెడిసిసి బ్యాంక్ చైర్మన్ నెట్టెం రఘురామ్, ఏపి కల్చర్ కమిషన్ చైర్‌పర్సన్ పి తేజస్వి, శాప్ వైస్‌చైర్మన్, ఎండి భరణి, శాప్ చైర్‌పర్సన్ అనిమిని రవి నాయుడు విచ్చేస్తున్నట్లు తెలిపారు. మున్సిపల్ కమిషనర్ కృష్ణారావు, డ్రీమర్స్ సిమ్మర్స్ అసోసియేషన్ (డిఎస్ఏ) వ్యవస్థాపకులు, కోచ్ పొట్టాబత్తిన పాండురంగారావు, ఈవెంట్ కన్వీనర్ అన్నంనీడి కళ్యాన్, అధ్యక్షులు మందడపు శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి కలాలి నరేష్, కోశాధికారి పి రమాదేవి, స్విమ్మర్స్ కో-కన్వీనర్, సీనియర్ జర్నలిస్ట్ యలదండి శ్రీనివాసరావు, యువకోచ్ పి సందీప్ మాట్లాడుతూ 25 నుండి 80 ఏండ్ల వయసుపైబడిన వారందరికి వయసుల వారీగా పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉదయం గం.9లకు పోటీలు ప్రారంభమవుతాయన్నారు. జగ్గయ్యపేట పట్టణం నుండి 28 మహిళలు, 21 మంది పురుషులు మొత్తం 49 మంది పోటీల్లో పాల్గొంటున్నారన్నారు.

రెండు రాష్ట్రాలలోని 19 జిల్లాల నుండి 210 మంది తలపడుతు న్నారన్నారు.

# వెనక్కి వెళ్లిన సాఫ్ట్‌వేర్ సంస్థల్ని మళ్లీ తీసుకొస్తున్నాం : మంత్రి కొల్లు రవీంద్ర

**విజయవాడ,ఏప్రిల్ 4,ప్రభాతవార్త ప్రతినిధి:**రాష్ట్రంలో సాంకేతిక అభివృద్ధికి 27 పాలసీలు తీసుకున్నామని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. గతంలో వెనక్కి వెళ్ళిపోయిన సాఫ్ట్‌వేర్ సంస్థలను మళ్ళీ తీసుకొస్తున్నట్లు చెప్పారు. ఏఐ డిజిటల్ టెక్నాలజీ ఇండస్ట్రీ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఏఐ సమ్మిట్‌ను కొల్లు రవీంద్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ప్రపంచాన్ని టెక్నాలజీ నడిపిస్తోందని 25 ఏళ్ళ క్రితమే చంద్రబాబు చెప్పారన్నారు. '2014 లోనే చంద్రబాబు డేటా సెంటర్లు, ఏఐ అంటుంటే మాకు అర్థం కాలేదు. ఇప్పుడు అనేక డేటా సెంటర్లు వస్తున్నాయి. రాష్ట్రంలో పోర్టుల నిర్మాణం వేగంగా జరుగుతోంది. మత్స్యకారుల జీవితాలు బాగుపడకుండా వైకాపా కుట్రలు చేస్తోంది. వాటిని ఛేధిస్తూ అన్ని ఫిషింగ్ హార్బర్లు పూర్తి చేసి తీరుతాం. పరిశ్రమలు వచ్చి తీరప్రాంత ప్రజలు బాగుపడటం వైకాపాకి నచ్చట్లేదు. పొరుగు రాష్ట్రాల బోట్లను అడ్డుకునేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోంది. వైకాపా కుట్రపూరితంగా మత్స్యకారులను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తోంది.

# విమానాశ్రయం భూసేకరణ త్వరలోనే పూర్తి చేస్తాం

## -1070 ఎకరాలు ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విమానాశ్రయ అభివృద్ధి సంస్థకు అప్పగింత

**దగదర్తి (నెల్లూరు), ఏప్రిల్ 4, ప్రభాతవార్త :** దగదర్తి మండలం దామవరం కేకే గుంట గ్రామాలలో ప్రభుత్వం నిర్మించ తలపెట్టిన గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయంనిర్మాణం సంబంధించి భూసేకరణపనులు త్వరలోనేపూర్తి చేయనున్నట్లు కావలి ఆర్డీవో ఎలీషా పేర్కొన్నారు. ఇప్పటికే 1070 ఎకరాల భూమిని రాష్ట్ర విమానాశ్రయ అభివృద్ధి సంస్థకుఅప్పగించినట్లు తెలిపిన ఆయన 711 ఎకరాలు భూసేకరణ ఇంకా మిగిలి ఉన్నట్లుపేర్కొన్నారు. 1371.75 ఎకరాలలో నిర్మిస్తున్న విమానాశ్రయ నిర్మాణం కొరకు ఇప్పటికే 660 ఎకరాల భూమికినష్టపరిహారం చెల్లించినట్లుపేర్కొన్నారు. సర్వే నంబర్ వన్ బైవన్ దామవరం సంబంధించి ఇటీవల వరకు పరిహారం పంపిణీకి సంబంధించి న్యాయాస్థనంలో కేసునడుస్తుండేదని ప్రస్తుతం అది కూడా కొలిక్కి వచ్చినట్లు పేర్కొన్నారు. సర్వే నెంబర్ 238 నుంచి 259 వరకు దామవరం గ్రామానికి సంబంధించి భూమిపై హక్కుల గురించి గ్రామస్తులకు, పట్టాదారులకు మధ్య వివాదం నడుస్తుండేదని అది కూడా ఇటీవల పరిష్కారమైనట్లు పేర్కొన్నారు. తహసీల్దార్‌కార్యాలయంలో పెండింగ్లో ఉన్నజెన్యూన్ సర్టిఫికేట్లను వీలైనంత త్వరగా పరిష్కరించేలా సిబ్బందిని ఆదేశించినట్లు పేర్కొన్నారు. ఒకేభూమికి పలువురు నష్టపరిహారం కోరుతూఉండడం కుటుంబంలో నలుగురు వారసులు ఉండగా ఒకరు మాత్రమే తనకొక్కరికే కావాలంటూ వివాదాల సృష్టిస్తుండడంతో భూసేకరణ సమస్య క్లిష్టంగా మారిందన్నారు. వీలైనంత వరకుపరిహారం అందించేటట్లు చూసిలేని పక్షంలోపరిహారాన్ని న్యాయ స్థానంలో జమ చేసి భూములను స్వాధీనం చేసుకుంటామన్నారు. 2009 సంవత్సరం నుండి నేటి వరకు కొనసాగుతున్నభూసేకరణ పక్రియత్వరలో నేపూర్తిచేసి విమానాశ్రయనిర్మాణాన్ని ప్రారంభించేందుకుగల అడ్డంకులనుతొలగిస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ లాజరస్, డిప్యూటీ తహసీల్దార్ భాగ్యలక్ష్మి, సీనియర్ అసిస్టెంట్ శివ, మండల సర్వే రాబియాసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఏసిబి అధికారినంటూ బెదిరించి రూ.50లక్షలు వసూలు

## - సిఐ శివరాముడు కృషితో కటకటాల్లోకి నిందితుడు

**అనంతపురం, ఏప్రిల్ 4 ప్రభాతవార్త బ్యూరో** అనంతపురం జిల్లా కూడేరు మండలం కలగల్లు గ్రామానికి చెందిన ఎరుకల హనుమంతు 2021 సంవత్సరంలో తనను ఏసీబీ అధికారిగా ఫోన్లో పరిచయం చేసుకుని, ముదిగుబ్బలో తసిల్దార్‌గా పనిచేస్తున్న అన్వర్ హుస్సేన్‌ను ఫోన్ ద్వారా బెదిరించాడు. అవినీతి కేసులు పెట్టిస్తానని భయపెట్టి రూ.50 లక్షలు వసూలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ ఘటనపై అప్పట్లో కేసు నమోదైనా, నిందితుడు తప్పించుకుని తిరుగుతున్నాడు. జిల్లా ఎస్పీ ఆదేశాలతో ఈ కేసును సవాలుగా తీసుకున్న సిఐ శివరాముడు ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం ఏర్పాటు చేసి, సాంకేతిక ఆధారాలు, గోప్య సమాచారంతో నిందితుడి కదలికలను గమనించారు. దీంతో ఏప్రిల్ 4, 2026న నిందితుడు ఎరుకల హనుమంతును పోలీసులు అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేశారు. విచారణలో కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయని పోలీసులు తెలిపారు. ఈ కేసును విజయవంతంగా ఛేదించిన సిఐ శివరాముడు, వారి బృందాన్ని ఉన్నతాధికారులు అభినందించారు.

# మాజీ ఎమ్మెల్యే వర్మకు ఇచ్చిన భూమి రద్దు చేసే వరకు సిపిఐ పోరాటం: రాష్ట్ర కార్యదర్శి ఈశ్వరయ్య

**కాకినాడ,ఏప్రిల్4,ప్రభాతవార్త ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి.** జిల్లా కేంద్రం కాకినాడ నగరంలో ప్రభుత్వంకి చెందిన మూడున్నర ఎకరాల స్థలాన్ని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్విఎస్ఎన్ వర్మకు కానుకగా ఇవ్వడం కూటమి ప్రభుత్వం చేస్తున్న దారుణమని ఆ స్థలంలోనే ఆయుష్ మెడికల్ కళాశాల నిర్మించాలని పలువురు ప్రముఖులు డిమాండ్ చేశారు. ఆయుర్వేద ఆసుపత్రి నిర్మించిన పక్కనే ఆ కళాశాల నిర్మించి ఆసుపత్రిని అందుబాటులో తీసుకురావాలని వారు పేర్కొన్నారు. శనివారం కాకినాడలోని కాస్మోపాలిటన్ క్లబ్లో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు తాటిపాక మధు అధ్యక్షతన ప్రభుత్వ ఆస్తులను పరిరక్షి ంచాలని, ఆయుర్వేద ఆసుపత్రి పక్కనే మెడికల్ కళాశాల నిర్మించాలని, మాజీ ఎమ్మెల్యే వర్మకు కేటాయించిన 175 కోట్లు పైగా విలువ చేసే మూడున్నర ఎకరాల ప్రభుత్వ భూమిని రద్దు చేయాలంటూ అఖిలపక్షం ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి జి ఈశ్వరయ్య మాట్లాడుతూ ప్రభుత్వం టూరిజం శాఖ పేరుతో ఎస్విఎస్ఎన్ కన్స్ట్రక్షన్స్ సంస్థకి కట్టబెడుతున్నట్లు ఒక జీవోను విడుదల చేసిందన్నారు. ఇందులో ఎటువంటి పూర్తి వివరాలు లేకుండా ప్రజలను మాయ చేసే విధంగా ఈ జీవోను విడుదల చేసిందని ఆయన ఆరోపించారు. మూడున్నర ఎకరాల భూమిని వర్మకు తాజ్ హోటల్ పేరుతో కట్టబెట్టే విధంగాను, అక్కడ నిర్మాణం చేయనున్న మెడికల్ కళాశాలను పిఠాపురంలోని పేదల ఇళ్ల స్థలాలకు ఇచ్చిన చోట నిర్మాణం చేసేందుకు చీకటి ఒప్పందాలు జరగనున్నట్లు ఆయా పార్టీల నేతలు తెలియజేశారు. ఉన్న 5 ఎకరాల్లో ఇప్పటికి 240 మందికి పట్టాలు ఇచ్చారని మిగిలిన వారికి కూడా పట్టాలిచ్చి ఆ భూమి అక్కడ పేదలకే ఇవ్వాలని అఖిలపక్ష నాయకులు డిమాండ్ చేశారు. మాజీ ఎమ్మెల్యే వర్మకు ప్రభుత్వ భూమి ఇస్తే మాత్రం అటు న్యాయస్థానంలోనూ ఇటు ప్రజా ఉద్యమాలు నిర్వహిస్తామని ఈశ్వరయ్య హెచ్చరించారు. ఆయుర్వేద ఆసుపత్రి నిర్మించిన చోటే కళాశాలను కూడా నిర్మించాలని డిమాండ్ చేశారు. వైద్య నిబంధన నుంచి ఆసుపత్రి కళాశాల ఒకే చోట ఉండాలని ఆయన చెప్పారు. వర్మకిచ్చిన భూమిని రద్దు చేయాలని లేని పక్షంలో అమరావతిలో భారీ ఎత్తున ఉద్యమాన్ని లేవదీస్తామని ఈశ్వరయ్య హెచ్చరించారు. వర్మకు భూమి జీవోలో ఎక్కడా స్పష్టంగా ప్రభుత్వం ఇవ్వలేదని అతను మాత్రం దౌర్జన్యంగా ఆ భూమిని చదును చేసుకుంటూ తన ఆధీనంలో తెచ్చుకుంటున్నా దంటూ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మాదేపల్లి సత్యానందరావు, పిసీసీ ఉపాధ్యక్షుడు మట్ట ప్రసాద్ పేర్కొన్నారు. తాజ్ హోటల్ కాకినాడలో నిర్మాణం చేస్తున్నట్టు ఎక్కడా ప్రకటించలేదని ఇది కేవలం టీడీపీ ఒక నాయకుని కోసం చేస్తున్న భూ కబ్జాని వారు ఆరోపించారు. ఈ కబ్జాపై జాతీయస్థాయిలో తమ అధిష్టానంకు ఫిర్యాదు చేయనున్నట్లు పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ నేత మాజీ మంత్రి కురసాల కన్నబాబు మాట్లాడుతూ చంద్రబాబు తన పార్టీ వాళ్ళ కోసం కాకినాడలో స్థలం ఇస్తున్నాడని పిఠాపురంలో పేదలకు ఇచ్చిన స్థలంలో ఈ కళాశాల నిర్మించి పేదల నోట్లో మట్టి కొడుతున్నాడన్నారు. దీనిపై న్యాయపోరాటం చేస్తామని ఈ ఉద్యమానికి వైకాపా తన వంతుగా సహకరిస్తుందన్నారు. మాజీ ఎంపీ వంగా గీత మాట్లాడుతూ తమ హయాంలో ఆయుష్ కళాశాలకు స్థల సేకరణ కోసం కాకినాడ గర్ల్స్ పాలిటెక్నిక్ ఎంపిక చేసామన్నారు. ఆసుపత్రి నిర్మాణం పూర్తయిన ఇంతవరకు ప్రారంభానికి నోచుకోలేదని చెప్పారు. ఒక వ్యక్తి కోసం విలువైన భూమిని ధారాదత్తం చేయడం తగదని గీత విమర్శించారు.సీపీఎం సీనియర్ నేత దువ్వా శేషుబాబ్జీ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం భూ మాయాజాలం చేస్తోందని మండిపడ్డారు వర్మకు పవన్ కళ్యాణ్ ఎంఎల్సీ ఎంపీ రాజ్యసభ ఇవ్వలేదని దీంతో 200 కోట్లు విలువ చేసే భూమి గిఫ్ట్ ఇచ్చారని ఆరోపించారు. ప్రముఖ న్యాయవాది జవహర్ ఆలీ మాట్లాడుతూ కాకినాడ ప్రశాంతమైన సిటీ అని ఇక్కడ భూమి కి విలువ ఉంటుందని

అలాంటి విలువైన భూములను ఒక వ్యక్తి సొంతం కోసం టూరిజం శాఖ అప్పనంగా ఇచ్చిందని ఆయన అన్నారు తాజ్ హోటల్ పేరుతో వర్మ ప్రజలను మోసం చేస్తున్నారని కాకినాడ పౌరులు ఆవేదన చెందుతున్నారని ఆయన పేర్కొన్నారు.ఇంకా ఈ సమావేశంలో ఆప్ నేత నరాల శివ, బిఎస్పీ నేత సుబ్రహ్మణ్యం, ఏ ఐ వై ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యుగంధర్, ఐఎస్టీయూ సి చేనేత తాళ్లూరు రాజు, సీపీఐ జిల్లా కార్యదర్శి కె బోడకొండ, సహాయ కార్యదర్శి తోకల ప్రసాద్, కొమరగిరి సర్పంచ్ నూకరాజు,తిమ్మాపురం సర్పంచ్ బెజవాడ ,

మాజీ మేయర్ ప్రసన్న సాగర్, విద్యార్థి జాక్ ఛైర్మన్స్ రాంబాబు ఎస్టీయూ రాష్ట్ర మాజీ కార్యదర్శి సుబ్బరాజు, మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి భవాని, పద్మ, పప్పు ఆదినారాయణ పాల్గొన్నారు .



# మత్స్యకారులకు ఎల్లవేళలా అండగా ఉంటా

## :ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి

**కావలి (నెల్లూరు), ఏప్రిల్ 4, ప్రభాతవార్త :** తెలుగుదేశం పార్టీకి మత్స్యకారులకు విడదీయరాని బంధం ఉందని వారికి ఎల్లవేళలా అండగా ఉంటానని ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి తెలిపారు. స్థానిక టిడిపి కార్యాలయంలో శనివారం ఏర్పాటుచేసిన మిడియా సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. మత్స్య కారులకు అన్యాయం జరిగితే సహించబోమని స్పష్టం చేశారు. గత నెల 17న రాత్రికి రాత్రే బోట్లను తరలించారని పాండిచ్చేరి ప్రాంతం నుంచి బోట్లు సంచారం అధిక మవుతోందని తెలిపారు. దీంతో మత్స్య కారులు తీవ్ర ఇబ్బందులు ఎదర్కొం టున్నారని వారి బాధను ప్రభుత్వం గమనిస్తోందని తెలిపారు. వీరి రక్షణ కోసం 23కిలోమీటర్ల పరిధిలని దాటి బోట్ల రాకపోకలను నియంత్రించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఇందులో భాగంగానే మూడు స్పీడ్బోట్లతో గస్తీ నిర్వహిస్తున్నామని తెలిపారు. త్వరలో సిఎం చంద్రబాబునాయుడు నాలుగు బోట్లను అందుబాటులోకి తీసుకురానున్నారని వెల్లడించారు. ఈనెల 15నుంచి వేట విరామ సమయం అయినందున 20వేల రుపాయలు ఆర్థికసాయం అందించనున్నట్లు తెలిపారు. సుమారు 290కోట్లతో జువ్వలదిన్నె షిపింగ్హార్బర్ అభివృద్ధి జరిగిందని ఆధునిక మౌళిక వసతులన్నీ ఏర్పాటు అయిన 1250చేపల బోట్లను సురక్షితంగా నిలుపుకవచ్చును అన్నారు. ప్రతి ఏటా 41వేల టన్నుల చేపలు దిగుబడి చేసే అవకాశం ఉందన్నారు. హార్బర్లో ప్రస్తుతం 11బోట్లు పనిచేస్తుండగా రాబోయే రోజుల్లో మరో 40బోట్లును ప్రభుత్వం అందించనుందని తెలిపారు.గత ప్రభుత్వం మత్స్య కారులపై దుష్ప్రచారం చేస్తోందని అలాంటి ప్రచారాలను నమ్మవద్దని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బోట్లు కొనుకొనేందుకు సబ్సిడీ ఇచ్చేందుకు సిద్దంగా ఉన్నాయని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని కోరారు. బోగోలు మండలం తాడిచెటలపాలెం తీర ప్రాంతం అభివృద్ధికి రూ. 2కోట్లను మంజూరు చేసినట్లు తెలిపారు. అంతర్రాష్ట్ర సభ్యులను పరిష్కరించేందుకు ప్రభుత్వం కృషిచేస్తొందని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధిలో అమరావతి రాజధాని కీలకపాత్ర పోషిస్తుందని తెలిపారు. అమరాతిని సాధించడంలో ప్రదాని మోదీ, సిఎం చంద్రబాబునాయుడు పాత్రకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రూరల్ మండలం టిడిపి అధ్యక్షులు ఆవుల రామక్రిష్ణ, సోమశిల మాజీ ఛైర్మెన్ కల్లగుంట మదుబాబునాయుడు, టిడిపి నాయకులు, దావులూరి దేవకుమార్, మత్స్య కార నాయకులు చెచంగారి శ్రీనివాసులు, వాయిల కనకయ్య, కాటం గిరి పోలయ్య, యల్లంగారి తాతయ్య, చిట్టిబాబు, రాము పాల్గొన్నారు.




# కారు బావిలోపడి తొమ్మిది మంది మృతి

## మృతులంతా ఒకే కుటుంబీకులు

**నాసిక్, ఏప్రిల్ 4:** మహారాష్ట్రలోని నాసిక్లో ఘోరవిషాదం చోటుచేసుకుంది. ఒకే కుటుంబానికి చెందిన తొమ్మిది మంది ప్రయాణిస్తున్న కారు అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న బావిలో పడిపోయింది. ఈ దుర్ఘటనలో కారులో ఉన్న వారంతా మృతి చెందారు. దిండోరి తాలూకాకు చెందిన దర్గోడే కుటుంబం శివాజీనగర్లోని రాజే బాంక్వెట్హాల్లో జరిగిన వడ్జే క్లాసెస్ సమావేశానికి హాజరైంది. శుక్రవారంరాత్రి కార్యక్రమం ముగించుకుని మారుతి ఎక్స్ఎల్ కారులో తిరిగి ఇంటికి బయలుదేరారు. ఈ క్రమంలో డ్రైవర్ వాహనంపై నియంత్రణ కోల్పోవడంతో కారు రోడ్డుపక్కన నీటితో నిండి ఉన్న బావిలోకి దూసుకెళ్లింది. ప్రమాదం గురించి సమాచారం అందుకున్న వెంటనే తహసీల్దార్ ముకేశ్కాంబ్లే, పోలీస్ ఇన్స్పెక్టర్ భగవాన్ మధురే, ఇతర అధికారులు, పోలీసు సిబ్బంది, అగ్నిమాపకదళం, విపత్తు నిర్వహణ బృందాలు ఘటనా స్థలానికి చేరుకు న్నాయి. బావి నీటితో నిండి ఉండటంతో సహాయక చర్యలకు తీవ్ర ఆటంకం ఏర్పడింది. రెండు క్రేన్ల సహాయంతో అర్ధరాత్రి సమయంలో కారును బయటకు తీశారు. ఈ ఆపరేషన్లో 8 మృతదేహాలను వెలికితీశారు. గల్లంతైన ఓ బాలిక కోసం ప్రత్యేకంగా గాలించగా, ఆమె మృత దేహం కూడా లభ్యమైంది. మృతులను సునీల్ దత్తాత్రేయ దర్గోడే (32), రేష్మ సునీల్ దర్గోడే (27), రాఖీ (10), మాధురి అనిల్ దర్గోడే (13), శ్రావణి అనిల్ దర్గోడే (11), ఆశాఅనిల్ దర్గోడే (32), శ్రేయాష్ అనిల్ దర్గోడే (11), సృష్టి అనిల్దర్గోడే (14), సమృద్ధి రాజేష్దర్గోడే (7)గా గుర్తించారు. ఈ ఘటనపై దిండోరి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# నేడు అఖిల భారత పోలీసు ఫుట్బాల్ ఛాంపియన్షిప్ ముగింపు వేడుకలు

**హైదరాబాద్, ఏప్రిల్ 4, ప్రభాతవార్త:** హైదరాబాద్లో 12 రోజులుగా జరుగుతున్న అఖిల భారత 74వ బిఎన్ మల్లిక్ స్మారక పోలీసు ఫుట్బాల్ ఛా ంపియన్షిప్ వేడుకలు ఆదివారం సాయంత్రం నాలుగు గంటలకు జరగనున్నాయి. గచ్చిబౌలిలోని బాలయోగి స్టేడియంలో ఈ వేడుకల కోసం పోలీ సు శాఖ ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. సిఎం రేవంత్ రెడ్డి ఈ ముగింపు వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు. ఫైనల్ మ్యాచ్ కూడా ఇదే సమయంలో మొదలుకానుంది. మ్యాచ్ ముగిసిన తరువాత ఐదున్నర గంటల సమయంలో ముగింపు వేడుకలు నిర్వహించనున్నారు. వే డుకల తరువాత విజేత జట్టుకు సిఎం రేవంత్ రెడ్డి ట్రోఫీని అందజేస్తారు. ఈ వేడుకల్లో డిజిపి శివధర్ రెడ్డితో పాటు పోలీసు అకాడమి డైరక్టర్ అ భిలాష్ బిస్త్, సైబరాబాద్ కమిషనర్ ఎం.రమేష్ సహా ఇతర అధికారులు పాల్గొననున్నారు. ఈ టోర్నమెంట్లో దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాల పోలీ సు విభాగాల జట్లు, పారా మిలటరీ విభాగాల జట్లు పాల్గొని తమ క్రీడా కౌశలాన్ని ప్రదర్శించాయి.

# పాక్ ఉగ్రసంస్థలకు పనిచేస్తున్న నలుగురు టెర్రరిస్టుల అరెస్టు



**లక్నో, ఏప్రిల్ 4:** ఉత్తర ప్రదేశ్లోని లక్నోలో భారీ పేలుళ్లకు కుట్ర పన్నిన నలుగురు ఉగ్రవాదుల ముఠాను ఉత్తర ప్రదేశ్ యాంటీ టెర్రరిజం స్క్వాడ్ అరెస్టు చేసింది. వీరికి పాకిస్థాన్ ఉగ్రవాద ముఠాలతో సంబంధం ఉంది. మీరట్కు చెందిన సాకిబ్ అలియాస్ డెవిల్ ప్రధాన నిందితుడు. సాకిబ్తోపాటు అతడి అనుచరులు లక్నోతోపాటు దేశంలో పలు ఉగ్రవాద, జాతి వ్యతిరేక కార్యకలాపాలకు ప్లాన్ చేశారు. వీరు టెలిగ్రామ్, ఇన్స్టాగ్రామ్ యాప్స్ ద్వారా పాకిస్తాన్ ఉగ్రముఠాలతో సంప్రదింపులు జరిపేవారు. ఈ నలుగురు ఉగ్రవాదుల ముఠా దేశంలో భారీ విధ్వంసానికి ప్లాన్ చేసింది. రైల్వే సిగ్నల్ బాక్స్ల ద్వారా రైళ్లను ఆపి భారీగా దాడులు చేయడం, ప్రముఖ సంస్థలు, సిలిండర్ గ్యాస్ తీసుకెళ్లే ట్రక్కులు, ప్రభుత్వం సంస్థలు, కీలక ప్రదేశాల్ని వీరు లక్ష్యంగా ఎంచుకున్నారు. పాకిస్తాన్కు చెందిన ఉగ్రవాదులు పంపిన గూగుల్ ఫొటోస్, లొకేషన్స్ ఆధారంగా ఇక్కడి కొందరు రాజకీయ నేతలు, ప్రముఖ సంస్థలపై నిఘా పెట్టి, వాటి సమాచారాన్ని సేకరించారు. ఈ సమాచారాన్ని పాకిస్తాన్ చేరవేశారు. ఘజియాబాద్, అలీఘడ్, లక్నోలో రైల్వే స్టేషన్ వంటి పలు ప్రాంతాల్ని సర్వే చేశారు. అలాగే, ఇక్కడ కొన్ని చిన్న చిన్న విధ్వంసాలకు పాల్పడి, వాటిని వీడియో తీసి, ఆ వీడియోల్ని పాకిస్తాన్ పంపించారు. ఇవన్నీ చేసినందుకుగాను, క్యూఆర్ కోడ్ల ద్వారా కొన్ని సంస్థల నుంచి నిధులు అందుకున్నారు.

# బాబూజగ్జీవన్రామ్ జీవితం దేశానికి ఆదర్శం: సిఎం రేవంత్రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఏప్రిల్ 4:** స్వాతంత్ర్య సమరయోధుడు, మాజీ ఉప ప్రధానమంత్రి డా. బాబూ జగ్జీవన్ రామ్ జీవితం దేశానికి ఆదర్శమని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అన్నారు. ఆయన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు.ఆదివారం బాబూజీ 119వ జయంతి సందర్భంగా సీఎం ఆయనను స్మరించుకున్నారు. దళితుల హక్కుల కోసం ఆయన జీవితాంతం పోరాడారని గుర్తుచేశారు. పేదరికంలో పుట్టినా, తన పట్టుదలతో ఉన్నత స్థాయికి ఎదిగారని చెప్పారు. స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొని, తొలి ప్రధాని నెహ్రూ మంత్రివర్గంలో మంత్రిగా సేవలందించారని అన్నారు.అణగారిన వర్గాలు, కార్మికుల సంక్షేమం కోసం ఆయన కృషి చేశారని తెలిపారు. కుల వివక్ష, అంటరానితనానికి వ్యతిరేకంగా పోరాడారని చెప్పారు. బాబూజీ స్ఫూర్తితోనే తెలంగాణలో ప్రజా పాలన కొనసాగిస్తున్నామని సీఎం అన్నారు. సామాజిక న్యాయం, అన్ని వర్గాల మేలుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. దేశానికే ఆదర్శంగా కుల గణన చేపట్టామని, బీసీ రిజర్వేషన్ల పెంపు, ఎస్సీ వర్గీకరణకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. బాబూజీ ఆశయాలే తమకు మార్గదర్శకమని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

# ఐదు రోజుల వ్యవధిలో క్షీణించిన హెచ్డిఎఫ్సి షేర్లు




**ముంబయి, ఏప్రిల్ 4:** మధ్యప్రాచ్యంలో జరుగుతున్న యుద్ధం ప్రభావం భారతీయ స్టాక్ మార్కె ట్లపై ఎక్కువ చూపిస్తున్న సంగతి తెలిసిందే. యుద్ధ ప్రభావంతోపాటు ఆర్థిక అనిశ్చితి, ఆదాయ వ్యయాలు వంటివి కూడా కొన్ని కారణం అవుతున్నాయి. ఇక్కడ దేశంలోనే అతిపెద్దప్రైవేటురంగ బ్యాంకు హెచ్డిఎఫ్సిలో అయితే బ్యాంకు ఆపద్ధర్మచైర్మన్ అతనుచక్రవర్తి రాజీనామా బ్యాంకు షేర్లను కుదిపేసిందనే చెప్పాలి. పార్ట్ టైమ్ ఛైర్మన్ అతాను చక్రవర్తి ఊహించని రీతిలో ఇటీవల మార్చి 18న ఆకస్మిక రాజీనామా చేయడంతో అక్కడి నుంచి హెచ్డీఎఫ్సీ బ్యాంక్ స్టాక్పై తీవ్ర ఒత్తిడి పడింది. వరుసగా పతనం అవుతూనే వచ్చింది. ఈ స్టాక్ 52 వారాల గరిష్ఠ ధర రూ. 1020.50 కాగా కనిష్ఠ ధర రూ. 726.65 గా ఉంది. ఇటీవల యుద్ధం నేపథ్యంలో స్టాక్ ధర మరింత పతనమై ఆల్ టైమ్ కనిష్ఠానికి చేరింది. సంస్థ మార్కెట్ విలువ రూ. 5.75 లక్షల కోట్లుగా ఉంది. గత 5 రోజుల వ్యవధిలో 2 శాతం వరకు షేర్ ధర తగ్గింది. నెల వ్యవధిలో చూస్తే 14 శాతం వరకు తగ్గింది. 6 నెలల వ్యవధిలో ఈ స్టాక్ ధర 23 శాతం తగ్గింది. ఈ ఏడాదిలోనే ఇప్పటివరకు చూస్తే ఏకంగా 25 శాతం తగ్గింది. దీంతో ఇన్వెస్టర్లకు భారీ నష్టాలు వస్తున్నాయి. ఏడాది వ్యవధిలో 18 శాతం వరకు పడిపోయింది.

# ఖానాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్నిక మళ్లీ వాయిదా

## సమాన మద్దతుతో ప్రతిష్టంభన - బిజెపి, బిఆర్ఎస్ ఆందోళన




**ఖానాపూర్, ఏప్రిల్ 4, ప్రభాతవార్త:** ఖానాపూర్ మున్సి పాలిటీలో చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికలు మరోసారి వాయిదా పడ్డాయి. శనివారం ఎన్నికల ప్రక్రియను ప్రారంభించినప్పటికీ, అభ్యర్థులకు సమాన మద్దతు లభించడం వల్ల పరిస్థితి ప్రతిష్టంభనకు దారితీసింది. ఈరోజు నిర్వహించిన ఎన్నికల ప్రక్రియకు బీజేపీకి చెందిన నలుగురు, బీఆర్ఎస్ ముగ్గురు కౌన్సి లర్లు, ఎమ్మెల్యేతో పాటు కాంగ్రెస్కు చెందిన ముగ్గురు కౌన్సి లర్లు, ఒక స్వతంత్ర అభ్యర్థి, అలాగే ఇటీవల కిడ్నాప్కు గురైన బీఆర్ఎస్ కౌన్సి లర్ హాజరయ్యారు. ఈ క్రమంలో బీజేపీ, బీఆర్ఎస్ కూటమిగా ఏర్పడి బీజేపీ అభ్యర్థి అంకం మోనికను చైర్పర్సన్ అభ్యర్థిగా ప్రకటించారు. ఆమెకు మొత్తం ఏడుగురు కౌన్సి లర్లు మద్దతు తెలిపారు. మరోవైపు కాంగ్రెస్ అభ్యర్థి చిన్నం సత్యంకు కూడా ఏడుగురు కౌన్సి లర్ల మద్దతు లభించింది. అయితే చిన్నం సత్యంను చైర్మన్గా ప్రకటించాలని ఎమ్మెల్యే పట్టుబడడంతో ఎన్నికల ప్రక్రియలో గందరగోళం నెలకొంది. దీంతో అధికారులు ఎన్నికలను వాయిదా వేయాల్సి వచ్చింది. ఎన్నిక వాయిదా పడటంతో కాంగ్రెస్ అభ్యర్థులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. అనంతరం బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు మున్సి పల్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. దీంతో స్వల్ప ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకుంది.

# వివాహేతర సంబంధమే ప్రాణాలు తీసింది

## - జంట హత్యల కేసులో - ఐదుగురు నిందితులు అరెస్ట్

**నెల్లూరు క్రైమ్, ఏప్రిల్ 4, ప్రభాతవార్త :** జిల్లాలోని కొడవలూరు మండలంలో సంచలనం సృష్టించిన జంట హత్యల కేసును పోలీసులు వారం రోజుల్లోనే ఛేదించారు. వివాహేతర సంబంధం, పాత కక్షల నేపథ్యంలోనే ఈ దారుణం జరిగినట్లు పోలీసులు నిర్ధారించారు. ఈ కేసులో ఐదుగురు నిందితులను అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి హత్యకు ఉపయోగించిన ఆయుధాలు, వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలను నెల్లూరు రూరల్ డిఎస్పి ఘట్టమనేని శ్రీనివాసరావు శనివారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు.

- ఏం జరిగిందంటే?

గత నెల మార్చి 29వ తేదీ రాత్రి, దగదర్తి మండలం పెద్ద పుత్తేడు గ్రామానికి చెందిన కుందుర్తి వెంకటేష్ (29), బుచ్చిరెడ్డిపాలెం మండలం కాగులపాడుకు చెందిన కొప్పాల బాల అంకయ్య (25) బైకుపై నార్త్ రాజుపాలెం నుంచి డీజిల్ తీసుకుని వస్తుండగా, గండవరం గ్రామ శివార్లలో నిందితులు కాపుకాశారు. పాత కక్షలను మనసులో పెట్టుకున్న నిందితులు, మృతులను అడ్డగించి ఇనుప రాడ్లు, కత్తులతో విచక్షణారహితంగా దాడి చేశారు. తీవ్ర రక్తగాయాలైన వారిద్దరూ అక్కడికక్కడే మృతి చెందగా, ఆధారాలు దొరక్కుండా మృతదేహాలను రోడ్డు పక్కన ఉన్న చెట్ల పొదల్లో పడేసి నిందితులు పరారయ్యారు.

- చాలెంజ్గా తీసుకున్న పోలీస్ శాఖ

ఈ కేసును చాలెంజ్గా తీసుకున్న పోలీసులు ఘటన జరిగిన వెంటనే జిల్లా ఎస్పీ అజితా వేజెండ్ల ఆదేశాల మేరకు ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగాయి. అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) సి.హెచ్.సౌజన్య, రూరల్ డిఎస్పీ జి. శ్రీనివాసరావు పర్యవేక్షణలో సి.ఐలు, ఎస్.ఐలు, క్లూస్ టీమ్, ఐటీ కోర్ టీమ్ సభ్యులు నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. శనివారం ముత్తుకూరు మండలం, మల్లూరు గ్రామంలోని ఒక బంధువు ఇంట్లో తలదాచుకున్న నిందితులను పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. అరెస్టయిన వారిలో పెద పుత్తేడు గ్రామానికి చెందిన బత్తల ప్రశాంత్ కుమార్, బత్తల కళ్యాణ్ కుమార్, బత్తల విజయ్ భాస్కర్, బత్తల సాయి ప్రకాష్, బత్తల శీనయ్య ఉన్నారు. వారి వద్ద నుండి నేరానికి ఉపయోగించిన రెండు స్టీల్ పైపు రాడ్లు, ఒక మొద్దు కత్తి, రెండు హీరో గ్లామర్ మోటార్ సైకిళ్లు స్వాధీనం చేసుకున్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించినా, రౌడీయిజం చేసినా ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదు. చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటాం అని ఈ సందర్భంగా ఎస్పీ హెచ్చరించారు. వారం రోజుల్లో కేసు ఛేదించడంలో ప్రతిభ కనపరిచిన

పోలీసులకు ఆమె అభినందనలు తెలిపారు. కేసును అత్యంత వేగంగా, చాకచక్యంగా ఛేదించిన కొడవలూరు సి.ఐ. దుర్గా ప్రసాద్, కొడవలూరు ఎస్.ఐ. కోటిరెడ్డి, విడవలూరు ఎస్.ఐ. నరేష్, వారి సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించి, రివార్డులను అందజేశారు.

# ఆర్టెమిస్ నుంచి భూమి ఫొటోలు పంపిన వ్యోమగాములు



**న్యూయార్క్, ఏప్రిల్ 4:** అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ (నాసా) ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆర్టెమిస్2 యాత్ర విజయవంతంగా సాగుతోంది. సుమారు 50 యేళ్ల తర్వాత తొలిసారిగా చంద్రుడి వైపు వెళుతున్న వ్యోమగాములు, అంతరిక్షం నుంచి మన భూమికి సం బంధించిన అద్భు తమైన చిత్రాలను పంపిం చారు. ఓరియన్ క్యాప్సూ ల్ కిటికీ నుంచి కమాం డర్ రీడ్ వైస్మన్ ఈ ఫొటోలను తీశారు. నాసా విడుదల చేసిన చిత్రాలలో ఓరియన్ క్యాప్సూల్ కిటికీ నుంచి వంపు తిరిగిన భూమి అంచు స్పష్టంగా కనిపిం చింది.

మరో చిత్రంలో తెల్లటి మేఘా లతో కప్పబడిన సముద్రాలు, ఆకుపచ్చని అరోరాతో మెరుస్తున్న పూర్తి భూగోళం అద్భుతంగా దర్శన మిచ్చింది. భూమిపై రాత్రి, పగలును వేరుచేసే టెర్మినేటర్ లైన్ను కూడా ఒక ఫొటోలో బంధించారు. ఈ భూమ్మీద మేల్కొని ఉన్నా, నిద్రిస్తున్నా మనమందరం కలిసి ఈ గ్రహంపైనే ఉన్నామని నాసా ఒక ఫొటోకు క్యాప్షన్ ఇచ్చింది. శుక్రవారం నాటికి వ్యోమ గాములు భూమి నుంచి 1.80 లక్షల కిలోమీటర్ల దూరం ప్రయాణించారు. చంద్రుడి సమీప కక్ష్యకు చేరేందుకు మరో 2.40 లక్షల కిలోమీటర్లు ప్రయాణించాల్సి ఉంది. సోమవారం నాటికి వీరు తమ గమ్యస్థానానికి చేరుకుంటారని అంచనా. ఈ యాత్రలో ముగ్గురు అమెరికన్లు, ఒక కెనడియన్ ఉన్నారు. వీరు చంద్రుడిపై దిగకుండా, దాని చుట్టూ ప్రదక్షిణ చేసి తిరిగి భూమికి రానున్నారు.

1972లో అపోలో17 తర్వాత చంద్రుడి వద్దకు మనుషులను తీసుకెళు తున్న తొలి యాత్ర ఇదే కావడం విశేషం. మిషన్ సజావుగా సాగుతోందని నాసా ఎక్స్ ప్లోరేషన్ సిస్టమ్స్ లీడర్ లకీషా హాకిన్స్ తెలిపారు.

# ముగిసిన రోహిత్, రితేష్, నమిత్శర్మ విచారణ

## చంచల్గూడ జైలుకు తరలింపు

## మొయినాబాద్ ఫాంహౌస్ డ్రగ్స్ పార్టీ కేసు

**హైదరాబాద్, ఏప్రిల్ 4, ప్రభాతవార్త:** తెలుగు రాష్ట్రాల్లో సంచలనం రేపిన మొయినాబాద్ ఫాం హౌస్ డ్రగ్స్ పార్టీ కేసులో తాండూరు మాజీ ఎంఎ ల్ఏ పైలట్ రోహిత్ రెడ్డి ఆయన సోదరుడు రితేష్ రెడ్డి, ఢిల్లీకి చెందిన రియల్టర్ నమిత్ శర్మల రెండవ దఫా మూడు రోజుల పోలీసు కస్టడీ విచార ణ శనివారం ఉదయం 11 గంటలకు ముగియడంతో ముగ్గురిని చేవెళ్ల పోలీసులు చంచల్గూడ జైలుకు తరలించారు. రాజేంద్రనగర్ కోర్టు అనుమతి తో చేవెళ్ల పోలీసులు ఈ ముగ్గురిని బుధవారం ఉదయం చంచల్గూడ జైలు నుంచి కస్టడీలోకి తీసుకోవడం తెలిసిందే. అంతకు ముందు వీరిని గత నెల 24వ తేదీన మూడు రోజుల పాటు కస్టడీలోకి తీసుకుని విచారించడం విదితమే. బుధవారం నుంచి వీరిని శంషాబాద్ మండలంలోని పెద్దషాపూర్లో గల శంషాబాద్ రూరల్ పోలీసు స్టేషన్లో విచారించిన పోలీసులు ఫాంహౌస్లో జరిగిన డ్రగ్స్ పార్టీకి సంబంధించి కీలక సమాచారం రాబట్టారు. రెండో దఫా విచారణలో ఫాంహౌస్ డ్రగ్స్ పార్టీలో రాజకీయ నాయకులతోపాటు రియల్టర్ల పాత్రపై పోలీసులు ఆధారాలు సేకరించిన ట్లు తెలిసింది. కాగా రెండో దఫాగా జరిగిన విచారణ తాలూకు అంశాలను పోలీసులు రెండు రోజుల్లో కోర్టుకు సమ ర్పించే వీలుంది. చంచల్గూడ జైలుకు తరలించే ముందు ఉదయం పది గంటల సమయంలో ముగ్గురికి పోలీసులు ఉస్మానియా ఆసుపత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించారు.

# క్యాతన్పల్లి మున్సిపాలిటీపై గులాబీ, ఎర్రజెండాల రెపరెప

## ప్రజాతీర్పును శిరసా వహించిన బిఆర్ఎస్, సిపిఐ కౌన్సిలర్లు



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్

**మంచిర్యాల/క్యాతన్పల్లి, ఏప్రిల్ 4, ప్రభాతవార్త:** రాష్ట్రవ్యాప్తంగా ఉత్కంఠ రేపిన క్యాతన్ పల్లి మున్సి పల్ పీఠం ఎట్టకేలకు బీఆర్ఎస్ సీ.పి.ల కూటమి కైవసం చేసుకోవడంతో సుమారు 50 రోజుల నిరీక్షణకు తెర పడింది. శనివారం అడిషనల్ కలెక్టర్ ఎన్నికల ప్రత్యేక అధికారిగా, ఎలక్షన్ పరిశీలకులుగా బెల్లంపల్లి సబ్ కలెక్టర్ వ్యవహరించగా క్యాతన్పల్లి మున్సి పాలిటీ పై గులాబీ, ఎర్రజెండా ఎగిరింది. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు,మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ క్యాతన్ పల్లి లోని ఆయన నివాసం లో విలేఖరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ నాయకుల దౌర్జన్యం, పోలీసులు అతుత్సా హం ప్రదర్శించినప్పటికీ న్యా యమే గెలిచిందని అన్నారు. కాంగ్రెస్ నాయ కుల దురహంకారానికి క్యాతన్పల్లి ప్రజా నీకం ఇచ్చిన ప్రజాతీర్పు చెంపపెట్టని అన్నారు.ప్రజలు నిర్ణయించి గెలిపించిన 14 మంది కౌన్సి లర్లు 51 రోజుల పాటు వారి కుటుంబాలకు దూరంగా ఉండటం జరిగిందని తెలిపారు.క్యాతన్ పల్లి మున్సి పల్ కార్యాలయం చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక నేపథ్యంలో ఫిబ్రవరి 17న జరిగిన సిసి ఫుటేజ్ బయట పెట్టాలని సుమన్ డిమాండ్ చేశారు.పోలీస్,రెవెన్యూ యంత్రాంగం కాంగ్రెస్ నాయకులకు కొమ్ముకాస్తూ తమపై తమ కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించి 16 రోజుల పాటు ఆదిలాబాద్ జైల్లో పెట్టడం జరిగిందని చెప్పుకొ చ్చారు. తమ కౌన్సి లర్లను మా నసికంగా భయపట్టిం చేందుకు వారి కుటుంబసభ్యుల మీద అక్రమ కేసులు పెడతామని, అలాగే 11 వార్డులో గెలిచిన బొ మ్మ భూమయ్యగౌడ్ను ఎదుర్కొనే ధైర్యం లేక స్థానిక కాంగ్రెస్ నాయకులు సింగరేణి ఎస్ అండ్ పీసీ అధికారులతో కలిసి భూమయ్య కుటుంబ సభ్యులను భయభ్రాం తులకు గురిచేసిన సందర్భాలు కూడా

ఉన్నాయని అన్నారు. సింగరేణి అధికారులు కాంగ్రెస్ నాయకులతో కలిసి ఇలాంటి దౌర్జనానికి పాల్పడ వద్దని ప్రొడక్షన్ పై దృష్టి సారించాలని హితవు పలికారు.

కో అప్షన్ సీట్ల పంపిణిలో తాము పొత్తు ధర్మానికి కట్టుబడి ఉంటామని హామీ ఇచ్చారు. అలాగే మున్సి పాలిటీకి సంబంధించి బిఆర్ఎస్ సిపిఐ పార్టీల నాయకులతో నలుగురు సభ్యులతో కూడిన సమ న్వయ కమిటీ ఏర్పాటు చేస్తామని అన్నారు.

# బి.ఆర్.నాయుడును వెంటనే పదవి నుంచి తొలగించాలి

## మాజీమంత్రి కారుమూరి



**తణుకు ఏప్రిల్ 4 (ప్రభాతవార్త)**
తిరుమల తిరుపతి దేవస్థానం ప్రతిష్టకు కళంకంగా మారిన టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడును ఆ పదవి నుంచి తక్షణమే తొలగించాలని మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. తణుకు శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం పార్టీ పిలుపుమేరకు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కారుమూరి మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా ప్రతిష్ట కలిగిన కళియుగ దైవం వేంకటేశ్వరుడి సన్నిధిని ఎంతో పవిత్రంగా చూసుకోవాల్సి ఉండగా, సభ్యసమాజం తలదించుకునేలా ప్రవర్తించిన చైర్మన్ బీఆర్ నాయుడును ఆ పదవిలో కొనసాగించడం దౌర్భాగ్యమన్నారు. ఇప్పటివరకు శ్రీవారి ప్రతిష్టకు, భక్తుల మనోభావాలు దెబ్బతినే విధంగా లడ్డు ప్రసాదంలో పంది కొవ్వు, జంతువుల కొవ్వు అని మరల బాత్రూమ్‌లు కడిగే యాసిడ్స్ కలిశాయంటూ నానాయాగి చేసిన స్వామి ప్రతిష్టకు భంగం కలిగేలా చంద్రబాబు సర్కారు చేసిందని విమర్శించారు. బీఆర్ నాయుడు రాసలీలల వ్యవహారం బయటకు వచ్చినప్పటికీ ఈ ప్రభుత్వం నిమ్మకునీరెత్తినట్లు ఉంటూ శ్రీవారి పవిత్రతకు భంగం కలిగేలా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. గతంలో చేసిన చైర్మన్‌లు అందరూ కూడా ఎంతో పవిత్రంగా ఉంటూ స్వామివాకి కైంకర్యాల్లో పాల్గొన్నారని, మీ రెండేళ్ల కాలంలో మహిళలని, దళితులని, వృద్ధులని ఎవరికీ గౌరవం లేకుండానే ఉన్నారని బీఆర్ నాయుడును కూడా అలానే కొనసాగించడం సిగ్గుచేటన్నారు. ఆ స్వామి ఆగ్రహానికి గురవుతే ఏం జరుగుతుందో భవిష్యత్తులో చూస్తారని అన్నారు. చంద్రబాబు చెబితే నేను రాజీనామా చేస్తానని ఆయన చెబుతున్నప్పటికీ కొనసాగించడంలో ఉద్దేశ్యమేంటో అర్థం కావడంలేదని అన్నారు.

**శ్రీవారి పవిత్రతను కాపాడాలి...**

కళియుగ ప్రత్యక్ష దైవం శ్రీవేంకటేశ్వరస్వామి పవిత్రతను కాపాడే విధంగా టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడును పదవి నుంచి తప్పించాలని స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబరు, తణుకు నియోజకవర్గ పరిశీలకులు కొట్టు నాగు డిమాండ్ చేశారు. తణుకు శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో మాజీ మంత్రి కారుమూరి ఆధ్వర్యంలో నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతిష్ట కలిగిన శ్రీవారి ఆలయంలో బీఆర్ నాయుడు వంటి వ్యక్తి చైర్మన్‌గా ఉండేందుకు అర్హుడు కాదని అన్నారు. ఇటీవల కాలంలో ఆయన అసభ్యకర ప్రైవేటు వ్యవహారాలు బహిర్గతం అయినప్పటికీ టీటీడీ చైర్మన్ పదవి నుంచి తొలగించకపోవడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు మారిశెట్టి శేషగిరి, వైఎస్సార్‌సీపీ పంచాయితీరాజ్ వింగ్ రాష్ట్ర కార్యదర్శి వడ్లూరి సీతారాం, లీగల్‌సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి వెలగల సాయిబాబారెడ్డి, నాయకులు జల్లూరి జగదీష్, చోడే గోపికృష్ణ, మెహర్ అన్సారీ, నూకల కనకదుర్గ, సప్పా బలరామకృష్ణ, గెల్లా జగన్, పొట్ల సురేష్, నల్లూరి సోమేశ్వర చంద్రశేఖర్, బిరుదుకోట చింతన్న, కొమ్మోజు రామకృష్ణ, గెద్దా శ్రీకాంత్, యారబాటి రామకృష్ణ, షేక్ జిలాని, పైడి సాయిసూర్య పాల్గొన్నారు.

# పిజిఆర్ఎస్ సమస్యల పరిష్కారం నిర్లక్ష్యం వద్దు...

**--జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి**



**భీమవరం ఏప్రిల్ 4 ప్రభాతవార్త** గురువారం జిల్లా కలెక్టరేట్ వశిష్ట సమావేశ మందిరంలో గత నవంబర్ 1 నుండి మార్చి 31 వరకు పి జి ఆర్ ఎస్ అర్జీల పరిష్కార ప్రగతిని శాఖల వారీగా జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ గత నవంబరు ఒకటి నుండి మార్చి 31 వరకు జిల్లాలోని వివిధ ప్రాంతాల ప్రజల నుండి స్వీకరించిన పి జి ఆర్ ఎస్ ఫిర్యాదులకు సంబంధించి 13,738 ఫిర్యాదులకు గాను 13,006 ఫిర్యాదులు పరిష్కరించగా వాటిలో సమగ్రంగా పరిష్కరించని 732 ఫిర్యాదులను థ్రీ ఆడిట్ టీం ద్వారా గుర్తించడం జరిగిందని అన్నారు. వాటిని ఇంకా బెటర్ గా పరిష్కరించే దిశగా సంబంధిత జిల్లా శాఖల అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి పరిష్కరించాలని ఆదేశించారు. జిల్లా అధికారులు ప్రతిరోజు ఒక గంట పి జి ఆర్ ఎస్ ఫిర్యాదుల పరిష్కారానికి కేటాయించాలని అన్నారు. తద్వారా నిర్దేశిత గడువులో ప్రజలకు సంతృప్తికరమైన పరిష్కారం అందించవచ్చునని తెలిపారు. ఫిర్యాదుదారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను పూర్తిగా అర్థం చేసుకొని వారు సంతృప్తి చెందే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు ప్రజలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిన నేపథ్యంలో అధికారులు కూడా అదే స్థాయిలో శ్రద్ధతో పనిచేయాలని పేర్కొన్నారు. జిల్లాలో పిజిఆర్ఎస్ ద్వారా అందుతున్న ఫిర్యాదులు పరిష్కారంలో రాష్ట్రస్థాయిలో మొదటి స్థానంలో నిలవాలని లక్ష్యంతో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి జిల్లా ప్రజలకు మెరుగైన సేవలను అందించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఈ రాహుల్ కుమార్ రెడ్డి అన్నారు.. ఈ సమావేశంలో జిల్లా స్వర్ణ గ్రామ వార్డు అధికారి వై దోసిరెడ్డి, నరసాపురం ఆర్డీవో దాసిరాజు, జిల్లా పంచాయతీ శాఖ అధికారి ఎం రామనాథరెడ్డి, జిల్లా వైద్య శాఖ అధికారి జి గీతా బాయి, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పశ్చిమగోదావరి,ఏలూరు వార్త

## అప్పడా రిజిస్ట్రేషన్లను
# నూరు శాతం త్వరితగతిన పూర్తి చేయాలి
**జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి**



**భీమవరం, ఏప్రిల్ 4, ప్రభాతవార్త** జిల్లాలో అప్పడా రిజిస్ట్రేషన్లను నూరు శాతం త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సంబంధిత అధికారులకు ఆదేశించారు.పనిలో అలసత్వం వహించే సిబ్బందిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లా కలెక్టరేట్ పీ.జి.ఆర్.ఎస్ సమావేశ మందిరంలో శనివారం మత్స్య, డ్వామా, పంచాయతీరాజ్ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె పాల్గొన్నారు. మండలాల వారీగా అప్పడా రిజిస్ట్రేషన్ల ప్రగతిని సమీక్షిస్తూ భీమవరం, కాళ్ళ, మొగల్తూరు, నరసాపురం, ఆకువీడు మండలాల్లో ప్రగతి తక్కువగా ఉండటంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. విధుల్లో నిర్లక్ష్యం వహించే వీఏఎస్‌లపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇప్పటివరకు 76,540 ఎకరాల విస్తీర్ణంలో రిజిస్ట్రేషన్లు పూర్తి కాగా, మిగిలిన 29,018 రిజిస్ట్రేషన్లను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని సూచించారు. సాకులు చెప్పే అధికారులను ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. మడ అడవులు ఉన్న దర్భరేపు, బియ్యపు తిప్ప, వేములదీవి ప్రాంతాల్లో ఆక్వా చెరువుల తవ్వకాలకు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతులు ఇవ్వవద్దని ఆదేశించారు. ఆక్వా సాగులో నిషేధిత మందుల వినియోగం నివారించాలని, ఏవైనా సమస్యలు ఎదురైతే సంబంధిత అధికారులను సంప్రదించాలని సూచించారు. జూన్ నుండి యుఎస్ఎఫ్డిఏ నిబంధనలను కచ్చితంగా అమలు చేస్తామని తెలిపారు. నరసాపురం, మొగల్తూరు ప్రాంతాల మత్స్యకారులకు అందజేసిన 100 పడవలను వారు స్వయంగా వినియోగిస్తున్నారా అనే అంశాన్ని పరిశీలించాలని, ఇతరులకు ఇవ్వకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎంపీడీవోలు వసతి గృహాలను ప్రతి 15 రోజులకు ఒకసారి తనిఖీ చేసి, విద్యార్థులకు అందుతున్న మౌలిక సదుపాయాలు, త్రాగునీటి వసతిని పరిశీలించాలని సూచించారు. బలహీన వర్గాల గృహ నిర్మాణాలను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. గ్రామపంచాయతీల వారీగా లక్ష్యాలకు అనుగుణంగా పని దినాలు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీగా ఉన్నచో సీనియర్ మేట్స్‌ను గౌరవ వేతనంపై నియమించుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా మత్స్యశాఖ అధికారి డి. శ్రీనివాస్, జిల్లా స్వర్ణ గ్రామ,వార్డు అధికారి వై.దోసిరెడ్డి, డీపీఓ ఎం. రామ్నాథ్ రెడ్డి, జిల్లా గృహనిర్మాణ శాఖ అధికారి జి.పిచ్చయ్య, ఎంపీడీవోలు, ఎఫ్‌డీఓలు, ఎఫ్ఏఎస్‌లు, డ్వామా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ స్థాయిలో సమస్యల
# పరిష్కారానికి కృషిచెయ్యాలి
**మంత్రి పార్థసారథి**



**ముసునూరు, ఏప్రిల్ 04 ప్రభాతవార్త:** వైసీపీ నాయకులు చేస్తున్న దుష్ప్రచారాన్ని ప్రతి కార్యకర్త గ్రామస్థాయిలోనే తిప్పికొట్టాలి కూటమి పార్టీలు ఆత్మీయ సమావేశంలో రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. ముసునూరు మండలం ముసునూరు గ్రామంలో శనివారం కూటమి ఆత్మీయ సమావేశంలో మంత్రి కొలుసు పార్థసారథి కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతూ గ్రామాలు వారీగా ఉన్న సమస్యలు, ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, పార్టీ బలోపేతానికి సంబంధించిన అంశాలుపై కార్యకర్తలతో ఆత్మీయంగా చర్చించారు.ప్రతి ఒక్కరి అభిప్రాయాలను, సూచనలను ఓపికగా విని గ్రామ స్థాయిలో సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషిచేయాలని సూచించారు. అలాగే వైసీపీ నాయకులు చేస్తున్న దుష్ప్రచారాన్ని ప్రతి కార్యకర్త గ్రామ స్థాయిలోనే తిప్పికొట్టాలని, ప్రజలకు వాస్తవాలు తెలియజేస్తూ కూటమి ప్రభుత్వ పనితీరును ఇంటింటికీ తీసుకు వెళ్లాలని పిలుపునిచ్చారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు ప్రతి కుటుంబానికి చేరేలా సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ఈ సమావేశంలో టిడిపి మండల పార్టీ అధ్యక్షులు గద్దె రఘుబాబు, 16 గ్రామ పంచాయతీల గ్రామ పార్టీ అధ్యక్షులు, బూత్ ఇన్చార్జ్‌లు , మాజీ సర్పంచులు, ప్రజాప్రతినిధులు, కూటమి పార్టీ నాయకులు, జనసేన నాయకులు నాగబాబు కార్యకర్తలు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

## సాగునీటిలో ఇబ్బందులు
# రానీయకుండా చర్యలు
**తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ**



**తణుకు, ఏప్రిల్ 4 ( ప్రభాత వార్త)**
ఆకస్మిక వరదలు, వర్షాలు సమయంలో తణుకు నియోజకవర్గంలో రైతులకు ఇబ్బందులు రానీయకుండా పటిష్టమైన చర్యలు చేపట్టినట్లు తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ పేర్కొన్నారు. తణుకు మండలం ముద్దాపురం, కోనాల గ్రామాల్లో వరి పంటలు ముంపునకు గురి కాకుండా స్లూయిజ్‌ల నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. రూ. 1.96 కోట్లు నిధులతో ఇప్పటికే ప్రభుత్వం నుంచి పరిపాలన నిధులు రావడంతోపాటు టెండర్ల ప్రక్రియ సైతం పూర్తి అయ్యిందన్నారు. ప్రస్తుత వేసవిలో పనులు ప్రారంభించేలా ప్రణాళికలు చేసినట్లు చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులకు ఎలాంటి ఇబ్బందులు రానీయకుండా చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో రైతులను పూర్తిగా నిర్లక్ష్యం చేయడంతోపాటు సాగునీరు సకాలంలో అందించలేక పూర్తి వైఫల్యం చెందారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుల పక్షాన నిలబడుతూ వారికి ఇబ్బందులు రాకుండా చర్యలు చేపట్టిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేష్, ప్రధాన మంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలో రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం సమపాళ్లలో అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే రాధాకృష్ణ వివరించారు.

# మంచి పాలనకు మద్దతు పలకండి:
## ఎమ్మెల్యే బొలిశెట్టి.





**తాడేపల్లిగూడెం రూరల్ , పెంటపాడు 4 ఏప్రిల్ (ప్రభాత వార్త)**
కూటమి ప్రభుత్వం నిరంతరం ప్రజా సమస్యల పరిష్కారానికి, గ్రామాల అభివృద్ధికి,ప్రజా సంక్షేమానికి అంకితభావంతో పనిచేస్తుందని, మంచి పరిపాలనకు ప్రజలందరూ మద్దతుగా నిలబడాలని శాసనసభ్యులు, రాష్ట్ర ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. పెంటపాడు మండలం ముదునూరు, ఆకుతీగ పాడు గ్రామాలలో శనివారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక, పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ,రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ కార్యక్రమాలలో ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసిపి అరాచక పాలన నుంచి సుపరిపాలన దిశగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. రైతులకు పండించిన ధాన్యం ఎక్కడ అమ్మాలో తెలియని పరిస్థితి నుంచి 24 గంటల్లో వారి పంట సొమ్ము వారి ఖాతాలో పడే విధంగా ఏర్పాటు చేశామన్నారు. పట్టాదారు పుస్తకాలపై జగన్ ఫోటో వేసి రైతులను మానసిక క్షోభకు గురి చేశారని అన్నారు. అధికారం చేపట్టిన వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు,ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లు దిద్దుబాటు చర్యలు చేపట్టారని,రైతులకు ఉపశమనం కలిగించారని అన్నారు.ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పినప్పటికీ జగన్ ప్రవర్తన మారలేదని విమర్శించారు.దేశమంతా అమరావతిని రాజధానిగా ఆమోదించిందని అన్నారు. జగన్ మాత్రం పిచ్చిపిచ్చి పేర్లు చెబుతూ తన వికృత మనస్తత్వం చాటుకున్నారన్నారు. ముదునూరు,ఆకు తీగ పాడు గ్రామాలలో రోడ్లు,డ్రైనేజీలు పూర్తిస్థాయిలో నిర్మిస్తామని, ఇప్పటికే రోడ్ల నిర్మాణం పూర్తయింది అన్నారు. ఆకు తీగ పాడు గ్రామంలో రోడ్ల నిర్మాణానికి 3.20కోట్లు, డ్రైనేజీలకు 5 లక్షలు జలజీవన్ మిషన్ 93.60 లక్షలు,సీఎంఆర్ఎఫ్ 13 లక్షలు,ఉపాధి హామీ 38 లక్షలు తదితర అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టామన్నారు. బలుసులమ్మ జాతరకు తన సొంత నిధులు ఐదున్నర లక్షలు, 50 గ్రాముల బంగారం, అన్నదాన కార్యక్రమాలకు5లక్షలు తదితర కార్యక్రమాలకు సుమారు 20 లక్షలు పైగా విరాళంగా ఇచ్చామన్నారు. ఎమ్మెల్యేగా జాతరకు సహకరించమని ప్రజలను కోరడమే తప్ప, జాతర ఆర్థిక వ్యవహారాలు ఎమ్మెల్యే కి సంబంధం ఏమిటని ప్రశ్నించారు. జాతర నిర్వాహకులు ఆ విషయాలు చూసుకుంటారని అన్నారు. గత వైసిపి హయాంలో ఉద్యోగాలు అమ్ముకుని, ఎవరనీ వదలకుండా సామాన్యులను,సొంత మనుషులదగ్గర కూడా లంచాలు తీసుకొని, అవినీతిలో కూరుకు పోయిన వాళ్ళు నిజాయితీగా పనిచేసే తన గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. నియోజకవర్గ సమన్వయకర్త ఈతకోట తాతాజీ మాట్లాడుతూ ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ గత ఏడాదిన్నర కాలంలో సుమారు 700 కోట్లరూపాయల విలువైన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చేశారని తెలియజేశారు. శ్రీ బలుసులమ్మ వారి జాతర విషయంలో వైసీపీ నేతలు తప్పుడు వ్యాఖ్యానాలు చేయడం సరికాదని అన్నారు. సుమారు రూ.2 కోట్లు వ్యయంతో, ప్రజల విరాళాలతో ఎంతో ఘనంగా జాతర నిర్వహించారని అన్నారు. విరాళాల విషయం లో అత్యంత పారదర్శకంగా వ్యవహారించారని అన్నారు. పెంటపాడు మండల ప్రజా పరిషత్తు అధ్యక్షురాలు కట్టు బోయిన వెంకటలక్ష్మి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతుసమస్యలను పరిష్కరించి ఎంతో మేలు చేసిందని అన్నారు. బలుసులమ్మ జాతర విషయంలో వైసీపీ నేతల తీరును ఆమె ఖండించారు . ముద్దునూరు గ్రామానికి చెందిన సల్ల సత్యనారాయణ ప్రమాద చర్తు మరణించారు వారి కుటుంబానికి చీ=+హా, రెండు లక్షల రూపాయలు వారి కుటుంబ సభ్యులు మరియు సతీమణి చల్ల నాగమణికి చెక్కు నీ అందజేశారు కార్యక్రమాలలో ఎమ్మార్వో సునీల్ కుమార్, స్పెషల్ ఆఫీసర్ జీవీకే మల్లికార్జున్, ఎండిఓ ప్రసాద్, డిప్యూటీఎమ్మార్వో సీతారత్నం, మండల సర్వే,పి దీప్తి లాస్య,భారతీయ జనతా పార్టీ కన్వీనర్ ఈతకోట తాతాజీ,ఎంపీపీ కట్టు బోయిన వెంకటలక్ష్మి, చాపల రమేష్, బారాడా శ్రీనివాసరావు, కిలపర్తి వెంకట్రావు, మద్దాల మణికుమార్, దత్తు ప్రసాదు,దాసరి అప్పన్న, బుద్ధన బాబులు, భవన దాని లక్ష్మి, అడ్డగర్ల సూరి, కామిశెట్టి శ్రీనివాస్, బుద్ధన ధనరాజు, ముఖమట్ల సూర్యచంద్రరావు, ఆకుల నాని, పసల కొండ, వల్లూరి గురు రామారావు, పడాల ఉమాశంకర్, బేతినగిరి, గరిగిపాటి శంకర్, పసుమర్తి రామ లక్ష్మణ్, పాటూరి రాంప్రసాద్ చౌదరి, కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

# ఏప్రిల్ 6 నుండి 'నీటి భద్రత సాగు నీటి సంఘాల బాధ్యత"

**100 రోజుల కార్యక్రమం ప్రారంభం -- జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి**



**భీమవరం ఏప్రిల్ 4 ప్రభాతవార్త** రాష్ట్రవ్యాప్తంగా "నీటి భద్రత -- సాగు నీటి సంఘాల బాధ్యత" పేరుతో 100 రోజుల ప్రత్యేక కార్యక్రమాన్ని ఏప్రిల్ 6, 2026 నుండి ప్రారంభించనున్నట్లు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి గారు అనంతపురం జిల్లాలో సోమవారం ఘనంగా ప్రారంభించనున్నారు. నీటి వనరుల సంరక్షణ, సమర్థవంతమైన వినియోగం,, సాగు నీటి నిర్వహణలో రైతుల భాగస్వామ్యాన్ని పెంపొందించడం ఈ కార్యక్రమం యొక్క ప్రధాన లక్ష్యమని ఆమె తెలిపారు. సాగు నీటి సంఘాల పాత్రను బలోపేతం చేయడం, నీటి వినియోగంపై అవగాహన పెంచడం, సమగ్ర నీటి నిర్వహణను సాధించడం కోసం ప్రభుత్వం ఈ 100 రోజుల కార్యక్రమాన్ని అమలు చేస్తోందన్నారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి ముందస్తు చర్యల్లో భాగంగా, రాష్ట్ర ముఖ్యమంత్రి ఏప్రిల్ 5, 2026న మధ్యాహ్నం 2.30 నుండి 3.00 గంటల మధ్య టెలికాన్ఫరెన్స్ నిర్వహించనున్నారు. ఈ టెలికాన్ఫరెన్స్‌లో నీటిపారుదల, ఉద్యానవన, పురపాలక, అటవీ శాఖల అధికారులు, అలాగే నీటి వినియోగదారుల సంఘాల ప్రతినిధులు పాల్గొననున్నట్లు తెలిపారు.జిల్లాలోని సంబంధిత శాఖల అధికారులు, భాగస్వాములు అందరూ ఈ టెలికాన్ఫరెన్స్‌లో తప్పనిసరిగా పాల్గొని కార్యక్రమంపై పూర్తి అవగాహన పొందాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ముఖ్యంగా నీటి వినియోగదారుల సంఘాలకు స్పష్టమైన మార్గదర్శకాలు రూపొందించి, వాటిని కచ్చితంగా అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. అదేవిధంగా, కార్యక్రమం అమలులో భాగంగా గ్రామ స్థాయిలో అవగాహన కార్యక్రమాలు చేపట్టడం, రైతులకు శిక్షణ ఇవ్వడం, నీటి వినియోగంపై పర్యవేక్షణను బలోపేతం చేయడం, అందుబాటులో ఉన్న నీటి వనరులను సమర్థంగా వినియోగించే విధంగా కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమం ద్వారా సాగు నీటి పంపిణీలో పారదర్శకత, సమానత్వం తీసుకురావడం, నీటి వృథాను తగ్గించడం, వ్యవసాయ ఉత్పాదకతను పెంచడం సాధ్యమవుతుందని జిల్లా కలెక్టర్ తెలిపారు.

# పెన్షనర్ల బకాయిలు చెల్లించేలా సంఘాల కృషి చేయాలి

**అత్తిలి,ఏప్రిల్ 4 (ప్రభాతవార్త )**రాష్ట్ర ప్రభుత్వం 2024 అనంతరం పదవి విరమణ చేసిన వారికి పెండింగ్ బకాయిలు 7,059 కోట్లు చెల్లిస్తామని ప్రకటన విడుదల చేశారని అయితే ఏప్రిల్ 2020 నుంచి డిసెంబర్ 2021 మధ్య పదవి విరమణ చేసిన వారి సంపాదిత సెలవు తేడా పెండింగ్ ఇంకను జమ కాని డిఆర్ ఎరియర్స్ ప్రస్తావన లేదని , వీటిని చెల్లించాలని అని పెన్షనర్లు కోరుతున్నారు. ప్రావిడెంట్ ఫండ్, జిఏఎస్, ఏపీజీఎల్ఏ క్రింద ఇంకా ఐదువేల కోట్లు చెల్లించాల్సి ఉందని తెలిపారు.దీనిలో సుమారుగా 3,411 కోట్లు పెండింగ్ గ్రాడ్యుటి కేటాయించినట్టుగా పేర్కొన్నారని , మిగిలిన మొత్తం సుమారుగా 15 వందల కోట్లు మిగిలిన వాటికి చెల్లిస్తామని ప్రకటన లో తెలిపారన్నారు. 2018 జులై 1 నుండి చెల్లించాల్సిన డి ఆర్ ఎరియర్స్ 90 శాతం చెల్లించారని , ఇంకను బిల్లు సబ్మిట్ చేసి జమలు జరగవలసిన వారు ఉన్నారని తెలిపారు. కొంతమంది బిల్లులు సబ్మిట్ జరగలేదని వారికి అనుమతి కోసం ఎదురు చూస్తున్నారని తెలిపారు.2026 జనవరి 14 న డి ఆర్ ఏరియర్స్ జమ జరిగి, ఇప్పటికీ రెండు నెలలు పైన అవుతున్నదని,ఇంకా పెండింగ్ అరియర్స్ జమలు జరగలేదని తెలిపారు. జమ జరగని వారు ఆత్రుతగా ఎదురుచూస్తున్నారని తెలిపారు. 2020 ఏప్రిల్ 1నుంచి 2021 డిసెంబర్ మధ్య పదవి విరమణ చేసిన వారు పాత స్కేల్స్ ప్రకారం సంపాదిత లీవ్ తీసుకున్నారని , వీరికి పిఆర్సి ప్రకారం సంపాదిత సెలవు డిఫరెన్స్ రావాల్సి ఉన్నదన్నారు. పిఆర్సి జీవో ప్రకారం చెల్లించవలసి ఉన్నా నేటికీ అనుమతి ఇవ్వలేదని తెలిపారు. రాష్ట్రప్రభుత్వం ప్రకటించిన మొత్తములో వీటికి సంబంధించిన ప్రస్తావన లేదని దీనివల్ల పెన్షనర్లు లక్షలాది రూపాయలు నష్టపోతున్నారని పేర్కొన్నారు.జేఏసీ నాయకులు,రాష్ట్ర పెన్షనర్ల సంఘాలవారు ఈ అంశాన్ని ప్రభుత్వం,అధికారులు దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు. 16 లక్షలకు పెంచిన గ్రాడ్యూటీ కేసు కోర్టులో ఉన్నదని , దీన్ని కూడా న్యాయంగా పెన్షనర్లకు రావలసి ఉన్నదన్నారు.ప్రభుత్వంతో మాట్లాడాలని 2018 జులై 1తరువాత పదవీ విరమణ చేసిన పెన్షనర్లు కోరుతున్నారు. ఈ జీవో వలన 4 లక్షల రూపాయలు పెన్షనర్లు కోల్పోయారని ఇది చాలా అన్యాయమన్నారు. వేలాది రూపాయల రావలసిన పిఆర్సి ఎరియర్స్ పై కూడా ప్రయత్నం చేయవలసిందిగా కోరారు.

## గణపవరంలో హెచ్ పి వి వ్యాక్సిన్ కార్యక్రమం



**అత్తిలి /గణపవరం ఏప్రిల్ 4 (ప్రభాతవార్త )**గణపవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో హెచ్ పి వి వ్యాక్సిన్ కార్యక్రమాన్ని వైద్యాధికారి డాక్టర్ కె. ఓంకార్ నాథ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ టీకాను 14 సంవత్సరాలు నిండిన బాలికలు తప్పనిసరిగా వేయించు కోవడం వల్ల గర్భాశయ క్యాన్సర్ భవిష్యత్తులో రాకుండా కాపాడుకోవచ్చని తెలిపారు.అర్హులైన బాలికలకు రోజువారీగా వ్యాక్సిన్ చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలోకమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ జె విల్సన్ బాబు, ఓగిరాల పరిమళ స్టాఫ్ నర్స్ పి . ఏసు జ్యోతి, ఎం .నల్లయ్య , నున్న పాప,టి. రూత్ కుమారి ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

